సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 207
మంగళవారం 18-10-2022


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'


కార్ల్‌సన్‌పై గుకేశ్ గెలుపు
చెస్ ప్రపంచ చాంపియన్‌కు షాక్ ఇచ్చిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ - 12లో


రుణ రేట్లు పెంచిన ఎస్‌బీఐ
25 బేసిస్ పాయింట్లు పెరిగి 7.95 శాతానికి చేరిక - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


96 శాతం ఓటింగ్
కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవి కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించిన పోలింగ్‌లో 96% మంది ఓటు వేశారని ఆ పార్టీ తెలిపింది.
వివరాలు 6లో



సీజేఐ నియామకానికి ఆమోదం
సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డీవై చంద్రచూడ్ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు.
వివరాలు 6లో


9.8 వేల కోట్ల విరాళం
ప్రపంచవ్యాప్తంగా పోలియోపై సాగే పోరాటానికి గేట్స్ ఫౌండేషన్ సుమారు రూ.9.8 వేల కోట్ల విరాళం ప్రకటించింది.
వివరాలు 6లో


వాతావరణ మార్పులతో ముప్పు
ఐపీసీసీ అంచనా వేసినట్లే వాతావరణ మార్పులతో వచ్చి పడుతున్న అకాల వరదలు, కరువులతో దేశాలు అతలాకుతలం అవుతున్నాయి.
వివరాలు 6లో

న్యూస్‌రీల్

అరెస్ట్ అవుతానన్న భయం లేదు



సీబీఐ ద్వారా తప్పుడు కేసులు బనాయించి తనను జైలుకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆరోపించారు. అరెస్టు భయం తనకు లేదన్నారు.
వివరాలు 6లో ▸

రాజధాని వ్యాజ్యాలను నవంబర్ 28న విచారిస్తాం



రాజధాని ప్రాంతాన్ని ఆరు నెలల్లో అభివృద్ధి చేయాలని తామిచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో.. రాజధానిపై తమ ముందున్న వ్యాజ్యాలను నవంబర్ 28న విచారిస్తామని హైకోర్టు తెలిపింది.
వివరాలు 14లో ▸

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు



విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం తగదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఐ జాతీయ మహాసభ తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేసింది.
వివరాలు 14లో ▸

ఇదండీ సంగతి



రూపాయి ఓడిపోలేదు!
జస్ట్ డాలర్ గెలిచిందంతే!!

నాడు దోచుకో.. పంచుకో.. తినుకో

నేడు నేరుగా లబ్ధి

వాళ్లది డీపీటీ.. మాది డీబీటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- రైతు సంక్షేమం కోసం దేశంలోనే ఇన్ని కార్యక్రమాలు జరగలేదు
- అన్నదాతలకు మూడున్నరేళ్లలో రూ.1.33 లక్షల కోట్లు అందించాం
- వ్యవసాయ ఉత్పత్తులూ భారీగా పెరిగాయి.. టీడీపీ హయాంలో ఏటా కరువు మండలాలే
- మూడున్నరేళ్లుగా కరువుకు తావే లేదు.. రైతన్నల్లో సంతోషం
- ఇన్ని మంచి పనులు చేస్తున్నా ఎల్లో మీడియా, చంద్రబాబు, దత్తపుత్రుడు కుతంత్రాలు
- ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిల్చే పార్టీలు, మీడియా సంస్థలు కూలిపోవాలి
- ఆళ్లగడ్డలో రైతు భరోసా నిధులను విడుదల చేసిన సీఎం జగన్
- 50.92 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.2,096 కోట్లు జమ

2లో



ఆళ్లగడ్డలో రైతు భరోసా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

"మూడేళ్ల నాలుగు నెలల్లో మీ బిడ్డ బటన్ నొక్కి అక్షరాలా రూ.1,74,931 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేశాడు. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష లేదు. అప్పట్లోనూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్.. అప్పుల గ్రోత్‌రేట్ కూడా అప్పటి కంటే ఇప్పుడే తక్కువ. మరి మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు? చంద్రబాబు ఎందుకు చేయలేదు? అని ఆలోచించాలని అడుగుతున్నా! అప్పట్లో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, చంద్రబాబు, దత్తపుత్రుడు దోచుకో, పంచుకో, తినుకో అనేలా డీపీటీ అనే పథకం అమలయ్యేది. ఈ రోజు మీ బిడ్డ 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్'తో బటన్ నొక్కుతున్నాడు. నేరుగా మీ ఖాతాల్లో సొమ్ము జమ అవుతోంది. అప్పట్లో అంత దోచుకున్నా ఎవడూ రాయడు, ప్రశ్నించడు. కారణం.. వీరందరిదీ గజదొంగల ముఠా కాబట్టి! దేవుడి దయతో, మీ అందరికీ మంచి చేసే పరిస్థితులు రావాలని, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీలు, మీడియా సంస్థలు కూలిపోవాలని కోరుతున్నా.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో విద్యార్థుల భారీ బైక్ ర్యాలీకి జెండా ఊపుతున్న స్పీకర్ తమ్మినేని



విశాఖ రాజధాని కోసం
నినదించిన విద్యార్థి లోకం

2లో

- శ్రీకాకుళం జిల్లాలో భారీ బైక్ ర్యాలీ
- మూడు రాజధానులకు మద్దతుగా ఉద్యమించిన విద్యార్థులు.. రియల్ ఎస్టేట్ రాజధాని తమకొద్దంటూ నినాదాలు

అమరావతి యాత్రకు తూర్పు గోదావరి జిల్లా కాతేరు వద్ద నల్ల బెలూన్లతో ప్రజల నిరసన



రియల్ ఎస్టేట్ రాజధాని వద్దే వద్దు

2లో

- అమరావతి పాదయాత్రికులకు నిరసనల సెగ.. నిరసనకారులను రెచ్చగొట్టిన పాదయాత్రికులు
- తూర్పుగోదావరి జిల్లా కాతేరులో ఉద్రిక్తత

పోలవరం పూర్తికి సంపూర్ణ సహకారం

త్వరితగతిన పూర్తి చేసేందుకు నిధులిస్తామని కేంద్రం హామీ



- సీఎస్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి లేఖ.. ఫలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భగీరథ యత్నాలు
- డయాఫ్రమ్ వాల్ పరిస్థితి, అగాధాల పూడ్చివేత విధానం ఖరారయ్యే దాకా ఈసీఆర్‌ఎఫ్ పనులు చేపట్టలేని వైనం
- ఆలోగా తొలి దశ ముంపు నిర్వాసితులకు వేగంగా పునరావాసం
- అందుకు అవసరమైన నిధులను వేగంగా రీయింబర్స్ చేస్తామన్న కేంద్రం
- వరదలు తగ్గాక 30.5 మీటర్ల ఎత్తుకు దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేయాలి
- ఈసీఆర్‌ఎఫ్ డయాఫ్రమ్ వాల్ భవితవ్యం, అగాధాల పూడ్చివేతపై పరీక్షల వివరాలు సీడబ్ల్యూసీకి పంపాలని సూచన
- వాటి ఆధారంగా సీడబ్ల్యూసీ నిర్ణయం
- సీడబ్ల్యూసీ ఆమోదం ప్రకారం ఈసీఆర్‌ఎఫ్ పనులు

14లో

పాదయాత్ర అడ్డుకోవడానికి
మీరెవరు?



- రాష్ట్రంలో జరిగే పరిస్థితులను న్యాయవ్యవస్థ గమనించాలి
- వైఎస్సార్‌సీపీ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడానికి పత్రికాధిపతుల సహకారం కావాలి
- ఢిల్లీకి వెళ్లను, ఇక్కడే తేల్చుకుంటా
- వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రాకుండా పోరాడుతాం
- విశాఖ నుంచి మంగళగిరికి వచ్చాక మీడియాతో పవన్‌కళ్యాణ్

3లో

ఉత్తరాంధ్ర ఆకాంక్షలను దెబ్బతీస్తావా?

గర్జన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బాబు కుట్రలో భాగంగానే రచ్చచేశావు

- ఉత్తరాంధ్ర ప్రజల ఉసురు నీకు తగలదా?
- మహిళా మంత్రులను చంపుతారా? దళిత మంత్రిపై చెప్పులేస్తారా? బీసీ మంత్రిపై దాడిచేస్తారా?
- ఇదేనా నీ సంస్కృతి, జనసేన సంస్కారం?
- ఎవరో రాసిస్తే చేసే దబాయింపులకు వైఎస్సార్‌సీపీ బాలకార్యకర్త కూడా బెదరదు
- నువ్వొక్కడివే కాదు.. టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు రండి
- ఇక్కడ వైఎస్సార్‌సీపీ వెయిటింగ్.. ఎదుర్కోవడానికి సిద్ధం
- జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు మాజీమంత్రి పేర్ని నాని సవాల్
- 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయం



సాక్షి, అమరావతి: విశాఖపట్నంను కార్యనిర్వాహక రాజధానిగా చేయాలంటూ ఉత్తరాంధ్ర ప్రజలు చేసిన గర్జన నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన కుట్రలో భాగంగానే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ శనివారం అక్కడకు వెళ్లి రచ్చచేశారని మాజీమంత్రి పేర్ని నాని స్పష్టంచేశారు. 'చంద్రబాబు చేసిన కుట్రలో పావుగా విశాఖకు పోయి డ్రామాలు ఆడడం పాపం కాదా? ఉత్తరాంధ్ర ప్రజల ఉసురు మీకు తగలదా?' అంటూ పవన్‌పై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం రాత్రి, అంతకుముందు మచిలీపట్నంలో
మిగతా 3వ పేజీలో ▶

'సాల్ట్' ప్రాజెక్టు అమలు భేష్

ఏపీ సర్కార్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు



ఆంధ్రప్రదేశ్‌లో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు అమలు పురోగతి సంతృప్తికరంగా సాగుతోందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. 15 వేలకు పైగా పాఠశాలల్లో అభ్యాస వాతావరణాన్ని మెరుగుపరిచిందంటూ ఏపీ ప్రభుత్వానికి కితాబిచ్చింది. కరోనా కష్టాల్లో కూడా ప్రభుత్వం సమయానికి నోడల్ ఏజెన్సీలకు నిధులు విడుదల చేసిందని పేర్కొంది. కోవిడ్ నుంచి ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయని ప్రశంసించింది.

14లో

'ఎర్ర'బంగారం మెరుపులు

- రికార్డు స్థాయిలో 5.55 లక్షల ఎకరాల్లో మిరప సాగు
- పూత దశకు చేరిన పంట.. తప్పిన నల్లతామర బెడద
- హెక్టారుకు 40–50 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా
- ప్రస్తుతం రూ.23 వేల నుంచి రూ.27 వేల మధ్య పలుకుతున్న ధర



సాక్షి, అమరావతి: మిరప రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నల్లతామరతో సహా తెగుళ్ల ప్రభావం ఈసారి పెద్దగా లేకపోవడం.. గతేడాది కంటే మిన్నగా దిగుబడులొచ్చే అవకాశం ఉండటం, మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర పలుకుతుండటంతో రైతుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 3.62 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది రికార్డు స్థాయిలో 5.12 లక్షల ఎకరాల్లో సాగైంది. పూతకొచ్చే దశలో విరుచుకుపడిన
మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా

సంజీవయ్య పవర్ ప్లాంట్‌లో 3వ యూనిట్ రెడీ

- 27న జాతికి అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఏపీజెన్‌కో ఎండీ శ్రీధర్ వెల్లడి



3వ యూనిట్‌ను పరిశీలిస్తున్న జెన్‌కో ఎండీ శ్రీధర్, కలెక్టర్ చక్రధర్‌బాబు

ముత్తుకూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడో యూనిట్ ప్రారంభోత్సవానికి సిద్ధమైందని ఏపీ జెన్‌కో ఎండీ శ్రీధర్ తెలిపారు. మూడో యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న జాతికి అంకితం చేస్తారని ఆయన చెప్పారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, జెన్‌కో డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజుతో కలిసి పవర్ ప్లాంట్‌లో శ్రీధర్ పర్యటించారు. నిర్మాణంలో ఉన్న పైలాన్, థర్మల్ కేంద్రం నమూనా, 3వ యూనిట్ కంట్రోల్ చాంబర్లను పరిశీలించారు. అనంతరం ఏపీజెన్‌కో అతిథి గృహంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో వారు సమావేశమై ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లపై చర్చించారు.

హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలి

వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఏపీ శ్యాక్స్ పీడీ నవీన్‌కుమార్

సాక్షి, అమరావతి: మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ సెంటర్(ఐసీటీసీ)లలో హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఏపీ శ్యాక్స్ పీడీ నవీన్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లాల్లోని మొబైల్ ఐసీటీసీ నిర్వాహకులు, అధికారులతో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఏపీ శ్యాక్స్ కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని దగ్గరలోని యాంటి రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) సెంటర్‌కు రెఫర్ చేయడంతో పాటు వారి జీవిత భాగస్వామికి నిర్ధారణ పరీక్ష చేయాలన్నారు.

రేపటి నుంచి ఈఏపీసెట్ తుదివిడత కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ ఈఏపీసెట్-2022 అడ్మిషన్ల కౌన్సెలింగ్ తుది విడత ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు ఆప్షన్ల నమోదు, 23న ఆప్షన్ల సవరణ, 26న సీట్ల కేటాయింపు చేస్తారని తెలిపారు. ఈ నెల 26 నుంచి 31వరకు సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజీల్లో చేరిక ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 79956 81678, 79958 65456 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మీడియా అవార్డుల నామినేషన్లకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: జాతీయ మీడియా అవార్డులు-2022 కోసం భారత ఎన్నికల సంఘం నామినేషన్లను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లలో విశేష చైతన్యం కల్పించిన వారికి ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. 2012 నుంచి చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్(టెలివిజన్), ఎలక్ట్రానిక్(రేడియో), ఆన్‌లైన్ (ఇంటర్నెట్/సోషల్ మీడియా) మొత్తం 4 కేటగిరీల్లో అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. నవంబర్ 30లోగా ఎంట్రీలను భారత ఎన్నికల సంఘానికి పంపించాలని సూచించారు. 2023 జనవరి 25న జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున ఉత్తమ మీడియా సంస్థలకు అవార్డులు ప్రదానం చేస్తారని చెప్పారు. ఎంట్రీలను లవ్ కుష్ యాదవ్, అండర్ సెక్రటరీ కమ్యూనికేషన్స్, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వాచన్ సదన్, అశోక్ రోడ్, న్యూఢిల్లీ-110001కు పంపించాలని సూచించారు. మెయిల్‌ను media&division-@eci.gov.in కు పంపించాలని కోరారు.

అటవీశాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అటవీశాఖకు సంబంధించి ఎనిమిది ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులు, అలాగే సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగంలోని ఎనిమిది కంప్యూటర్ డ్రాఫ్ట్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేయవచ్చునని పేర్కొన్నారు. కంప్యూటర్ డ్రాఫ్ట్‌మెన్ పోస్టులకు నవంబర్ 10 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఇతర వివరాలకు 'హెచ్‌టీటీపీఎస్://పీఎస్‌సీ.ఏపీ.జీఓవీ.ఐఎన్'ను సందర్శించాలని కోరారు.



సభలో నాగలితో సీఎం వైఎస్ జగన్



నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన సభకు హాజరైన భారీ జన సందోహం

నాడు.. దోచుకో.. పంచుకో.. తినుకో
నేడు నేరుగా లబ్ధి

వాళ్లది డీపీటీ.. మాది డీబీటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: రైతన్నలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని త్రికరణ శుద్ధిగా విశ్వసించి అడుగులు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అన్నదాతకు ఇంతగా తోడ్పాటు అందిస్తున్న ప్రభుత్వం దేశ చరిత్రలో బహుశా ఎప్పుడూ, ఎక్కడా లేదని మీ బిడ్డగా చెప్పేందుకు గర్విస్తున్నానన్నారు. ప్రతి పథకాన్ని క్రమం తప్పకుండా కాలెండర్‌లో పేర్కొన్న ప్రకారం అమలు చేస్తూ ప్రతి కుటుంబానికీ అండగా నిలిచామన్నారు. వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం రెండో విడత సాయాన్ని ముఖ్యమంత్రి జగన్ సోమవారం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ప్రారంభించారు. బటన్ నొక్కి 50.92 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.2,096 కోట్లు జమ చేశారు. రైతులకు మెగా చెక్ అందచేసి లబ్ధిదారులతో ముచ్చటించారు. వారితో కలసి గ్రూపు ఫోటో దిగారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

82 శాతం చిన్నకారు రైతులకు ప్రయోజనం

మూడేళ్ల నాలుగు నెలల పాలనలో దేశంలోని 27 రాష్ట్రాలలో ఎక్కడా లేనివిధంగా రైతు పక్షపాత ప్రభుత్వంగా అడుగులు వేస్తున్నాం. రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి ఎలా ఉందని ఒక్కసారి ఆలోచిస్తే కేవలం అర హెక్టార్ అంటే 1.25 ఎకరాలలోపు ఉన్నవారు 68 శాతం మంది ఉన్నారు. ఒక హెక్టార్ వరకూ అంటే 2.5 ఎకరాలు ఉన్న రైతులు 82 శాతం ఉన్నారు. వీరికి ఏటా రూ.13,500 చొప్పున అందిస్తున్న రైతుభరోసా సొమ్ము దాదాపు 80 శాతం పెట్టుబడి ఖర్చులకు సరిపోతుంది. అన్నదాతలు అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదు. పంట వేసే సమయానికి పెట్టుబడి సొమ్ము చేతికందాలి. ఎక్కడా లంచాలు, వివక్షకు తావులేకుండా నేరుగా, పారదర్శకంగా ఖాతాల్లో ఈ డబ్బులు మూడు విడతల్లో జమ చేస్తున్నాం. ఏటా ఖరీఫ్ సీజన్ మొదలయ్యేలోపే మే నెలలో రూ.7,500, పంటలు కోతకు వచ్చేముందు అక్టోబర్‌లో మరో రూ.4 వేలు, సంక్రాంతి సందర్భంగా జనవరిలో మరో రూ.2 వేలు కలిపి మొత్తం రూ.13,500 రైతన్నల చేతిలో పెడుతున్నాం. మూడున్నరేళ్లలో వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్ ద్వారా దాదాపు 50.50 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.25,971 కోట్లకుపైగా నేరుగా జమ చేశాం. అంటే ఏటా దాదాపు రూ.7 వేల కోట్లను రైతన్నల ఖాతాల్లోకి జమ చేస్తున్నాం. ఒక్కో కుటుంబానికి రూ.51 వేలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశామని సగర్వంగా తెలియజేస్తున్నా.

కౌలు, గిరిజన రైతులకూ భరోసా

పట్టా భూములున్న రైతులే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు కౌలు రైతులు, దేవదాయశాఖ భూములు సాగు చేస్తున్న వారు, గిరిజన ప్రాంతాల్లో ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలున్న రైతులకు కూడా రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 చొప్పున అందచేసి మంచి చేయగలుగుతున్నాం. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయానికి సాయంగా, అన్నదాతలకు అన్ని రకాలుగా అండగా ఉండేందుకు మూడేళ్ల నాలుగు నెలల్లో రైతన్నల కోసం రూ.1.33 లక్షల కోట్లు వ్యయం చేశామని సగర్వంగా తెలియజేస్తున్నా. ఈ సందర్భంగా కొన్ని విషయాలు మీ అందరి ముందు ఉంచుతున్నా. ఒక్కసారి ఆలోచన చేయాలని కోరుతున్నా.



మన ఖర్మ ఏమిటంటే..

మన ఖర్మ ఏమిటంటే గొప్ప మార్పులు జరుగుతున్నా, పండ్లు కాసే చెట్టుకే రాళ్ల పడతాయి అన్నట్లు రాష్ట్రంలో ఏం జరుగుతోందో మీకు తెలుసు. ఇన్ని మంచి విషయాలు జరుగుతున్నా ఎల్లో మీడియా.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, చంద్రబాబు ఒక దత్తపుత్రుడు రాష్ట్రంలో ఏం చేస్తున్నారో మీకు తెలిసిందే. వారి చేతిలో మీడియా ఉంది. వారు రాసిందే రాత. వారు ఏం చూపిస్తే అదే జరుగుతుందనే భ్రమలో ఉన్నారు. గర్వం పెరిగిపోయింది. వారికి చెందిన వ్యక్తి సీఎం స్థానంలో లేరు కాబట్టి ఆయన్ను తెచ్చేందుకు కుతంత్రాలు పన్నుతున్నారు. ఆనాటికి, ఇప్పటికి తేడా గమనించాలని అడుగుతున్నా. ఆ రోజు కంటే ఈ రోజు మన బతుకులు బాగున్నాయా? లేదా? అనేది మీరు గుండెలపై చేతులు వేసుకుని ఆలోచించాలని కోరుతున్నా. రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో మీకు తెలిసిందే. వరిపాలన ఎలా సాగిందో మీరంతా చూసిన వారే. కేవలం రైతుల కోసం మీ బిడ్డ రూ.1,33,527 కోట్లు ఖర్చు చేశాడు. ఇది మీ ప్రభుత్వం. మీ బిడ్డ బటన్ నొక్కి మూడున్నరేళ్లలో అక్షరాలా రూ.1,74,931 కోట్లు నేరుగా మీ బ్యాంకు ఖాతాల్లో జమ చేశాడు. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష లేకుండా పారదర్శకంగా బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు వెళ్లింది. ఇలాంటి మంచి పనులు చేస్తున్న మీ బిడ్డను ఆశీర్వదించాలని కోరుతున్నా.

మాఫీ పేరుతో బాబు మోసం

చంద్రబాబు పాలన చూశారు.. మన పాలన చూస్తున్నారు. తేడా ఒక్కసారి గమనించాలని కోరుతున్నా. చంద్రబాబు హయాంలో రుణమాఫీ చేస్తామని మోసం చేశారు. దీంతో రైతులు బ్యాంకు గడప ఎక్కలేని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి కాకుండా తిరిగి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోగలుగుతున్నారు. చంద్రబాబు పాలనలో ఐదేళ్లలో వడ్డీలేని రుణాల కింద చెల్లించింది రూ.685 కోట్లు మాత్రమే. 2016 అక్టోబర్ నుంచి ఆ పథకాన్ని రద్దు చేశారు. మీ బిడ్డ తిరిగి ఆ పథకాన్ని తీసుకొచ్చాడు. ఈ మూడేళ్ల నాలుగు నెలల్లో రూ.1,282 కోట్లు చెల్లించామని సగర్వంగా చెబుతున్నా. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రంగంలో రూ.3,64,624 కోట్లు అందితే ఇప్పుడు మూడేళ్ల నాలుగు నెలల పాలనలోనే రూ.5,48,518 కోట్లు అందచేశాం. తేడా గమనించాలని కోరుతున్నా. చంద్రబాబు హయాంలో పంటల బీమా ప్రీమియంలో రైతులు, ప్రభుత్వం వాటాలు చెల్లించాలి. ఈ రెండూ సక్రమంగా జరగకపోవడంతో రైతులకు ఇన్సూరెన్స్‌లో నష్టం వాటిల్లింది. ఆ ఐదేళ్లలో 30.80 లక్షల మందికి రూ.3,412 కోట్లు మాత్రమే బీమా పరిహారంగా దక్కితే ఈ మూడేళ్ల నాలుగు నెలల్లో 44.28 లక్షల మంది రైతులకు రూ.6,684 కోట్ల బీమా సొమ్ము రైతుల ఖాతాల్లోకి జమ అయింది. తేడా మీరే గమనించండి. రైతన్నల నుంచి బీమా సొమ్ము ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదు. ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తోంది.

పంట నష్టపోతే అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ

చంద్రబాబు హయాంలో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే పట్టించుకున్న పరిస్థితి లేదు. ఇన్‌పుట్ సబ్సిడీ పేరుకే ఉండేది. ఎప్పుడు వస్తుందో? ఎవరికి వస్తుందో? తెలియదు. చివరకు 2017-18, 2018-19 కాలానికి రూ.2,558 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని పూర్తిగా ఎగ్గొట్టారు. ఇప్పుడు మూడేళ్ల నాలుగు నెలల్లో 20.85 లక్షల మంది రైతులకు రూ.1,800 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందచేశాం. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోపే డబ్బులు జమ అవుతున్నాయి. ఈ - క్రాప్ డేటాతో సహా సోషల్ ఆడిట్‌తో పారదర్శకంగా ప్రతీ రైతన్నకు తోడుగా నిలుస్తున్నాం. ఇవాళ ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ రైతులకు క్రమం తప్పకుండా అందుతోంది. గొప్ప మార్పు కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 10,778 ఆర్బీకేలు ప్రతీ గ్రామంలో రైతులను చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. విత్తనం మొదలు పంట విక్రయం వరకూ వారికి తోడుగా నిలుస్తున్నాయి. ఈ - క్రాపింగ్ ప్రతీ గ్రామంలో నమోదవుతోంది. ఈ- డేటా ఆధారంగా ప్రతీ రైతుకు, ప్రతీ పథకం వివక్ష, లంచం లేకుండా నేరుగా అందుతోంది.

నాడు ఏటా కరువే.. నేడు తావే లేదు

దేవుడి దయ, మీ అందరి దీవెనలతో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్ల నాలుగు నెలల్లో ఒక్కటంటే ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించాల్సిన అవసరం రాలేదు. చంద్రబాబు ఐదేళ్ల పాలనను గమనిస్తే 2014లో 238 కరువు మండలాలు, 2015లో 359 మండలాలు, 2016లో 301 మండలాలు, 2017లో 121 మండలాలు, 2018 ఖరీఫ్‌లో 347, రబీలో మరో 257 కరువు మండలాలు ప్రకటించారు. చంద్రబాబు, కరువు రెండూ కవల పిల్లలే అన్నట్లుగా పాలన సాగింది. మంచి చేస్తున్న మన ప్రభుత్వానికి దేవుడి ఆశీస్సులు కూడా పుష్కలంగా ఉన్నాయి. మంచి వర్షాలు కురుస్తున్నాయి. అక్టోబర్ వరకూ సాధారణ వర్షపాతం 668 మిల్లీమీటర్లు కాగా ఈ సీజన్‌లో ఇప్పటికే 695 మిల్లీమీటర్లు నమోదైంది. సాధారణం కంటే 4 శాతం అధికంగా వర్షాలు కురిసి రాష్ట్రం కళకళలాడుతోంది. 21 జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైతే ఐదు జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ కురిసింది. గతంలో 13 జిల్లాలు, ఇప్పుడు 26 జిల్లాలను తీసుకున్నా మూడేళ్ల నాలుగు నెలల్లో ఏ ఒక్క ఏడాదీ ఒక్క కరువు మండలం కూడా ప్రకటించాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలో మంచి వర్షాలు కురుస్తున్నాయి. చంద్రబాబు పాలనతో పోల్చితే పంటల విస్తీర్ణంతో పాటు ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా పెరిగింది. నాడు ఐదేళ్లలో సగటున 154 లక్షల టన్నులు ఉత్పత్తి కాగా మన ప్రభుత్వంలో 167.24 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి అవుతున్నాయి. అంటే 13.24 టన్నుల ఉత్పత్తి పెరిగింది. ప్రతీ గ్రామంలో రైతన్నలు సంతోషంగా ఉన్నారని ఈ దిగుబడులే చెబుతున్నాయి. దీంతోపాటు వ్యవసాయంపై ఆధారపడ్డ రైతు కార్మికులకు కూడా మంచి జరిగిందని లెక్కలు చెబుతున్నాయి. మూడేళ్ల నాలుగు నెలల్లో ప్రతీ రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉంది. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలలో కూడా భూగర్భ జలాలు రికార్డు స్థాయిలో పెరిగాయి.

పరిహారం అందని కుటుంబం ఒక్కటీ లేదు

రైతన్నలు ఎవరైనా దురదృష్టవశాత్తూ ఆత్మహత్య చేసుకుంటే గతంలో సానుభూతి కూడా చూపలేదు. అసలు ఆత్మహత్య చేసుకున్నవారు రైతులే కాదనే మాటలు వినిపించేవి. ఇప్పుడు పట్టాదారు పాసు పుస్తకాలు కలిగి ఉంటే వెంటనే ప్రభుత్వం స్పందిస్తోంది. పాసు పుస్తకాలున్న అన్నదాతలు ఆత్మహత్యకు పాల్పడితే పరిహారం అందని రైతన్నలు ఒక్కరంటే ఒక్కరూ లేరు. సీసీఆర్‌టీ కార్డులున్న కౌలు రైతులు దురదృష్టవశాత్తూ ఆత్మహత్య చేసుకుంటే వారికీ పరిహారం అందించాం.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

ఆర్బీకేలను యూనిట్‌గా తీసుకుని అర్హులెవరూ మిగిలిపోకుండా సంతృప్త స్థాయిలో మంచి చేస్తున్నాం. పగటిపూట 9 గంటల ఉచిత కరెంటు, కనీస మద్దతు ధరతో పంటల కొనుగోలు, ఆక్వా రైతులను ఆదుకోవడం, రైతులను భాగస్వాములుగా చేసి ఆర్బీకే స్థాయిలో సలహా మండళ్ల ఏర్పాటు, వ్యవసాయ ఉపకరణాలను కమ్యూనిటీ సెంటర్ల ద్వారా అందించడం, పాడి రైతులకు సైతం గిట్టుబాటు ధర లభించేలా అమూల్ సంస్థను తేవడం లాంటి విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి.

హాజరైన మంత్రులు, ప్రజా ప్రతినిధులు

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్థన్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్‌రెడ్డి, చల్లా భగీరథరెడ్డి, ఇషాక్‌బాషా, ఎమ్మెల్యేలు బిజేంద్రారెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రామిరెడ్డి, ఆర్థర్, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆర్బీకేలతో రైతన్నలకు అండగా

ఆర్బీకేల ద్వారా ఈ క్రాపింగ్, ఇన్సూరెన్స్ చేస్తున్నాం. రైతన్నకు తోడుగా నిలిచి ప్రతి పథకం అందిస్తూ నష్టపోకుండా చూస్తున్నాం. చంద్రబాబు హయాంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అంతా కల్తీనే. వీటితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కల్తీని అరికట్టేందుకు రాష్ట్రంలో కేవలం 12 ల్యాబ్‌లు మాత్రమే చంద్రబాబు పాలనలో ఉండగా మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 147 ల్యాబ్‌లు నియోజకవర్గ స్థాయిలో కనిపిస్తున్నాయి. 70 ల్యాబ్‌లు ఇప్పటికే పూర్తై రైతులకు సేవలు అందిస్తున్నాయి. తక్కిన 77 నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో రెండు ల్యాబ్‌లు, 4 ప్రాంతీయ సెంటర్లు అందుబాటులోకి వస్తున్నాయి.



దివ్యాంగురాలికి ముఖ్యమంత్రి భరోసా

సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయం

నంద్యాల: అనారోగ్యంతో బాధపడుతూ తనను కలిసిన ఓ దివ్యాంగురాలికి నేనున్నానంటూ సీఎం జగన్ భరోసా కల్పించారు. నంద్యాల జగజ్జననీనగర్‌కు చెందిన హేమ పావని మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్యం చేయించుకునే స్తోమత ఆ కుటుంబానికి లేదు. సీఎం జగన్ సోమవారం ఆళ్లగడ్డ వస్తున్న విషయం తెలుసుకొని బాధితురాలు తండ్రి శ్రీనివాసులుతో కలిసి హెలిపాడ్ వద్దకు వచ్చింది. సీఎంను కలసి తన సమస్యను మొరపెట్టుకుంది. దీనిపై వెంటనే స్పందించిన సీఎం జగన్ నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిని పిలిచి బాధితురాలి వైద్యానికి ఎంత ఖర్చు అవుతుందో తనకు వివరాలు ఇవ్వాలని సూచించారు. అంతేగాకుండా తక్షణమే ఆ బాలికకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష మంజూరు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

భయం పోయింది..

నాకు ఏడెకరాల పొలం ఉంది. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయం చేసేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయం అంటే పండుగ అయింది. భయం పోయింది. రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయి. ఇప్పటిదాకా రూ.48 వేలు వచ్చాయి. ఇప్పుడు మరో రూ.4 వేలు జమ కానున్నాయి. అంతే కాకుండా పంట నష్టం కింద రూ.30 వేలు వచ్చిందన్నా. రైతులంతా సీహెచ్‌ఎస్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని సబ్సిడీపై ట్రాక్టర్, టిల్లర్, కంకుల మిషన్ తీసుకున్నాం. దీనికి రూ.13.50 లక్షలు కాగా సబ్సిడీ కింద రూ.5.40 లక్షలు ఖాతాలో జమ అయ్యాయి. గతంలో మందు మూటలు (ఎరువులు) కావాలంటే మండల కేంద్రం శిరివెళ్లకు వెళ్లి క్యూలైన్లలో నిలుచుని అనేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు గ్రామంలోని ఆర్బీకేలో మందు బస్తాలు అందచేస్తూ అటు నుంచి అటే పొలానికి వెళ్లి చల్లుకునేలా చేశావన్నా. రైతుల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు చేపట్టిన సీఎం రుణం ఏమిచ్చి తీర్చుకోగలం?

– గుర్రప్ప ,రైతు, కోటపాడు

నిన్ను చూడాలని..

గతంలో రెండు సార్లు వరి పంట నష్టపోవడంతో బాధపడ్డా. మళ్లీ పంట వేయక ముందే పంట నష్టం కింద రూ.40 వేలు జమ చేశారు. బ్యాంకులో రూ.20 వేలు తీసుకుంటే సున్నా వడ్డీ కింద రూ.3 వేలిచ్చారు. అధికారులే మా దగ్గరకు వచ్చి వివరించి ప్రయోజనం చేకూరుస్తున్నారు. మీరు సీఎం అయ్యాకే మా నాన్నకు పింఛన్ వచ్చిందన్నా. నాన్నకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా గుండె జబ్బుకు, కంటి వెలుగు కింద అమ్మకు కంటి ఆపరేషన్ చేశారు. వాళ్లిద్దరూ నిన్ను చూడాలని మీటింగ్‌కు వచ్చి జనంలో కూర్చున్నారన్నా. మానాన్న బతికారంటే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ చలువే కారణం. రైతుల కోసం మీరు చేపడుతున్న పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– కృష్ణ నాయక్, రైతు, బాచేపల్లె తాండ

విశాఖ రాజధాని కోసం నినదించిన విద్యార్థి లోకం

శ్రీకాకుళం జిల్లాలో భారీ బైక్ ర్యాలీ

ఆమదాలవలస: విశాఖలో కార్యనిర్వాహక రాజధాని కోసం విద్యార్థులు ఉద్యమించారు. రియల్ ఎస్టేట్ రాజధాని తమకు వద్దని.. మూడు రాజధానులే ముద్దంటూ నినదించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పట్టణంలో మూడు రాజధానులకు మద్దతుగా సోమవారం విద్యార్థులు బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది విదార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మూడు రాజధానులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని వీడి.. అభివృద్ధి దిశగా ముందుకు సాగాలంటే.. విశాఖ రాజధాని అయితేనే సాధ్యమంటూ గొంతెత్తారు. బైక్ ర్యాలీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశ ప్రాంగణానికి చేరుకుంది.



బైక్ ర్యాలీలో విద్యార్థులు తదితరులు

రాజధానిని సాధించే వరకూ పోరాటం ఆగదు : స్పీకర్ తమ్మినేని సీతారాం

సభలో ఏపీ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చేసుకునే వరకూ పోరాటం ఆపొద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాజధాని సాధన అన్నది ఉత్తరాంధ్ర ప్రజలందరి బాధ్యతని చెప్పారు. భావి తరాల కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నారని.. దీనికి అందరూ మద్దతు పలకాలని కోరారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలకనుగుణంగా న్యాయమూర్తులు సహకరించి.. రాజధానుల నిర్మాణాలకు అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ అభివృద్ధి చెందితేనే ఉత్తరాంధ్రకు విస్తృతంగా పరిశ్రమలొస్తాయని, తద్వారా యువతకు మెండుగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరిగి.. వలసలు ఆగిపోతాయని స్పీకర్ వివరించారు. తొలుత వైఎస్సార్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి స్పీకర్ నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు.

రియల్ ఎస్టేట్ రాజధాని వద్దే వద్దు..

- అమరావతి పాదయాత్రికులకు నిరసనల సెగ
- నిరసనకారులను రెచ్చగొట్టిన పాదయాత్రికులు

రాజమహేంద్రవరం రూరల్ : అమరావతి రైతు పాదయాత్రకు తూర్పుగోదావరిజిల్లా కాతేరులో నిరసన సెగ తగిలింది. సోమవారం సాయంత్రం కాతేరు వెంకటాద్రిగార్డెన్స్ నుంచి ప్రారంభమైన పాదయాత్రకు మల్లయ్యపేట గాంధీ బొమ్మ సమీపంలో స్థానికులు ప్లకార్డులు, నల్లబెలూన్లు చేబూని నిరసన వ్యక్తం చేశారు. వారికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తోడయ్యాయి. రియల్ ఎస్టేట్ రాజధాని వద్దే వద్దు.. మూడు రాజధానులే ముద్దు.. అంటూ నినాదాలు చేస్తూ గాల్లోకి బెలూన్లు ఎగురవేశారు.



నిరసన కారులను అడ్డుకుంటున్న పోలీసులు

నిరసనకారులను పాదయాత్రికులు కవ్వించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అమరావతి పాదయాత్రికులు తారాజువ్వలు వదులుతూ నిరసనకారులను రెచ్చగొట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పాడ్డాయి. పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలనూ నియంత్రించారు.

9 మంది జనసేన నాయకులకు రిమాండ్

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయంలో ఈ నెల 15న మంత్రుల వాహనాలపై దాడులకు పాల్పడిన కేసులో తొమ్మిదిమంది జనసేన నాయకులకు కోర్టు రిమాండ్ విధించింది. దాడులకు పాల్పడిన 70 మందిపై విశాఖ పోలీసులు కేసులు నమోదు చేసి ఆదివారం రాత్రి ఏడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. వీరిలో కోన తాతారావు, సుందరపు విజయకుమార్, పంచకర్ల సందీప్, కొల్లూరి రూప, పీతల మూర్తియాదవ్, పీవీఎస్ఎన్ రాజు, చింతపల్లి శ్రీను, బోగి శ్రీనివాస పటాన్నాయక్, రాయపురెడ్డి కృష్ణకు జడ్జి 14రోజుల రిమాండ్ విధించారు. మరో 61మందిని రూ.10 వేల చొప్పున సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఆ కేసులను కొట్టేయండి .. హైకోర్టులో జనసేన పిటిషన్లు

మంత్రులపై దాడి పేరుతో విశాఖ విమానాశ్రయ పోలీసులు నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని కోరుతూ జనసేన ఉపాధ్యక్షుడు బి. మహేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విశాఖ విమానాశ్రయ ఘటనలకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేయడానికి వీల్లేదని, ఆ అధికారం సీఐఎస్ఎఫ్‌కు మాత్రమే ఉందని పేర్కొన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు తన విధులకు ఆటంకం కలిగించారంటూ పెందుర్తి సీఐ నాగేశ్వరరావు ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసును కూడా కొట్టేయాలని మహేందర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది.


రాజకీయ కుట్రలో కాపు యువత భాగం కావొద్దు

అడపా శేషగిరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొందరు చేస్తున్న రాజకీయ కుట్రలో కాపు యువత భాగం కావొద్దని కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ అడపా శేషగిరి కోరారు. ఆయన సోమవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ కొందరు నాయకులు ప్రాంతాలు, కులాల మధ్య వైషమ్యాలు పెంచి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. కాపులందరూ సంయమనం పాటించాలని కోరారు. కాపుల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన రియల్ హీరో సీఎం జగన్ అని కొనియాడారు.

ప్రకాశం బ్యారేజ్ నుంచి 3.50 లక్షల క్యూసెక్కులు కడలిలోకి



సాక్షి, అమరావతి/విజయపురిసౌత్: కృష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారంతో పోల్చితే సోమవారం కాస్త తగ్గింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజీలోకి చేరుతున్న ప్రవాహం 3,53,077 క్యూసెక్కులకు తగ్గింది. కృష్ణా డెల్టాకు 2,827 క్యూసెక్కులను విడుదల చేస్తూ బ్యారేజీలో మిగులుగా ఉన్న 3,50,250 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. కృష్ణా, తుంగభద్ర, హంద్రీల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి సోమవారం రాత్రి 9 గంటలకు 2,25,962 క్యూసెక్కులు చేరుతుండగా.. స్పిల్ వే 5 గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,39,455 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,647 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.6 అడుగుల్లో 213.40 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి 8 క్రస్ట్ గేట్ల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లు వదులుతున్నారు. పులిచింతలలో కూడా గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేస్తూ.. వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి వరద స్థిరంగా కొనసాగుతోంది.

అండమాన్‌లో ఉపరితల ఆవర్తనం

సాక్షి, అమరావతి: అండమాన్ సముద్రం, దాని పరిసరాల్లో ఓ ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్నట్లు తెలిపింది. 20వ తేదీ నాటికి ఇది తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారి.. ఆ తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి నైరుతి బంగాళాఖాతంలో బలపడే అవకాశం ఉందని తెలిపింది. 24వ తేదీ నాటికి ఈ అల్పపీడనం తుపానుగా బలపడేందుకు అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అల్పపీడనంగా బలపడిన తర్వాత ఇది మయన్మార్ వైపు ప్రయాణిస్తుందని కొన్ని వాతావరణ సంస్థలు చెబుతుండగా, ఏపీ-ఒడిశా తీరం వైపు వస్తుందని మరికొన్ని వాతావరణ సంస్థలు చెబుతున్నాయి. ఏపీ-ఒడిశా తీరం వైపు కదిలితే రాష్ట్రంపై దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది.

యువత ఆవేశాన్ని సొమ్ము చేసుకుంటున్న పవన్

- మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజం
- పవన్ మూడోసారి కాపులను మోసం చేస్తున్నారు
- చంద్రబాబుకు గంపగుత్తగా అమ్మేందుకు సిద్ధంగా ఉన్నారు
- ఆయనకు కాపు యువత దూరంగా ఉండాలి



సాక్షి ప్రతినిధి కాకినాడ: యువత ఆవేశాన్ని ప్యాకేజీలతో సొమ్ము చేసుకుంటూ రాష్ట్రంలో అశాంతికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రయత్నిస్తున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. కాపులను మూడోసారి మోసం చేసి చంద్రబాబుకు గంపగుత్తగా అమ్మేందుకు సిద్ధంగా ఉన్న పవన్ నిజస్వరూపాన్ని కాపు అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు గుర్తించాలని, ఆయనకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. మంత్రి సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. పవన్ మాటలు విని ఒక్క కాపు కులస్తుడైనా చంద్రబాబుకు సహకరిస్తే రంగా ఆత్మ క్షోభిస్తుందని అన్నారు. రంగా హత్యలో ప్రధాన ముద్దాయి చంద్రబాబేనని, కాదని బాబు చెప్పగలరా అని ప్రశ్నించారు. రంగా హత్య జరిగినప్పుడు అనేక మంది కాపులపై కేసులు పెట్టి, సంవత్సరాలుగా కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. నాడు ముద్రగడ పద్మనాభంను పలకరించడానికి దాసరి, చిరంజీవి వస్తే చంద్రబాబు ఆదేశాలతో ఎయిర్‌పోర్టులో ఆపేశారని తెలిపారు. అందుకు భిన్నంగా నేడు పవన్ కల్యాణ్‌ను పూర్తి భద్రతతో నేరుగా హోటల్‌లో దింపారని చెప్పారు. అదే చంద్రబాబుకు, వైఎస్ జగన్‌కు తేడా అని అన్నారు. ఆకలి కేకలతో కోనసీమ మహిళలు రోడ్డెక్కితే చంద్రబాబు కేసులు పెట్టి వేధించిన విషయం మరచిపోవద్దన్నారు. వారిపై అన్యాయంగా చంద్రబాబు పెట్టిన కేసులను జగన్ సీఎం అయ్యాక మానవతా దృక్పథంతో ఎత్తేశారని తెలిపారు. గవర్నర్ వద్దకు వెళ్లి పవన్ ఏమి చెబుతారని నిలదీశారు. 'సీఎం జగన్ సంక్షేమ పాలనతో చంద్రబాబుకు దిక్కు లేకుండా పోయింది. నీవే బాబు చేతిలో పావుగా మారి రాష్ట్రంలో అశాంతికి కారణమవుతావని, బ్రోకర్లకు అమరావతి రాజధాని కావాలని చెబుతావా..' అని నిలదీశారు. విశాఖ గర్జనలో కోట్లాది ప్రజల ఆకాంక్ష ప్రస్ఫుటమైందని అన్నారు. లక్షలాది ప్రజలు భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తరలివచ్చి వికేంద్రీకరణకు మద్దతిచ్చారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ కూడా అమరావతిలో శాసన రాజధాని ఉండాలని కోరుకుంటున్నారని తెలుసుకోవాలన్నారు.

ఉత్తరాంధ్ర ఆకాంక్షలను దెబ్బతీస్తావా?

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఉడత ఊపులకు తాను భయపడేది లేదంటూ పవన్ సినీఫక్కీలో డైలాగ్ కొట్టారంటూ ఎద్దేవాచేశారు. 'మీ సినిమా డైలాగ్‌లకు, ఎవరో రాసిస్తే చెప్పే దబాయింపులకు వైఎస్సార్‌సీపీలో బాలకార్యకర్త కూడా భయపడడు' అని చెప్పారు. ఇక్కడే ఉంటా.. వైఎస్సార్‌సీపీని ఎదుర్కొంటా.. అంటూ పవన్ బీరాలు పలుకుతున్నారని.. 'నువ్వొక్కడివే కాదు.. టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు అందరూ కట్టకట్టుకుని రండి.. మేం ఇక్కడ వెయిటింగ్.. అందరూ కలిసొచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధం' అంటూ సవాల్ విసిరారు. మూడేళ్ల నాలుగు నెలలుగా రాష్ట్రంలో సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను మరుగునపరిచి.. మీరు, చంద్రబాబు ఎన్ని పథకాలు రచించినా.. ప్రజల్లో సీఎం వైఎస్ జగన్ వేసుకున్న బలమైన ముద్రను చెరపలేరు' అని తేల్చి చెప్పారు. పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

మాట మార్చినందుకే ఉద్వేగం..

2019 ఎన్నికల ముందు వరకూ అమరావతి అసలు రాజధానే కాదని, అది ఒక కుల రాజధాని, అది అందరి రాజధాని కాదని.. పవన్‌కళ్యాణ్, లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ, సీపీఎం, సీపీఐ, బీజేపీకి సంబంధించిన ఐవైఆర్ కృష్ణారావు అన్నారు. ఇవాళ వారు విశాఖలో ఎగ్జిక్యూటివ్ రాజధాని, కర్నూలులో హైకోర్టును వ్యతిరేకిస్తున్నామని మాటమార్చారు. మరీ ప్రత్యేకించి డిక్కీ బలిసిన కోడి చికెన్ షాప్‌కు వెళ్లి తొడగొట్టినట్లుగా అమరావతి నుంచి విశాఖకు వెళ్లి, అక్కడ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అవసరంలేదని, అంతా తమకే కావాలని తొడ గొట్టే పరిస్థితి ఉంటే ఉత్తరాంధ్ర వారిలో భావోద్వేగం పెరగదా? ఉత్తరాంధ్ర మేధావులు జేఏసీ ఏర్పాటుచేసుకుని గర్జనకు పిలుపునిస్తే, వైఎస్సార్‌సీపీ మద్దతు ఇచ్చింది. ఆ విషయం కూడా తెలియకుండా అధికారంలో ఉండి గర్జన ఏమిటి? అని మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనం.

> **మాట మార్చడానికి పవన్ ఐకాన్**
>
> పూటకో మాట, నెలకో మాట, ఏడాదికో మాట. ప్రతి ఎన్నికలప్పుడు ఒక్కో మాట. ఏ మాత్రం నిబద్ధత లేని, నిలకడలేని రాజకీయ నాయకుడు ఎవరైనా ఉన్నారా? అంటే అది ఒక్క పవన్‌కళ్యాణ్ మాత్రమే. అందులో ఆయన నిష్ణాతుడు. నిలకడలేనితనానికి పవన్ ఓ ఐకాన్.

మంత్రులను బూతులు తిడతారా?

విమానాశ్రయం వద్ద జనసేన కార్యకర్తలు.. మంత్రులను పచ్చి బూతులు తిట్టారు. బీసీ మంత్రి రజినిని సిగ్గుతో చచ్చిపోయేలా తిట్టారు. మరో మహిళా మంత్రి రోజాను చంపడానికి ప్రయత్నించారు. జనసేన కార్యకర్తలు కర్రలతో దాడిచేస్తే రోజా వ్యక్తిగత సహాయకుడి తల పగిలి తొమ్మిది కుట్లుపడ్డాయి. దళిత మంత్రి నాగార్జున మీద చెప్పులు వేస్తారా? మరో బీసీ మంత్రి జోగి రమేష్‌పై దాడిచేస్తారా? ఇదేనా పవన్ సంస్కారం, జనసేన సంస్కృతి?

ప్రజలు ఇబ్బందుల్ని చెప్పడం తప్పా?

రోడ్ల మీద జనం అల్లాడుతున్నారు కాబట్టి, మీరు కారులో నేరుగా హోటల్‌కు వెళ్లమని పోలీసు అధికారులు చెబితే.. దాన్ని పవన్ కల్యాణ్ తప్పుపట్టడం విడ్డూరం. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించవద్దని చెబితే, దాన్ని కూడా తప్పుపట్టడం అవివేకం. పవన్ సిగ్గు విడిచి, బరితెగించి మాట్లాడుతున్నాడు. తమ పార్టీ కార్యకర్తను జైలులో కొట్టారని అంటున్నాడు. మళ్లీ ఆయనే తమ వారిని స్టేషన్ బెయిల్ ఇచ్చి తీసుకువచ్చానని చెప్పాడు. అవేం పొంతనలేని మాటలు.

అట్టుకు పది అట్లు పెడతాం..

తాను విధానపరమైన విమర్శలు చేస్తానని పవన్ చెప్పాడు. సీఎం వైఎస్ జగన్‌పై, మాజీమంత్రులు అవంతి శ్రీనివాస్, వెలంపల్లి శ్రీనివాస్, మంత్రి అంబటి రాంబాబు గురించి, నా గురించి మాట్లాడినవి విధానపరమైనవా? వ్యక్తిగతమైనవా? గతంలో చలమలశెట్టి సునిల్, రామచంద్రపురంలో తోట త్రిమూర్తులు, కాకినాడ రూరల్‌లో కన్నబాబు, భీమవరంలో గ్రంధి శ్రీనివాస్ గురించి మాట్లాడింది విధానపరమైందా? వ్యక్తిగతమైందా? ప్రజలకు ఏవీ గుర్తులేవనుకుంటున్నారా? ఇది సినిమా కాదు. నీవు తంతే పడిపోవడానికి. ఇది వైఎస్సార్‌సీపీ.. అట్టుకు పది అట్లు పెడతాం. వాయినానికి 10 వాయినాలు ఇస్తాం.

వికేంద్రీకరణ అంటే..

ఇక 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసి ముక్కలు ముక్కలు చేశారని పవన్ అవివేకంగా మాట్లాడారు. ఆ నిర్ణయంవల్ల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. చివరకు పవన్ పార్ట్‌నర్ చంద్రబాబు కూడా తన నియోజకవర్గ కేంద్రం కుప్పంను రెవెన్యూ డివిజన్ చేయమని కోరుతూ సీఎంకు లేఖ రాశారు. ఇక బాలకృష్ణ హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయమని కోరారు.

హత్యాయత్నం చేస్తే చర్యలు వద్దా..

ఎయిర్‌పోర్టులోకి వచ్చి హత్యాయత్నం చేస్తే పోలీసులు ఊరుకుంటారా? గతంలో ఒక పేపర్‌లో మీ మీద వార్త రాస్తే, రివాల్వర్‌తో ఆ పత్రిక ఆఫీస్‌కు వెళ్లి బెదిరించావా? లేదా? ఆ స్వేచ్ఛ నీకు ఉన్నప్పుడు మంత్రుల మీద హత్యాయత్నం చేస్తే, ఏం చర్యలు తీసుకోవద్దని ఎలా అంటావు? అలాగే, రూ.3 వేల పెన్షన్ అడిగితే బెదిరిస్తున్నామని పవన్ పచ్చి అబద్ధాలు చెప్పాడు. ఎవరు పెన్షన్ ఆపాలనుకున్నా ఈ ప్రభుత్వంలో కుదరదు. గొప్ప దానశీల తనను బలపర్చమని పవన్ కోరుతున్నాడు. ఆయనకు అవసరం వచ్చినప్పుడు వారి సహకారం కావాలన్న మాట. నిజానికి.. పవన్ ఇచ్చేది రూ.60 లక్షల చెక్కులు. అది కూడా ఇన్సూరెన్స్ కంపెనీలు ఇచ్చేవే.

2024లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం

2014 ఎన్నికల్లో టీడీపీకి ఓటేయాలని పవన్ కోరారు. 2019లో టీడీపీకి ఓటేయొద్దని అన్నారు. మీరు, ఎల్లో మీడియా, చంద్రబాబు ఎంత విషం చిమ్మినా ప్రజలు తమ గుండెల్లో వైఎస్ జగన్‌కు స్థానం ఇచ్చి 2019లో ఘన విజయాన్ని అందించారు. 2024లో కూడా అదే జరుగుతుంది.

పాదయాత్ర అడ్డుకోవడానికి మీరెవరు?

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకుండా పోరాడుతాం: పవన్

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: అమరావతి మద్దతుదారుల పాదయాత్రను అడ్డుకోవడానికి మంత్రులు, అధికార వైసీపీ నేతలు ఎవరంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. అమరావతి రాజధాని గురించి ఎవరూ మాట్లాడకూడదని.. మూడు రాజధానుల గురించి ఎవరూ నోరెత్తకూడదన్నది వైసీపీ ఆలోచన అని.. తమది పొలిటికల్ పార్టీ అని.. తమకూ ఓ వైఖరి ఉంటుందని చెప్పారు. ప్రత్యేక విమానంలో సోమవారం విశాఖపట్నం నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చి, అక్కడ నుంచి మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. 'ఏపీ మళ్లీ మూడు ముక్కలుగా విడిపోవాలా. అదా వైసీపీ కోరిక? తిప్పికొడితే 13 జిల్లాలు, వాటిని 26 ముక్కలు చేశారు. దానికి పాలనా సౌలభ్యం అన్నారు. దీనికీ అంతు ఉండాలిగా. ఎక్కడో ఒకచోట ఆగాలి. దీనిని ప్రజలు కూడా గ్రహించాలి. ఉత్తరాంధ్ర, కులం, మతం అంటూ కొట్టుకుంటూ ఉంటే అభివృద్ధి ఎక్కడ ఉంటుంది? దయచేసి ప్రజలందరూ ఆలోచించాలి. విశాఖ ఘటనలకు సంబంధించి మా పార్టీ నేతలపై కేసులు పెడుతున్నారు. వాళ్ల కాన్వాయి మీద దాడి జరగాలని వాళ్లే ప్లాన్ చేసుకుని మా పార్టీ నేతలపై కేసులు పెట్టారు. మా కేడర్‌కు మనోధైర్యం ఇచ్చా. విశాఖ ఘటనలపై హైకోర్టులో పిటిషన్ వేశాం.

తెలంగాణ రాష్ట్ర సాధన నిర్వీర్యం అవుతుంది

న్యాయ వ్యవస్థకు కూడా అప్పీల్ చేసుకుంటున్నా. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజున జరుగుతున్న దానిని సునిశితంగా గమనించండి. రాష్ట్ర న్యాయ శాఖను కూడా అభ్యర్థిస్తున్నా. అలాగే, రాష్ట్రం బాగుపడాలంటే వైసీపీ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలి. అలా చేయకపోతే తెలంగాణ రాష్ట్ర సాధన కూడా నిర్వీర్యం అయిపోతుంది. ఇందుకు పత్రికాధిపతులు, చానల్స్ యజమానుల సహకారం కోరుతున్నా. ఇక రాష్ట్రంలో జరిగే విషయాలను బీజేపీకి చెప్పవచ్చుగా అని విశాఖలోని కొందరు జర్నలిస్టులు నన్ను ప్రశ్నించారు. కానీ, ఇక్కడ యుద్ధం మీరే చేయండి అని బీజేపీ అగ్రనాయకులు అంటారు. నేను ఢిల్లీకి వెళ్లను. ఇక్కడే తేల్చుకుంటా.. వైసీపీ అధికారంలోకి రాకుండా పోరాడుతా. కోర్టు అంశాలతో పాటు గవర్నర్‌ను కలిసే అంశాలపై చర్చిస్తా.' అని చెప్పారు.



విజయవాడలో మీడియాతో మాట్లాడుతున్న పవన్. పక్కన సోము వీర్రాజు

బెజవాడకు పవన్ పయనం

అంతకుముందు.. మూడు రోజుల పాటు విశాఖలో మకాం వేసి హంగామా చేసిన పవన్ తాను ఆశించిన ఫలితం దక్కకపోవడంతో విజయవాడకు తిరిగొచ్చారు. ఈనెల 16న జనవాణి కోసం 15వ తేదీ సాయంత్రం ఆయన విశాఖ వెళ్లారు. అదే రోజు మంత్రుల కార్లపై విశాఖ విమానాశ్రయంలో జనసేన రౌడీమూకలు దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పవన్ హోటల్‌కు వెళ్లిపోవడం.. ఆ మర్నాడు జనవాణి జరిగే పోర్టు స్టేడియం వద్ద ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ నేతలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో జనవాణిని నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో దానిని వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత అరెస్టయిన జనసేన రౌడీమూకలను విడిచిపెట్టే వరకు విశాఖలోనే ఉంటానని పవన్ బీరాలు పలికారు. కానీ, సోమవారం మధ్యాహ్నం విజయవాడకు ప్రత్యేక విమానంలో వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

పవన్‌ సోము వీర్రాజు భేటీ

విజయవాడ నోవాటెల్ హోటల్‌లో బసచేసిన పవన్ కల్యాణ్‌తో సోమవారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు భేటీ అయ్యారు. విశాఖపట్నంలో చోటుచేసుకున్న సంఘటనలతోపాటు తాజా రాజకీయ పరిణామాలపై ఇద్దరు చర్చించుకున్నారు. అనంతరం వీరిద్దరూ మీడియాతో మాట్లాడారు. తమకు లభిస్తున్న ఆదరణను చూడలేక అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. విశాఖలో జరిగిన దాడి పూర్తిగా ప్రభుత్వ కుట్రగా భావిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఈ అంశాలను కేంద్ర పెద్దలకు కూడా వివరించగా.. వైసీపీ ప్రభుత్వ దుశ్చర్యలపై పోరాడాలని సూచించారని వారు చెప్పారు. విశాఖ గర్జన రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సర్డ్ ప్రోగ్రాంగా అభివర్ణించారు. జన స్పందన లేకపోవడంతో కుట్రకు తెరలేపారని, ఇక నుంచి ఇటువంటి వాటిని అడ్డుకుని తీరుతామని వారిద్దరూ స్పష్టంచేశారు.

- జనాభా లెక్కల్లో కులాలవారీగా బీసీ గణన చేపట్టాలని వైఎస్సార్ సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను నవంబరు 2న తగిన ధర్మాసనం విచారిస్తుందని సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ తెలిపారు. గతంలో యూపీకి చెందిన టింకుసైని దాఖలు చేసిన పిటిషన్‌కు దీనిని జత చేస్తున్నట్లు జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ బేలా.ఎం.త్రివేదితో కూడిన ధర్మాసనం తెలిపింది.

కేరళకు ఆంధ్రా ధాన్యం

- లక్ష టన్నుల ధాన్యం, 60 వేల టన్నుల బియ్యం అవసరమన్న కేరళ
- మంత్రి కారుమూరితో కేరళ మంత్రి భేటీ



సాక్షి, అమరావతి: కేరళ ప్రజలు తమ ఆహారంలో ఎంతో ఇష్టంగా తినే ఎంటీయూ–3626 జయ రకం ధాన్యం (బోండాలు), బియ్యం కొనుగోలుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపిస్తోందని ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వెల్లడించారు. విజయవాడలోని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కేరళ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి జీఆర్ అనిల్‌తో కూడిన కేరళ ఉన్నతాధికారుల బృందం మంత్రి కారుమూరితో భేటీ అయింది. తమకు కావాల్సిన సరుకుల సరఫరా సాధ్యాసాధ్యాలపై చర్చించారు. అనంతరం మంత్రి కారుమూరి మాట్లాడుతూ లక్ష టన్నుల ధాన్యం, 60 వేల టన్నుల బియ్యం కావాలని కేరళ ప్రభుత్వం అడగటం శుభపరిణామమని పేర్కొన్నారు. నెలకు 550 టన్నుల ఎండుమిర్చి, కంది, పెసర, మినుములు సైతం సరఫరా చేయాలని కోరిందని తెలిపారు. ఈ నెల 21న మరోసారి సమావేశమై ధరలు నిర్ణయిస్తామన్నారు. ధరలు రైతులకు లాభదాయకంగా ఉంటే ఈ నెల 27న కేరళలో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందం చేసుకుంటాయని వివరించారు. పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్, డైరెక్టర్ విజయ సునీత, ఏపీ ఎస్‌సీఎస్‌సీఎల్ ఎండీ వీరపాండియన్, సహకార సంఘాల కమిషనర్ ఎ.బాబు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో రూ.30 కోట్లు కొట్టేశారు

టీడీపీ హయాంలో నెల్లూరు జిల్లాలో పౌర సరఫాల శాఖ నిధులు రూ. 30 కోట్లు కొల్లగొట్టారని మంత్రి కారుమూరి చెప్పారు. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్నామని, ప్రాథమికంగా ఐదుగురి తప్పు తేలడంతో వారిని సస్పెండ్ చేసినట్టు చెప్పారు. నిందితుల ఆస్తులను అటాచ్ చేశామని, మొత్తం వసూలు చేస్తామన్నారు. తప్పుడు పత్రాలతో చెరువులు, కాలువలు, తోటలను వరి పొలాలుగా చూపి ఈ-క్రాపింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇకపై ధాన్యం నగదుతో పాటే రవాణా చార్జీలనూ రైతుల అకౌంట్‌లో వేస్తామన్నారు.



ఏనాడో కవిగన్న కలలు వాస్తవం కాకపోవు.
ఎందుకంటే ఏమూలో సృష్టికర్త కలల్ని పంచుకుంటున్నాడు అతను.
– చలం

సాక్షి

మంగళవారం, అక్టోబర్, 18

చేజేతులా... చిక్కుల్లో!

బోరిస్ జాన్సన్ స్థానంలో పగ్గాలు చేపట్టి నిండా నలభై రోజులు కాకుండానే బ్రిటన్ ప్రధాని లిజ్ ట్రస్ పదవి చిక్కుల్లో పడింది. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉంటే, అధిక ఆదాయం ఉన్నవారికి పన్నులు తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాల పర్యవసానం ఇది. కన్జర్వేటివ్ పార్టీలోనూ, ఆర్థిక విపణుల్లోనూ ఆమె కష్టాల కడలి నుంచి గట్టెక్కడం సులభం కాదనే పరిస్థితి వచ్చింది. చెలరేగిన విమర్శలతో లిజ్ గత శుక్రవారం తన ఆర్థిక మంత్రి క్వాసీ క్వార్టెంగ్‌ను పదవీచ్యుతుణ్ణి చేశారు. ఆయన ప్రవేశపెట్టిన 'మినీ బడ్జెట్'లోని ఆర్థిక ప్యాకేజీ అంశాలను కొత్త ఆర్థికమంత్రి ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇది సంచలనమే! పన్నుల్లో కోతలపై లిజ్ వెనక్కితగ్గడం తాత్కాలిక ప్రశాంతతను తేవచ్చు. కానీ, పార్టీలో అసంతృప్తిని ఎదుర్కోవడానికీ, దేశాన్ని ఆర్థిక పురోగతి పథంలో నడిపించడానికీ ఇది సరిపోతుందా?

సెప్టెంబర్ 23న లిజ్, అప్పటి ఆమె సహచర ఆర్థిక మంత్రి చేపట్టిన మితవాద పక్ష ప్రణాళిక ఎదురుతన్నింది. 1980లలో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ స్ఫూర్తితో 4500 కోట్ల పౌండ్ల (5 వేల కోట్ల డాలర్లు) మేర పన్నుల్లో కోతలు విధించారు. దానికి స్పందనగా విపణులు కుప్పకూలాయి. లక్షలాది బ్రిటన్ పౌరులకు అప్పుల ఖర్చు పెరిగింది. వచ్చే ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ విజయావకాశాలు పడిపోయాయి. లిజ్ పగ్గాలు చేపట్టి కొద్దివారాలైనా గడవక ముందే సొంత పార్టీలో బాహాటంగా అసంతృప్తి అగ్గి రాజుకుంది. చిత్రమేమిటంటే, లిజ్ ఆర్థిక అజెండాను సాక్షాత్తూ ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బైడెన్ సైతం విమర్శించడం! నాటకీయ పరిస్థితుల్లో సొంత స్నేహితుడిని ఆర్థిక మంత్రిగా తప్పించాల్సి రావడం బాధాకరమేనని లిజ్ సైతం అంగీకరిస్తున్నారు.

నిజానికి, విమర్శలతో వెనక్కి తీసుకున్న ఆ ఆర్థిక ప్యాకేజీ రూపకర్తల్లో లిజ్‌కూ సమాన భాగం ఉంది. కాకపోతే ఆర్థికమంత్రి బలిపశువయ్యారు. కొత్తగా ఆ శాఖ చేపట్టిన జెరెమీ హంట్ పని కత్తి మీద సామే. బ్రిటన్ దేశస్థులను వేధిస్తున్న జీవన వ్యయానికి పరిష్కారం చూపడం పెద్ద పనే. ఈ అక్టోబర్ 31న కొత్త బడ్జెట్ ప్లాన్‌ను దేశానికి ఆయన అందించాల్సి ఉంటుంది. దేశంలో మరింత ఆర్థిక కష్టాలు తప్పవన్న విశ్లేషణల నేపథ్యంలో, గడ్డు పరిస్థితులను ప్రజలతో నిజాయతీగా పంచుకొని, కఠినమైన కార్యాచరణకు దిగక తప్పదు. గతంలో కార్పొరేషన్ ట్యాక్స్‌ను 19 శాతం వద్దే స్తంభింపజేస్తామన్న లిజ్ వచ్చే ఏడాది దాన్ని 25 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించాల్సి వచ్చింది.

మరోపక్క ఇప్పటికే లిజ్ సొంత పార్టీ నుంచే కనీసం నలుగురు ఎంపీలు ఆమెను ప్రధాని పీఠం నుంచి దిగిపోవాల్సిందిగా బాహాటంగా అన్నారు. ఆరు వారాలకే ఆమె పదవీకాలం దాదాపు ముగింపునకు వచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఆమె తప్పుకొంటే వారసుడు నిర్ణయమయ్యే దాకా పదవిలో కొనసాగుతారు. అదే జరిగితే, రెండు నెలల లోపలే రెండోసారి కన్జర్వేటివ్ పార్టీ సారథికి ఎన్నిక తప్పదు. అయితే, ఈసారి సుదీర్ఘ పోటీ లేకుండా ఒకరి వెంటే పార్టీ నిలిచి, పట్టాభిషేకం చేయవచ్చు. బ్రెగ్జిట్ రిఫరెండమ్ పర్యవసానాల తర్వాత 2016లో డేవిడ్ కామెరాన్ స్థానంలో థెరెసా మే అలానే వచ్చారు. కానీ, అప్పటితో పోలిస్తే ఇప్పుడు అనేక వర్గాలుగా చీలి, అంతర్గత విభేదాలున్న పార్టీలో అది సాధ్యమా అన్నది చూడాలి.

పరిస్థితి చూస్తుంటే, ప్రధాని పదవికి లిజ్‌తో పోటీపడి, తగిన మద్దతు కూడగట్టుకోలేకపోయిన సొంత పార్టీ నేత రిషీ సునాక్‌కు ఉన్నట్టుండి దశ తిరిగేలా కనిపిస్తోంది. లిజ్ స్థానంలోకి రేపో, మాపో ఆయన వస్తారనే అంచనాలూ సాగుతున్నాయి. ప్రస్తుతానికి రిషి పెదవి విప్పడం లేదు. అంచనాలెలా ఉన్నా లిజ్ అంత తేలిగ్గా రాజీనామా చేయకపోవచ్చు. ప్రస్తుతానికి ఆమె దృష్టి సవాళ్ళను సమర్థంగా ఎదుర్కోవడం మీదే ఉన్నట్టుంది. ఒకవేళ లిజ్‌ను బలవంతాన సారథ్యం నుంచి తప్పించాలంటే, అవిశ్వాస తీర్మానం పెట్టాలి. కానీ, 12 నెలల కాలంలో ఒకసారే పోటీ జరగాలనే కన్జర్వేటివ్ పార్టీ నియమావళి ప్రకారం కొత్తగా ఎన్నికైన నేతపై సహచరులు అవిశ్వాస తీర్మానం పెట్టలేరు.

వాస్తవ పరిస్థితులు గ్రహించకుండా, తొందరపాటు మినీ బడ్జెట్ ప్రతిపాదనలతో విశ్వసనీయత దెబ్బతిన్న లిజ్ ప్రస్తుత గండం నుంచి గట్టెక్కితే ఆశ్చర్యమే. కాకపోతే ఆ ఆర్థిక ప్రతిపాదనల ఉపసంహరణతో ఆర్థిక మార్కెట్లు కొంత తెరిపినపడ్డాయి. కొద్దిపాటి ఆర్థిక స్థిరత్వంతో ఊపిరి పీల్చుకొనే ఖాళీ దొరికింది గనక ఇప్పుడామె ఏవైనా అద్భుతాలు చేయాలి. సోమవారం రాత్రి క్యాబినెట్‌కిస్తున్న విందులో పార్టీలోని అసంతృప్త వర్గాలను కలిసి ఆమె చల్లబరిచే ప్రయత్నం చేస్తారు. మరో ఛాన్స్ ఏమిటంటే, 2025 జనవరిలో జరగాల్సిన బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలను ముందే జరపడం. ఎన్నికల సర్వేలలో కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ లేనంతగా ప్రధాన ప్రతిపక్షం లేబర్ పార్టీకి సానుకూల పవనాలు వీస్తున్నవేళ అధికార పార్టీ ఎంపీలు ఆ సాహసానికి దిగుతారనుకోలేం.

తప్పుడు రాజకీయ నిర్ణయాలు దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడతాయనడానికి బ్రిటన్ తాజా ఉదాహరణ. కోవిడ్ టీకాలు, కరోనా వేళ విందులతో పార్టీ ప్రతిష్ఠనూ, వచ్చే ఎన్నికల్లో విజయావకాశాలనూ జాన్సన్ దిగజారిస్తే, ఆశాకిరణమనుకున్న లిజ్ తప్పుడు విధానాలతో అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని ఇంకా కిందకు నెట్టారు. ద్రవ్యోల్బణాన్నీ, యుద్ధంతో పైపైకి ఎగబాకుతున్న చమురు ధరల్నీ అడ్డుకొనే చర్యలకు బదులు పన్నుల కోతకు దిగారు. తీరా చివరికి కోతల్ని ఉపసంహరించుకొని, ఎన్నడూ లేని 'యూ' టర్న్ తీసుకోవాల్సి వచ్చింది. లిజ్ పుణ్యమా అని పాత అప్రతిష్ఠకు తోడు అసమర్థ ప్రభుత్వమనే ముద్ర పడింది. కథలో కొత్త మలుపు ఏమిటన్నది ఆసక్తిగా మారింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి: బ.అష్టమి ఉ.9.44 వరకు
తదుపరి నవమి, నక్షత్రం: పుష్యమి పూర్తి (24 గంటలు)
వర్జ్యం: ప.1.14 నుండి 3.01 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.14 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.31 నుండి 11.21 వరకు
అమృతఘడియలు: రా.11.51 నుండి 1.37 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

తడాఖా కాదు... అబద్ధాల తడిక

తనపై 'ఈనాడు' రాసిన కథనాన్ని ఖండించిన విజయసాయి

- రిజిస్ట్రేషన్ విలువలు చూపించి తక్కువకే కొనేశారంటూ గగ్గోలు
- అది కూడా విజయసాయిరెడ్డి చక్రం తిప్పబట్టేనంటూ దుష్ప్రచారం
- ఇప్పుడు అక్కడ అంతకు మూడురెట్లు ధర ఉందంటూ వక్రీకరణ
- 2019 నుంచే మూడు రాజధానులకు కట్టుబడిన వైఎస్సార్ కాంగ్రెస్
- అందులో భాగంగానే విశాఖ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటన
- 2021లో విశాఖలో భూములు కొంటే అది ఇన్‌సైడర్ ట్రేడింగా?
- మా బంధువులు కొన్నాక అదే ధరకు అక్కడ బోలెడన్ని క్రయవిక్రయాలు
- అవన్నీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను చూస్తే ఇట్టే తెలిసిపోతుంది
- కానీ ఆ వాస్తవాలు చెప్పకుండా... విష ప్రచారమే లక్ష్యంగా 'ఈనాడు' రాతలు
- వాస్తవానికి ఎవరైనా స్థానిక రిజిస్ట్రేషన్ ధరకే రిజిస్టర్ చేయించుకుంటారని తెలీదా?
- సబ్ రిజిస్ట్రార్ వద్ద రికార్డులు చూస్తే వెల్లడయ్యేవి ఆ గణాంకాలే
- అవి పట్టుకుని విషప్రచారానికి దిగుతున్న రామోజీ


ఈనాడు
epaper.eenadu.net
ఇదీ సాయిరెడ్డిగారి
తడాఖా!
- మార్కెట్ ధరలో మూడో వంతుకే విశాఖ శివార్లలో భూములు కొనేసిన ఆయన కుమార్తె, అల్లుడి కంపెనీ
- భోగాపురం బీచ్ కారిడార్ రోడ్డు మొదలైతే వాటి ధర రెట్టింపు
- విశాఖను కార్యనిర్వాహక రాజధాని చేస్తే మరిన్ని రెట్లు పెరిగే అవకాశం
- సాయిరెడ్డి ప్రమేయం లేకుండానే కుమార్తె కంపెనీకి తక్కువ ధరకు భూములొస్తాయా?

విజయసాయి రెడ్డి జోక్యం చేసుకోవటం వల్లే విశాఖ శివార్లలోని భూములు ఆయన కుమార్తె, అల్లుడి కంపెనీకి తక్కువ ధరకు వచ్చాయని దారుణమైన అబద్ధాలు ప్రచురించటంపై 'ఈనాడు'ను, దాని అధిపతి రామోజీరావును వైఎస్సార్ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి దుయ్యబట్టారు. "ఎందుకీ దౌర్భాగ్యపు రాతలు? అక్కడ ఉన్న ధరెంత? మా కుమార్తె, అల్లుడికి చెందిన కంపెనీ కొన్న ధర ఎంత? అక్కడ మిగతా వారు ఇప్పటికీ కొంటున్న ధర ఎంత? అవన్నీ కూడా చెప్పాలిగా? అబద్ధాలు చెబితే అడ్డంగా దొరికిపోతారనే ఇంగిత జ్ఞానం కూడా లేకపోతే ఎలా?" అంటూ మండిపడ్డారు.
విజయ సాయిరెడ్డి జోక్యం వల్లే అవతలి వ్యక్తులు మార్కెట్ ధరకన్నా మూడో వంతు ధరకు అమ్మేశారంటూ "విజయసాయిరెడ్డి గారి తడాఖా" అనే శీర్షికతో సోమవారం 'ఈనాడు' పత్రిక ఓ వార్తను ప్రచురించింది. ఈ వ్యవహారంపై విజయ సాయిరెడ్డి స్పందిస్తూ... "మా బంధువుల కంపెనీ కొన్న తరవాత కూడా... చాలామంది బయటి వ్యక్తులు అక్కడ అదే ధరకు కొన్నారు కదా? అదే సర్వే నెంబర్లో... అంతకంటే తక్కువ ధరకు కూడా కొందరు కొనుగోళ్లు చేశారు కదా? అవన్నీ రిజిస్ట్రేషన్ ఆఫీసు రికార్డుల్లో పారదర్శకంగా కనిపిస్తాయి కదా? రహస్యాలేమీ కాదు కదా? మీకు ఆ విషయాలేవీ తెలియవనుకోవాలా? లేదంటే వారంతా మీ బంధువులా? మీరు వెనకుండి చక్రం తిప్పారు కాబట్టే వారికి ఆ ధరకు వచ్చాయా? నాపై విషప్రచారమే ధ్యేయంగా ఎందుకీ పనికిమాలిన రాతలు?" అంటూ ఎండగట్టారు.
"మీరు రాసిన దాని ప్రకారం చూస్తే... మా బంధువుల సంస్థ కొన్న భూమి 87,714 చదరపు గజాలు. దానికోసం వారు వెచ్చించిన మొత్తం 51.87 కోట్లు. అంటే ... సగటున చదరపు గజం విలువ రూ.6 వేలు. ఈ జాగా కూడా దాదాపు 25 భాగాల్లో విస్తరించి ఉంది. వీటిని కొనటానికి ఆ సంస్థకు దాదాపు ఒక సంవత్సరం పట్టింది. హైదరాబాద్ శివార్లలోని పాల్మాకుల గ్రామంలో ఏకంగా ఐదంటే 5 నెలల వ్యవధిలో 432 ఎకరాలు కొనేసిన మీరు... అది కూడా శంషాబాద్‌లో విమానాశ్రయం వస్తుందని ప్రకటించిన ఐదు నెలలకే మొత్తం ప్రక్రియను పూర్తి చేసిన మీరు... వేరొకరిపై అసత్యాలు చెబుతూ ధర్మపన్నాలు వల్లించటాన్ని ఏమనుకోవాలి రామోజీ? ఇంతకంటే దిగజారుడు పని ఇంకేదీ ఉండదని ఇంకెప్పటికి తెలుస్తుంది మీకు? మీరు చెప్పినట్లుగా మా బంధువులు కొనుగోలు చేసిన సర్వే నెంబర్లలోనే... ఆ తరవాత ఎవరెవరో బయటివ్యక్తులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. మరి వారెంత ధరపెట్టారు? మీరు చెబుతున్నట్లుగా వీరికన్నా మూడింతల ధర పెట్టారా? లేదు కదా? మా వాళ్ల మాదిరే వాళ్లు కూడా గజం దాదాపుగా రూ.6వేల ధరకే కొన్నారు కదా? నిజానిజాలు తెలుసుకున్నాక వార్తలు రాయాలి కదా?" అని వ్యాఖ్యానించారు.

ఇది ఇన్‌సైడర్ ఎలా అవుతుంది రామోజీ?

"2000వ సంవత్సరం సెప్టెంబర్లో శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం వస్తుందని చంద్రబాబు నాయుడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన సరిగ్గా ఐదు నెలల్లో... అంటే 2001 ఫిబ్రవరి ముగిసేసరికి మీరు మీ మార్గదర్శి పేరిట, ఇతర బినామీల పేరిట శంషాబాద్ గ్రామానికి ఆనుకుని ఉండే పాల్మాకులలో ఏకంగా 432 ఎకరాలు కొనుగోలు చేసేశారు. నిజానికి ఇన్ని వందల ఎకరాలు కొనాలంటే భూమి పరిశీలించటం, డాక్యుమెంట్లు చూడటం వంటి పనులకే చాలా సమయం పడుతుంది. కానీ చంద్రబాబు లీక్ చేసిన సమాచారంతో ముందే అంతా సిద్ధం చేసుకుని, ప్రకటన వెలువడిన వెంటనే రిజిస్ట్రేషన్లు ఆరంభించిన మీది కదా ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటే..? దీన్ని ఎవరైనా కాదనగలరా?
ఇక మా బంధువుల విషయానికొస్తే... 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ వికేంద్రీకరణే మా విధానమని మా గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారు చెబుతున్నారు. ఎగ్జిక్యూటివ్ రాజధానిగా విశాఖపట్నం, శాసన, న్యాయ రాజధానులుగా అమరావతి, కర్నూలు ఉంటాయని కూడా ఆయన చెప్పారు. ఇక విశాఖ శివార్లలో మా కుమార్తె, అల్లుడికి చెందిన సంస్థ ఈ భూములు కొన్నది 2021లో. అంటే ప్రకటన వెలువడిన రెండు సంవత్సరాల తరవాత. ఈ లోగా అక్కడ చాలామంది భూములు కొనుక్కున్నారు. ఇప్పటికీ కొంటున్నారు. దీన్ని ఎవరైనా ఇన్‌సైడర్ ట్రేడింగ్ అనగలరా? మరీ ఇంత దారుణమైన రాతలెందుకు?" అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

రిజిస్ట్రేషన్ విలువల గురించి తెలియదా?

"ఎక్కడ, ఎవరు భూములు కొన్నా... ఆ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ ధర ఎంత ఉందో అంతకే రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. వాస్తవంగా అక్కడ ఉండే ధర ఇంకాస్త ఎక్కువ ఉండి ఉండొచ్చు. ఇంతటి కనీస పరిజ్ఞానం 'ఈనాడు'కు లేదనుకోవాలా? మీరు, మీ కుటుంబ సభ్యులు వేల వేల ఎకరాలు కొన్నారు కదా? వాటిలో దేన్నయినా అప్పటికి అక్కడ వాస్తవంగా ఉన్న మార్కెట్ విలువకు కొన్నారా? దాన్ని రిజిస్ట్రేషన్ పత్రాల్లో చూపించారా? ఎందుకీ దౌర్భాగ్యపు రాతలు? పనిగట్టుకుని విష ప్రచారం చేయాలనుకుంటే నోటికొచ్చినట్లు రాసేసుకోవచ్చు. అలా రాసుకోవటానికి కరపత్రాలో, లేదంటే ఏ సామాజిక మాధ్యమాలో పనికొస్తాయి. కానీ ప్రధాన స్రవంతిలో అందరూ చదివే పత్రికలో ఇలాంటి ఎల్లో రాతలు తగునా?" అంటూ రామోజీని దుయ్యబట్టారు.

ఇటీవల అక్కడ జరిగిన కొన్ని లావాదేవీల వివరాలివీ...

ఈ సందర్భంగా ఇటీవల అక్కడ జరిగిన లావాదేవీల వివరాలను విజయసాయిరెడ్డి ఉదాహరణగా చూపించారు. వీటిని బట్టే అక్కడ ఎవరు ఎంత ధర చెల్లిస్తున్నారో తెలుసుకోవచ్చునన్నారు. "మీరు చెప్పినట్లే 2021లో మా బంధువులు కొన్నారనుకుందాం. కానీ ఆ తరవాత చాలా మంది అదే సర్వే నెంబర్లలో భూములు కొనుక్కున్నారు. అందులో కొందరు స్థానిక తెలుగుదేశం నాయకులు కూడా ఉన్నారు. మరి వారు కూడా అదే ధరకు కొన్నారు కదా? ఉదాహరణకు ఓ ఐదారు లావాదేవీలు చూద్దాం. ఇవన్నీ ఇటీవలి కాలంలో జరిగినవి. అంటే మీరు చెప్పిన మూడురెట్లను మించిన ధర ఉండాలి. కానీ వారు కూడా దాదాపుగా ఈ ధరే పెట్టారు. వాస్తవానికి అక్కడున్న రిజిస్ట్రేషన్ ధర అదే కాబట్టి... ఎవరైనా అదే పెడతారు. వీటిని చూస్తే మీ వాదన ఎంత పచ్చి అబద్ధమో ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది కదా రామోజీ!" అంటూ ఆ వివరాలను వెల్లడించారు. అవి...

దాక్యుమెంట్ నెంబర్	గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం	ధర	రిజిస్ట్రేషన్ తేదీ	కొన్న/అమ్మిన వారి పేర్లు
4527/2022	నేరెళ్ల వలస	32/2	225 చ.గ.	6840/చ.గ.	3.9.2022	పి.సంతోష్ కుమార్ / కె. వరప్రసాద్
4160/2022	నేరెళ్ల వలస	32/3	450.99	6696/చ.గ.	17.8.2022	వి.క్రాంతి/ ఎ.పార్థసారథి
3231/2022	నేరెళ్ల వలస	32/3	533	6.500/చ.గ.	25.6.2022	విక్రమాదిత్య శర్మ / సీహెచ్. రాజేంద్ర ప్రసాద్
402/2022	నేరెళ్లవలస	32/9	444.44	6.500/ చ.గ.	28.1.2022	జె.వందన/ ఎ.వి.వర్మ
1879/2021	నేరెళ్లవలస	108/1	1016	6.500/ చ.గ.	31.3.2021	కొమిటినేని పద్మావతి / దండమూడి పాపారావు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎందుకిలా?



మీరు తెల్లటి దుస్తుల్లో ఆఫీసుకు వెళ్లినప్పుడు సాంబారు మీద పడే అవకాశాలు చాలా ఎక్కువ. ఇది మర్ఫీ 4,000వ సూత్రం.
– జనని సంపత్ వీరవల్లి, జర్నలిస్ట్

వైద్యుడికి వందనం



ఆయన 'ఓఆర్‌ఎస్' ఆవిష్కరించారు. టీకాల తర్వాత, లక్షలాది మంది చిన్నారుల ప్రాణాలను కాపాడిన ఆవిష్కరణ అది. దీన్ని ఇరవయ్యో శతాబ్దంలో వైద్యరంగంలో వచ్చిన గొప్ప పురోగతిగా 'లాన్సెట్' అభివర్ణించింది. నోబెల్ అటుండనీ, కనీసం ఆయనకు పద్మ పురస్కారం కూడా రాలేదు. ఆయన డాక్టర్ దిలీప్ మహాలనబిస్. అక్టోబర్ 16న మరణించారు.
– ఆనంద్ రంగనాథన్, సంపాదకుడు

ఏడ్చినట్టే ఉంది...



చెట్ల ఆకులతో పర్యావరణ హిత పళ్లాలను తయారు చేశామని జర్మనీ వారు చెబు తున్నారు. ఒక్క నిమిషం ఆగండి. భారత దేశంలో వీటిని వేయి సంవత్సరాల క్రితమే ఆవిష్కరించారు. వాటిని విస్తళ్లు అందురు!
– రెనీ లిన్, హిందూ యాక్టివిస్ట్

ఎవరు బాధ్యులు



మహమ్మారికి సంబంధించిన చాలా విధానాలు రక్షణ పేరుతో ఆడిన నాటకాలు. చాలామంది ఇప్పుడు వాటిని అంగీకరిస్తున్నారు. కానీ జరిగిన నష్టం సంగతి ఏమిటి? ఉద్యోగాలు, మానవ సంబంధాలు, ఆరోగ్యాలకు జరిగిన నష్టం ఎలా పూడుతుంది? ఇది ఇప్పుడు చర్చించకపోతే చరిత్ర పునరావృతం అవుతుంది.
– రూపాలీ చద్దా, ఫిజీషియన్

'గడప గడపకు ప్రభుత్వం' ఫలితాలు షురూ

విశ్లేషణ



సి. రామచంద్రయ్య

'గడప గడపకు ప్రభుత్వం' అన్నది ఓ విశిష్ట కార్యక్రమం. దీనిని నిరంతరాయంగా అమలు చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంకల్పం ఆహ్వానించదగినది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు అందుతాయి. ప్రభుత్వ పనితీరు, ప్రజాప్రతినిధుల పని తీరుతోపాటు పార్టీ నేతల భాగస్వామ్యం, అప్పగించిన కార్యక్రమాలను విజయవంతం చేయడంలో వారు చూపుతున్న శ్రద్ధ తదితర అంశాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమీక్షించడమేకాక, తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. పనితీరు సరిగాలేని పార్టీ నేతల్ని సున్నితంగా హెచ్చరిస్తున్నారు. పనితీరు మార్చుకోకుంటే తప్పిస్తానని నిష్కర్షగా చెబుతున్నారు. ఇవన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

ప్రజలకిచ్చిన హామీలలో 97 శాతం మేర నెరవేరుస్తున్నందున ప్రజలలో సంతృప్తి స్థాయిలు ఎక్కువగా ఉంటాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంచనా. అయితే, ప్రజల సంతృప్తి అన్నది మొత్తంగా ప్రభుత్వంపైనా, తాము ఎన్నుకొన్న ప్రజాప్రతినిధి పనితీరు పైనా, అధికార యంత్రాంగం స్పందనపైనా ఆధారపడి ఉంటుంది. అందువల్ల తానొక్కణ్ణే కష్టపడితే సరిపోదనీ, ప్రజాప్రతినిధులు అందరూ ప్రజలతో మమేకం కావాలని ముఖ్యమంత్రి జగన్ చెబుతున్న దాంట్లో అబద్ధం ఏముంది? ఎన్ని పనులు చేసినా ఇంకా చేయాల్సినవి ఉంటూనే ఉంటాయి. అలాగే సమన్వయ లోపంతో కొన్ని పనులు జరగడం ఆలస్యం అవుతుంది. 'గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం'లో అక్కడక్కడ ఎమ్మెల్యేలకు ప్రజల నుండి నిరసన వ్యక్తం అవుతున్న మాట నిజమే. అయితే, దాని గురించి బెంబేలు పడాల్సిన అవసరం లేదు. నిజానికి ఏ పాలకుడి వద్ద రాత్రికిరాత్రే అద్భుతాలు సృష్టించే మంత్రదండం ఉండదు. కష్టపడాల్సిందే. అందరి సహకారం స్వీకరించాల్సిందే. అప్పుడే ఫలితాలు అందుతాయి.

రాష్ట్రంలో అమలు జరుగుతున్న 'నవరత్నాల'ను ఒక్క ఏడాది కంటే ఎక్కువ కాలం కొనసాగించలేరని కొందరు జోస్యం చెప్పారు. కానీ, కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ రథ చక్రాలు ఆగలేదు. ఏ ఒక్క పథకమూ కుంటు పడలేదు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 97 శాతం పైగా అమలు చేయడం అన్నది బహుశా దేశ చరిత్రలో ఇదే ప్రథమం కావొచ్చు. ఒకట్రెండు హామీల విషయంలో వాటిని యథాతథంగా అమలు చేయడానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించే స్థితిలో లేనందువల్ల వాటిని మెరుగైన విధానంలో అమలు చేస్తామని ధైర్యంగా, నిజాయితీగా చెప్పగలగడం కూడా గతంలో లేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దాడి చేస్తున్న వారి ప్రధాన ఆరోపణల్లో ఒకటి రాష్ట్రంలో సంపద సృష్టి జరగడం లేదన్నది. ఆంధ్రప్రదేశ్‌లో 2 ఎకరాల భూమి విలువకు ప్రస్తుతం తెలంగాణలో 1 ఎకరం భూమి మాత్రమే వస్తుందట. ఈ ప్రభుత్వం వచ్చాక ఆంధ్రప్రదేశ్‌లో భూముల విలువ పడిపోయిందంటూ కొందరు గగ్గోలు పెడుతున్నారు. నిజానికి, ఇదొక డొల్ల వాదన. వీరి దృష్టిలో సంపద అంటే కేవలం రియల్ ఎస్టేట్. తెలంగాణలో, ప్రత్యేకించి హైదరాబాద్‌లో స్థిరపడిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతి ప్రాంతంలో కోట్లు కుమ్మరించి భూములు కొన్నారు. వాస్తవిక అంతర్గత విలువ (ఇంట్రిన్సిక్ వాల్యూ) లేకుండా కేవలం ప్రచారార్భాటంతో విలువను పెంచి అదే సంపద సృష్టిగా చెప్పుకొన్నారు. నిజానికి అసలైన అభివృద్ధి ఏమిటన్నది ఈ 3 ఏళ్ల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు తెలియజేశారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే సంపద సృష్టి అని నిరూపించారు. పెట్టుబడిదారీ విధానంలో ప్రభుత్వాలు వ్యాపారాలు చేస్తాయి. లాభాలు కోసం వెంపర్లాడతాయి. అదికూడా తమ ప్రయోజనాలు కాపాడే వర్గాల కోసం. కానీ, జగన్ విధానం వ్యక్తిగతమైన లాభాలు అందించే వ్యవస్థను



ప్రోత్సహించడం కాదు. అన్ని వర్గాలను, ప్రత్యేకించి దశాబ్దాలుగా అణగారి ఉన్న వర్గాలను బాగు చేయడం. వారిని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాధికారుల్ని చేయడం. నిజమైన అభివృద్ధి, నిజమైన సంపద సృష్టి అంటే అదే.

కానీ, ఈ అభివృద్ధి నమూనాను కొన్ని వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమను తాము ఎలీట్ వర్గాలుగా భావిస్తూ సమాజంలో ఉన్నత విద్య, వైద్య సదుపాయాలు అనుభవించడం తమ జన్మహక్కుగా, అన్ని రంగాలలో పైచేయి తమదే ఉండాలన్న ఫ్యూడల్ మనస్తత్వంతో... పేదలు, బడుగు బలహీన వర్గాలవారు సామాజిక, ఆర్థిక నిచ్చెనమెట్ల ద్వారా పైకి చేరుకొంటుంటే చూచి సహించలేకపోతున్నారు. ఎలీటిస్ట్ థియరీ (శ్రేష్ఠవర్గ సిద్ధాంతం) ప్రకారం వారు తమకు కొన్ని ప్రత్యేక లక్షణాలను ఆపాదించుకొంటారు. వారు ఇతర వర్గాల ప్రజలతో కలిసి ఉండడానికి ఇష్టపడరు. కానీ, ఆ వర్గాల ఓట్లతోనే అధికారం సంపాదించాలని చూస్తారు.


ఉదాహరణకు అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఈ ఎలీట్ వర్గాలు నిరాకరించాయి. రాజధాని ప్రాంతాన్ని కూడా ఓ గేటెడ్ కమ్యూనిటీలా తయారు చేయాలనుకొన్నారు. అందువల్లనే... అమరావతిలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇస్తే 'సామాజిక సమతుల్యత' దెబ్బతింటుందని పేదలను, బలహీన వర్గాలను అవమానపర్చే విధంగా చెప్పారు. అంటే ప్రభుత్వం అన్నది కొన్ని వర్గాల ప్రయోజనాల కోసమే పని చేయాలా? లేక జగన్ విధానంలో లాగా పేదల కోసం పని చేయాలా? రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి అన్నది కొద్దిమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు పరిమితం చేయాలా? లేక అన్ని వర్గాల ప్రజలకూ అందించాలా?

గత 3 ఏళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వ విజయాలు చెప్పుకోవడానికి చాలానే ఉన్నా... అన్నింటిలోకెల్లా భూమిలేని నిరుపేదలకు 36 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వడం అన్నది ఓ చారిత్రాత్మక విజయం. స్వాతంత్ర్యానంతరం ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. ఇపుడు రాష్ట్ర ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనుసరిస్తున్న ప్రజాకేంద్రక అభివృద్ధి నమూనాకు మద్దతు పలకడం. సామాన్యులు, పేదలూ 2024లో కూడా వైసీపీనే గెలిపించాలి. పెట్టుబడిదారీ వర్గాలకు మరోసారి కోలుకోలేని గుణపాఠం నేర్పాలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

ధనం పరమార్థం

జీవనం గౌరవంగా సాగటానికి ధనం అవసరమే! అయితే, మితిమీరిన ధన కాంక్ష హాని కలిగిస్తుంది. అన్ని చెడుగులకూ ధనమే మూలం. అయితే, ధనం లేని జీవితం దుర్లభం. ఎంత అవసరమో అంత మేరకే ధనం ఉండాలని కోరుకోవాలి. సంపదను సద్వినియోగం చేయకుండా దాచిపెట్టటం వల్ల ఉపయోగం ఉండదు. ఇంట్లో దాచిపెట్టుకున్న ధనం ఎరువు గుట్ట లాంటిదని, తాము తినకుండా, ఎవరికీ పెట్టకుండా దాచుకునే ధనవంతులను చూసి దేహానంతరం తమతో పట్టుకుపోలేరు కదా అని మృత్యు దేవత సమీపానే నిల్చుని నవ్వుకుంటుందని ఓ మహాకవి చెప్పారు. పంట పొలాలకు ఉపయోగించ వలసిన ఎరువులను కొని వాడకుండా ఉండటం వల్ల ప్రయోజనం ఉండదు. పొలాలకు వాడితే మంచి



పంటలు పండుతాయి. అలాగే, తమ దైనిక అవసరాలకు, ఇతరులకు సహాయపడటానికి మాత్రమే ధనం కావాలి. అతిథుల పట్ల ఆదరాభిమానాలు చూపవలసిన బాధ్యత గృహస్తునిది. అతిథి మర్యాదకు ధనం అవసరం.

అరణ్యవాసంలో తమతో పాటు వచ్చిన బ్రాహ్మణులకు, అతిథులకు భోజనం పెట్టటం ఎలా? ఈ మహారణ్యంలో వారిని ఎలా పోషించాలి? తన స్వార్థం కోసం, భోగం కోసం తాను సంపదను కోరట్లేదు, అని ధర్మరాజు బాధ పడతాడు. అప్పుడు ధౌమ్యుడు సూర్యుని పూజించమని, ధర్మరాజుకు ఆదిత్య నామాలు 108 ఉపదేశించి అర్థ వివరణ చేస్తాడు. ధర్మరాజు నిష్ఠతో సూర్య జపం చేయగా సూర్యుడు ప్రత్యక్షమై, ధర్మరాజు అరణ్యాలలో ఉండే 12 ఏళ్ళు అడవులలో లభించే కూరగాయలు, ఆకుకూరలు, పళ్ళు, పాకశాలలో ద్రౌపది వండగా, అక్షయమైన వంటకాలుగా ఏర్పడగలవని చెప్పి, ఒక రాగి పాత్ర ఇచ్చి అదృశ్య మౌతాడు. అదే అక్షయ పాత్ర. మనుషులు నిండు మనసుతో తమ కనీస అవసరాలకు, అతిథి అభ్యాగతులను ఆదరించటానికి తగు ధనం కావాలని దైవాన్ని కోరుకుంటే ప్రతి ఇంటా లోటు లేని అక్షయ పాత్ర ఉంటుంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గుండెకు 'ఆరోగ్యశ్రీ' అండ

- గుండె జబ్బుల బారినపడ్డ పేద, మధ్య తరగతి వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచిత చికిత్స
- ఏడాదిన్నర కాలంలో 73,856 మందికి చికిత్స
- ఇందుకోసం రూ.378 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రాందాస్ పేటకు చెందిన ఇతని పేరు బోర రామమూర్తి. పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల రామమూర్తి ఒంట్లో నలతగా ఉందని వైద్యుల్ని సంప్రదించగా.. గుండె జబ్బుతో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వైద్యానికి ఎంత ఖర్చవుతుందో ఏమిటోనని, అంత డబ్బు ఎలా సమకూర్చుకోవాలో తెలియక సతమతమయ్యారు. ఈ పరిస్థితుల్లో ఆ కుటుంబానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అండగా నిలిచింది. ఆ పథకం కింద రూ.4.50 లక్షల వ్యయాన్ని ప్రభుత్వమే భరించి ఉచితంగా బైపాస్ సర్జరీ చేయించింది. అంతేకాకుండా రామమూర్తి విశ్రాంత సమయంలో పోషణకు ఇబ్బందులు పడకుండా వైఎస్సార్ ఆసరా రూపంలో ఆర్థిక సాయం అందింది. 'ఆరోగ్యశ్రీ పథకం నా ప్రాణాన్ని కాపాడింది. నా వైద్యం కోసం కుటుంబ సభ్యులు అప్పులు పాలుకాకుండా చూసింది. పథకాన్ని అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు' అంటూ రామమూర్తి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి వారు లెక్కకు మిక్కిలిగా ఉన్నారు.

నిరుపేద, మధ్య తరగతి గుండెలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తోంది. గుండె, కాలేయం, కిడ్నీ, క్యాన్సర్ వంటి ఎన్నో రకాల పెద్ద జబ్బులకు సైతం పైసా ఖర్చు లేకుండా శస్త్ర చికిత్సలు చేయిస్తోంది. ఇప్పటికే 2,446 రకాల జబ్బులకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్యం లభిస్తుండగా.. ఆ సంఖ్య త్వరలో 3,254 రకాల చికిత్సలకు పెరగనుంది. టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ పథకానికి ఊపిరిలూదుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలతో పేదలకు భారీ మేలు చేకూరుతోంది. పొరుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం ఈ పథకం కింద ఉచితంగా చికిత్స అందుతోంది. వారంతా వైద్యం తర్వాత చిరునవ్వుతో ఇంటికి తిరిగొస్తున్నారు. టీడీపీ హయాంలో పేదలకు పెద్ద జబ్బు వస్తే ఆస్తులు అమ్ముకోవడం లేదా అప్పుల ఊబిలో కూరుకుపోవడం తప్ప మరో మార్గం ఉండేది కాదు. ఏ ఆస్తులూ లేని వారు దైవంపై భారం వేసి రోజులు లెక్కపెట్టుకోవాల్సిన దుస్థితి ఉండేది.

18 నెలల్లో ఆరోగ్యశ్రీ కింద గుండె జబ్బులకు చికిత్స చేయించుకున్న వారి సంఖ్య

బైపాస్ సర్జరీ	8,043
స్టెంట్‌లు	56,627
యాంజియోగ్రామ్	8,104
ఇతర చికిత్సలు	1,082
మొత్తం	73,856

73,856 గుండెల్లో సంతోషం

2021–22 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరు వరకూ (18 నెలలు) రాష్ట్రంలో 73,856 మంది ఆరోగ్యశ్రీ కింద గుండె జబ్బులకు చికిత్స పొందారు. వీరిలో 21,740 మంది మహిళలు కాగా, 52,116 మంది పురుషులు. వీరి చికిత్స కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.378 కోట్లు ఖర్చు చేసింది. 2021–22లో రూ.233 కోట్లు వెచ్చించగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.145 కోట్లు వెచ్చించింది. మరోవైపు చికిత్స పొందిన వారికి ఆరోగ్య ఆసరా పథకం కింద విశ్రాంత సమయానికి ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించింది.

– సాక్షి, అమరావతి

ఆరోగ్యశ్రీ కింద బైపాస్ సర్జరీ చేశారు



గుండె జబ్బుతో బాధపడుతున్న నేను కొద్ది రోజుల క్రితం కర్నూలు జీజీహెచ్‌లో చేరాను. బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద బైపాస్ సర్జరీ చేశారు. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగుంది. కొద్దిరోజులు ఆస్పత్రిలోనే వైద్యుల పర్యవేక్షణలో ఉండాలన్నారు.

– సి.సుబ్బమ్మ, తిమ్మంపల్లె, అనంతపురం జిల్లా

జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

నేను లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నా. ఆగస్టు 15న డ్యూటీ దిగాక గుండెలో నొప్పిగా అనిపించి గుంటూరు నగరంలోనే ఓ ఆస్పత్రికి వెళ్లాను. పరీక్షలు అనంతరం బైపాస్ సర్జరీ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్స చేశారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. లారీ డ్రైవర్‌గా జీవనం సాగించే నాకు అంత ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోవడం చాలా కష్టం. నా చికిత్సకు సాయం చేసిన సీఎం జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– బి.శ్రీనివాసరావు, గుంటూరు నగరం

అర్హులందరికీ ఉచితంగా చికిత్స



అర్హులందరికీ ఉచితంగా గుండె, కాలేయం, కిడ్నీ, ఊపిరితిత్తులు సంబంధిత పెద్ద వ్యాధులతో పాటు క్యాన్సర్ వంటి జబ్బులకు సైతం ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం వైద్యం చేయిస్తోంది. త్వరలో మరిన్ని చికిత్సలను తీసుకురాబోతున్నాం. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకంలో 2,446 చికిత్సలకు వైద్యం అందుతుండగా.. త్వరలో ఆ సంఖ్య 3,254కు పెరగనుంది.

– హరేంధిర ప్రసాద్, సీఈవో, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

శ్రీవారి దర్శనానికి 15 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. కంపార్ట్‌మెంట్లు 25 నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,794 మంది స్వామి వారిని దర్శించుకోగా, 35,560 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో రూ.4.67 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 15 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది.

పల్లెల్లో పంచకర్మ సేవలు భేష్

- కేరళ రాష్ట్ర ఆయుష్ కమిషనర్ సాజిద్‌బాబు
- కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రి సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న కేరళ ఆయుష్ కమిషనర్ సాజిద్‌బాబు

కంకిపాడు: పల్లెల్లో పంచకర్మ వైద్య సేవలు భేష్ అని కేరళ రాష్ట్ర ఆయుష్ కమిషనర్ సాజిద్ బాబు అన్నారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలోని కోలవెన్నులో స్పెషల్ వెల్‌నెస్, పంచకర్మ సెంటర్ (ఆయుర్వేద ఆస్పత్రి)ను సోమవారం సందర్శించారు. ఆయుర్వేద వైద్యం, పంచకర్మ వైద్య సేవలు అందించే విధానాన్ని పరిశీలించారు. వినియోగించే తైలాలు, సామగ్రిని తనిఖీ చేశారు. వైద్య సేవలు పొందుతున్న రోగులతో ముఖాముఖి మాట్లాడారు. కేరళలోనే పల్లెలకు పంచకర్మ సేవలు లేవని, ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాకు ఒక పంచకర్మ సెంటర్‌ను అందుబాటులోకి తేవటం అభినందనీయమన్నారు. పంచకర్మ సేవల విస్తరణకు రాష్ట్ర ఆయుష్ కమిషనర్ డాక్టర్ కల్నల్ వి.రాములు చేస్తున్న కృషిని కొనియాడారు. జోన్–2 ఆర్‌డీడీ వెంకట కృష్ణ, నేషనల్ ఆయుష్ మిషన్ కన్సల్టెంట్ కె.క్రాంతితేజ, వైద్యాధికారి పి.నీలిమ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో బాలుడికి పునర్జన్మ

- వైఎస్సార్ జిల్లా బీరాన్‌ఖాన్‌పల్లెకు చెందిన బాలుడికి అరుదైన సమస్య
- పుట్టుకతో మల విసర్జన ద్వారం ఏర్పడకపోవడంతో ఇబ్బందులు
- లక్షలాది రూపాయలు అవసరమవ్వడంతో తల్లిదండ్రుల ఆందోళన
- ఆరోగ్యశ్రీతో ఉచితంగా సర్జరీ చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



బాలుడి కుటుంబ సభ్యులతో పీడియాట్రిక్ సర్జన్ సుకుమార్

కడప రూరల్: ఎంతో మందికి పునర్జన్మను ప్రసాదిస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తాజాగా ఓ పేద కుటుంబానికి చెందిన చిన్నారికి అండగా నిలిచింది. వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలం బీరాన్‌ఖాన్‌పల్లెకు చెందిన షేక్ నూర్‌బాషా, చాందిని దంపతుల కుమారుడు హబీబ్(2)కు పుట్టుకతో మల విసర్జన ద్వారం ఏర్పడలేదు. ఈ సమస్య 5 వేల మంది చిన్నారుల్లో ఒకరికి వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో.. హబీబ్ తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఏరోజుకారోజు పనికి వెళ్తే గానీ జీవితం గడవని పరిస్థితుల్లో కుమారుడికి వైద్యమెలా చేయించాలా అని తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఇంతలో ఈ జబ్బుకు కూడా ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వైద్యులు చెప్పడంతో.. ఎంతో సంతోషించిన వారు వెంటనే తమ కుమారుడిని కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు మొదటి దశ సర్జరీ చేసి.. పెద్ద పేగును తీసి బయటకు పెట్టారు. ఆ తర్వాత కడపలోని కేసీహెచ్ ఆస్పత్రిలో కూడా దీనికి చికిత్స చేస్తారని తెలియడంతో అందులో చేర్పించారు. అక్కడి పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ సుకుమార్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది ఇటీవల రెండో సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. రూ.5 లక్షల వరకు ఖర్చయ్యే ఈ చికిత్స.. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా పూర్తవ్వడంతో హబీబ్ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా తమ కుమారుడికి పునర్జన్మ లభించిందని.. వైఎస్ జగన్ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామంటూ వారు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న కాలనీలను చూస్తే అభివృద్ధి కనిపిస్తుంది

- మంత్రి ఆర్కే రోజా
- 'నగరి'లో 108 ఇళ్లకు స్లాబ్ వేసే కార్యక్రమం ప్రారంభం




నగరి: ప్రతిపక్ష నాయకులు జగనన్న కాలనీలను వీక్షిస్తే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఏంటో కనిపిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. తిరుపతి జిల్లా, నగరి మునిసిపల్ పరిధి నాగరాజకుప్పం వద్ద ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలో శరవేగంగా జరుగుతున్న నిర్మాణాల్లో భాగంగా 108 ఇళ్లకు స్లాబ్ వేసే కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా పేదవాడి సొంతింటి కలను ఏపీ సీఎం వైఎస్ జగన్ సాకారం చేస్తున్నారని తెలిపారు. నగరి మునిసిపాలిటీ నాగరాజకుప్పంలో 1,248 ఇళ్లు కాంట్రాక్టర్ ద్వారా నిర్మిస్తుంటే.. వాటిలో ఇప్పటికే 420 ఇళ్లకు స్లాబ్‌లు పూర్తయ్యాయని, ఇప్పుడు మరో 108 ఇళ్లకు స్లాబ్ వేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొదటి దశలో 7,580 ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, రూ.13.64 కోట్ల వ్యయంతో సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏం చేసిందంటూ ఏసీ రూమ్‌లో పచ్చ పత్రికలకు ఇంటర్వ్యూలిచ్చే వారంతా జగనన్న కాలనీలకు వచ్చి చూస్తే అర్థమవుతుందని చెప్పారు.

ప్యాకేజీలకు ప్లేటు తిప్పే వ్యక్తి పవన్‌కల్యాణ్

ఉత్తరాంధ్ర తమకు పరిపాలన రాజధాని కావాలని కోరుతుంటే.. దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైజాగ్‌కి వచ్చి.. తనను చంపడానికి ప్రయత్నించారన్నది నిజం కాదా అని మంత్రి రోజా ప్రశ్నించారు. పవన్ అరైవల్‌లో దిగితే.. అక్కడ ఉండాల్సిన జనసేన నాయకులు డిపార్చర్ వద్ద ఎందుకున్నారని ప్రశ్నించారు. అక్కడ రాళ్లు, రాడ్లు పెట్టుకుని దాడి చేయాల్సిన అవసరమేంటని ధ్వజమెత్తారు. పక్కా ప్రణాళిక ప్రకారమే అక్కడికొచ్చి దాడి జరిపించారని విమర్శించారు. జనవాణి చేసిన చోట ఎక్కడా ర్యాలీ చేయని పవన్.. వైజాగ్‌లోనే ఎందుకు ర్యాలీ చేశారని ప్రశ్నించారు. పవన్ ఫ్యాన్స్ అని చెప్పుకొనే కొందరు సైకోలకు, వారి తల్లిదండ్రులకు కూడా మంచి చేసేది జగనన్నే అన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు.

వెన్నుపోటు తప్ప ఎన్టీఆర్‌కు చంద్రబాబు చేసిందేం లేదు..

- గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తా



ఉంగుటూరు : మామకు వెన్నుపోటు పొడిచి పార్టీని, పదవిని లాక్కోవడం మినహా ఎన్టీఆర్‌కు చంద్రబాబు చేసిందేమీ లేదని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరులో తన తండ్రి రమేష్‌చంద్ వర్ధంతి సందర్భంగా స్మారకఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వంశీ నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో గన్నవరం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా ఏర్పడినా ఎన్టీఆర్ పేరు పెట్టడం గానీ, ఆయనకు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదనలు చేయలేదని మండిపడ్డారు. అలాంటిది నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారని చెప్పారు. వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకురావడంతో పాటు ఆరోగ్యశ్రీని తీసుకొచ్చిన వైఎస్సార్ పేరును హెల్త్ యూనివర్సిటీకి పెట్టారని చెప్పారు. యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తొలగించి వైఎస్సార్ పేరు పెట్టడం వలన ఎవరి స్థాయి తగ్గదని, ఇద్దరూ మహానుభావులని చెప్పారు. వైజాగ్‌లో మంత్రుల వాహనాలపై జనసేన నాయకులు దాడికి పాల్పడటం దారుణమన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులను సమన్వయం చేసుకుని 2024లో తాను గన్నవరం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

బాబు చేతిలో పవన్ కీలుబొమ్మ

మంత్రి మేరుగు నాగార్జున



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేతిలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కీలుబొమ్మ అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున దుయ్యబట్టారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కార్యనిర్వాహక విశాఖను రాజధానిగా చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర ప్రజలు నిర్వహించిన గర్జన విజయవంతం కావడాన్ని ఓర్వలేక పవన్‌ను అక్కడికి పంపి చంద్రబాబు అలజడి సృష్టించారని మండిపడ్డారు. గర్జనలో పాల్గొని తిరిగి రావడానికి విమానాశ్రయానికి చేరుకున్న తనపైన, మహిళా మంత్రులు ఆర్కే రోజా, రజిని, బీసీ మంత్రి జోగి రమేష్‌పై జనసేన కార్యకర్తలతో దాడి చేయించే స్థాయికి పవన్ దిగజారారని అన్నారు.

పవన్‌కు రాజకీయ పరిణతి లేదు

750వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: మూడు రాజధానులపై మాట మార్చిన పవన్ కల్యాణ్‌కు చిత్తశుద్ధి, రాజకీయ పరిణతి లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 750వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. 2017లో అమరావతి పర్యటన పేరుతో రాజధాని ప్రాంతాల్లో పర్యటించిన పావలా పవన్‌కల్యాణ్ యర్రబాలెంలో పెరుగన్నం తిని పడుకుని వికేంద్రీకరణ జరగాలని మాట్లాడాడని గుర్తు చేశారు.

కొత్త సీజేఐ నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర



న్యూఢిల్లీ: నూతన సీజేఐగా జస్టిస్ ధనంజయ వై. చంద్రచూడ్‌ను నియమిస్తూ సంబంధిత ఉత్తర్వుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకంచేశారు. సుప్రీం కోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్ సిఫార్సు తర్వాత సంబంధించి ప్రతిని కేంద్ర న్యాయశాఖ.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపగా ఆమె ఆమోదించారని ఆ శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. నవంబర్ 9న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణంచేస్తారని రిజిజు ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. అప్పటి నుంచి రెండు సంవత్సరాలపాటు అంటే 2024 నవంబర్ పదోతేదీ దాకా ఆయన సీజేఐగా కొనసాగుతారు. కొత్త సీజేగా నియామకపత్రాన్ని ప్రధాని ప్రధాన సలహాదారు పీకే మిశ్రా, న్యాయశాఖ ఉన్నతాధికారులు స్వయంగా జస్టిస్ చంద్రచూడ్‌కు అందజేశారు. ప్రస్తుత సీజేఐ లలిత్ కేవలం 74 రోజులే ఆ బాధ్యతల్లో కొనసాగి రిటైర్‌కానున్నారు. సాధారణంగా సుప్రీంకోర్టు జడ్జి 65 ఏళ్ల వయసురాగానే

భూమి దీర్ఘవృత్తంగా ఉండును!



భూమి గుండ్రంగా ఉండును. ఇది చిన్నప్పటి నుంచీ మనమంతా వింటున్నదే. నిజానికి పూర్తిగా గుండ్రంగా కాకుండా ఓ మాదిరి దీర్ఘవృత్తాకారంలో ఉందట. అసలు ఆ మాటకొస్తే భూమి ఇంకా పూర్తి రూపాన్ని సంతరించుకునే క్రమంలోనే ఉందట. దీర్ఘవృత్తాకారం రావడానికి కారణమైన గురుత్వాకర్షణ శక్తే భూమికి ఓ నిశ్చిత రూపాన్నిచ్చే పనిలో మునిగి ఉందని సైంటిస్టులు చెబుతుండటం విశేషం! భూమిపై నుంచి అంతరిక్షంలోకి జారిపోకుండా మనల్ని కాపాడుతున్నది, భూమిపై పట్టి ఉంచుతున్నది గురుత్వాకర్షణ శక్తేనన్నది తెలిసిందే. భూమికి ఆ శక్తే భూమిని లోలోపలి నుంచి సమ్మెట పోట్లను తలపించేలా ఒత్తిడి చేసీ చేసీ దీర్ఘవృత్తాకారానికి తీసుకొచ్చిందట. భూమి కేంద్రానికి, ఉపరితలానికి మధ్య దూరం భూమధ్యరేఖ వద్ద ఒకలా, ధ్రువాల వద్ద ఇంకోలా ఉండటానికి ఈ దీర్ఘవృత్తాకారమే కారణమట. భూమి రూపాన్ని తీర్చిదిద్దే ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉందని తాజాగా కనిపెట్టామంటున్నారు అంతరిక్ష శాస్త్రవేత్తలు. భూమి ఆకారాన్ని నిర్దేశించడంలో గురుత్వాకర్షణ శక్తితో పాటు ఎగుడుదిగుడు ఉపరితలం, లోపలి పొరల్లో ఉన్న వనరుల అసమతుల విస్తృత వంటి పలు ఇతర కారకాల ప్రమేయమూ ఉందని పరిశోధన తేల్చింది. ఒకప్పుడు భూమిపై 30 కిలోమీటర్ల పై చిలుకు ఎత్తు దాకా ఉన్న పర్వతాలు గురుత్వాకర్షణ శక్తి వల్లే క్రమంగా తగ్గుతూ వచ్చాయట. భూమిపై ఉన్న విభిన్న స్థలాకృతులు, పై పొరల కదలికలు తదితరాలు కూడా ఇందుకు కారణమయ్యాయని తేలింది. భూమి ఎలా ఏర్పడిందో అర్థం చేసుకునే ప్రయత్నానికి ఈ తాజా ఆవిష్కరణలు కొత్త కోణాలను అందిస్తున్నాయని సైంటిస్టులు చెబుతున్నారు.

త్వరలో క్యాన్సర్ వ్యాక్సిన్!

- ఎనిమిదేళ్ల లోపే అందుబాటులోకి
- పరిశోధక, వైద్య దంపతుల రూపకల్పన



ఓజ్లెమ్ టురేసి



ఉగుర్ సాహిన్

క్యాన్సర్ వ్యాక్సిన్ అందుబాటులోకి రావడానికి ఇక ఎంతో సమయం పట్టదని ఈ ప్రాణాంతక వ్యాధిపై సుదీర్ఘ కాలంగా పరిశోధన చేస్తున్న దంపతులు, 'బయో ఎన్‌టెక్' వ్యాక్సిన్ల తయారీ సంస్థ అధినేతలు ప్రొఫెసర్ ఉగుర్ సాహిన్, ప్రొఫెసర్ ఓజ్లెమ్ టురేసి చెబుతున్నారు. మహా అయితే ఎనిమిదేళ్లలోపే క్యాన్సర్ వ్యాక్సిన్ వాడుకలోకి రాబోతోందని వివరించారు. ప్రముఖ వార్తాసంస్థ బీబీసీ ఇంటర్వ్యూలో వారు ఈ మేరకు వెల్లడించారు. ''మేం డాక్టర్లుగా బాధితుల వెతలు, నిరాశా నిస్పృహలు చూసి చలించిపోయేవాళ్లం. ఆ అనుభవమే క్యాన్సర్ పరిశోధనల వైపు మళ్లించింది'' అన్నారు. ''కరోనాకు మంచి వ్యాక్సిన్ తయారు చేస్తున్న క్రమంలో ఆ పరిశోధన అనుకోకుండా క్యాన్సర్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసేలా మలుపు తిరిగింది. ఇది మెసెంజర్ ఆర్ఎన్ఏ సాంకేతికతతో రూపొందించిన వ్యాక్సిన్. మన ఒంట్లోని వ్యాధినిరోధక శక్తే క్యాన్సర్ కణాలను గుర్తించి తుదముట్టించేలా ఇది పని చేస్తుంది'' అని డాక్టర్ సాహిన్ చెప్పారు. తమ వ్యాక్సిన్ అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని ఘంటాపథంగా చెప్పారు. అది క్యాన్సర్ కణాలను నేరుగా తుదముట్టించేలా రూపొందిందని టురేసి వివరించారు. ''ట్రయల్స్‌లో బాధితులపై వ్యాక్సిన్‌ను వాడుతున్నప్పుడు ఎదురైన అడ్డంకులు దీన్ని మరింత ప్రభావవంతంగా మార్చేలా చేశాయి'' అని దంపతులు చెప్పారు. ఈ పరిశోధనల వివరాలు తొలుత బిజినెస్ ఇన్‌సైడర్ మ్యాగజైన్‌లో ప్రచురితమయ్యాయి.

యాంటీబాడీలకు చిక్కని బీఏ.2.75.2 సబ్ వేరియంట్

లండన్: కరోనా వైరస్‌లో(సార్స్-కోవ్-2) కొత్తగా పుట్టుకొచ్చిన బీఏ.2.75.2 అనే ఒమిక్రాన్ సబ్ వేరియంట్ ప్రమాదకరంగా పరిణమిస్తున్నట్లు స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇనిస్టిట్యూట్ పరిశోధకులు గుర్తించారు. ఇది మనుషుల రక్తంలోని ప్రతిరక్షకాల (యాంటీబాడీలు) నుంచి సమర్థంగా తప్పించుకున్నట్లు తేల్చారు. అంతేకాకుండా ఇప్పుడు అందుబాటులో ఉన్న కోవిడ్-19 యాంటీ బాడీ చికిత్సలను కూడా తట్టుకుంటున్నట్లు చెప్పారు. ఈ పరిశోధన వివరాలను లాన్సెట్ అంటువ్యాధుల పత్రికలో ప్రచురించారు. ప్రస్తుత శీతాకాలంలో కరోనా మహమ్మారి ముప్పు పొంచి ఉందని, అందుకే ముందుజాగ్రత్తగా అప్‌డేటెడ్ టీకాలు తీసుకోవాలని, రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని పరిశోధకులు సూచించారు. కరోనా ఒమిక్రాన్‌లోని బీఏ.2.75 అనే వేరియంట్ ఉత్పరివర్తనం చెందడంతో బీఏ.2.75.2 ఉప వేరియంట్ పుట్టినట్లు కనిపెట్టారు. ఈ ఏడాది మొదట్లోనే ఇది బయటపడింది. కొన్ని దేశాల్లో వ్యాప్తి చెందుతోంది. ఇప్పటికైతే తక్కువ సంఖ్యలోనే కేసులు నమోదవుతున్నప్పటికీ భవిష్యత్తులో ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పలేమన్నది పరిశోధకులు మాట. కోవిడ్-19 బారిన పడే అవకాశం అధికంగా ఉన్నవారికి యాంటీవైరల్ ట్రీట్‌మెంట్ అందుబాటులో ఉంది.

క్లుప్తంగా...

పోలియోపై పోరుకు 9.8 వేల కోట్ల విరాళం

ప్రకటించిన గేట్స్ ఫౌండేషన్

బెర్లిన్: ప్రపంచ వ్యాప్తంగా పోలియో మహమ్మారిపై సాగే పోరాటానికి బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ 1.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9.8 వేల కోట్ల)సాయం ప్రకటించింది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ తదితర దేశాలను పోలియో రహితంగా మార్చేందుకు, వైరస్ కొత్త వేరియంట్‌ల వ్యాప్తిని నివారణకు ఈ మొత్తాన్ని వెచ్చిస్తామని తెలిపింది.

మందుల చీటిపై 'శ్రీహరి'

సాత్నా: మందుల చీటిపై (ప్రిస్క్రిప్షన్) 'శ్రీహరి' అంటూ మొదలుపెట్టాలని, ఔషధాల పేర్లను హిందీ భాషలో రాయాలని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపునకు డాక్టర్లు స్పందిస్తున్నట్లే కనిపిస్తోంది. సాత్నా జిల్లాలో ఓ ప్రభుత్వ వైద్యుడు మందుల చీటిపై శ్రీహరి అని రాయడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ చీటి సోషల్ మీడియాలో వైరలవుతోంది. కొటార్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో పనిచేస్తున్న సర్వేష్ సింగ్ అనే డాక్టర్ ఈ ప్రిస్క్రిప్షన్ రాశారు. సాధారణంగా 'ఆర్ఎక్స్' అనే లాటిన్ పదాన్ని మందుల చీటిపై మనం చూస్తుంటాం. ఆర్ఎక్స్ అంటే 'ఔషధం తీసుకోండి' అని అర్థం. సర్వేష్ సింగ్ 2017లో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ప్రభుత్వ వైద్యుడిగా ఉద్యోగం సాధించారు.

అంధేరీ ఈస్ట్‌లో ఏకపక్షమే !

ముంబై: ఉద్ధవ్ ఠాక్రే వర్గం నేత, అంధేరీ ఈస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే రమేశ్ లాట్కే హఠాన్మరణంతో అనివార్యమైన ఉపఎన్నికల్లో ఆయన భార్య రుతుజ లాట్కే గెలుపు ఖరారుకానుంది. మహారాష్ట్ర నవ్ నిర్మాణ్ సేన అధినేత రాజ్ ఠాక్రే విజ్ఞప్తి మేరకు తమ పార్టీ అభ్యర్థి ముర్జీ పటేల్‌తో బీజేపీ సోమవారం నామినేషన్‌ను ఉపసంహరించుకునేలా చేసింది. ప్రత్యర్థి వర్గం బీజేపీ నుంచి అభ్యర్థి ఉపసంహరించుకోవడంతో గెలుపు ఏకపక్షంకానుంది. రుతుజ ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా అన్ని పార్టీలు ముందుకురావాలని ఎన్‌సీపీ చీఫ్ శరద్‌పవార్ సైతం గతంలో విన్నవించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో నవంబర్ మూడున జరగనున్న అంధేరీ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో విజేత ఎవరనేది స్పష్టమైంది. ఇప్పటికే ఉద్ధవ్ వర్గానికి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్‌సీపీ తమ మద్దతు ప్రకటించాయి. 'మొదట్లో రుతుజను షిండే నేతృత్వంలోని మహా సర్కార్ వేధింపులకు గురిచేసింది. ఆమె చేతిలో దారుణంగా ఓడిపోతామనే భయంతోనే చివరకు ప్రభుత్వం వెనక్కి తగ్గింది' అని ఎన్‌సీపీ రాష్ట్ర చీఫ్ జయంత్ పాటిల్ వ్యాఖ్యానించారు.

'పీఎం-కిసాన్' సొమ్ము విడుదల

- రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.16,000 కోట్లు
- బదిలీ చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- 'భారత్' బ్రాండ్ యూరియా, 'ఇండియన్ ఎడ్జ్' పత్రిక ఆవిష్కరణ
- ఇక కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా 3.25 లక్షల రిటైల్ ఎరువుల దుకాణాలు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం-కిసాన్) 12వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోదీ అర్హులైన రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, ఎరువుల శాఖల ఆధ్వర్యంలో ప్రారంభమైన పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్-2022 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 12వ విడతలో దాదాపు రూ.16,000 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి చేరాయి. దీంతో ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రైతులకు రూ.2.16 లక్షల కోట్ల సాయం అందించినట్లయ్యింది. ఏటా 11 కోట్ల మంది రైతన్నలు లబ్ధి పొందుతున్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం-కిసాన్ కింద అర్హులకు ప్రతి సంవత్సరం రూ.6,000 మూడు విడతల్లో అందిస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి నాలుగో నెలల కోసారి రూ.2,000ను వారి ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. ఈ పథకాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే అమలు చేస్తోంది.

రైతులపై తగ్గిన ఆర్థిక భారం

మధ్యవర్తులు, కమీషన్ల ఏజెంట్ల ప్రమేయం లేకుండా పీఎం-కిసాన్ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకే బదిలీ చేస్తున్నామని ప్రధానీ మోదీ వివరించారు. కిసాన్ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దీపావళి పండుగకు ముందు రైతులకు నిధులు అందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు ఈ డబ్బులు ఉపయోగపడతాయని చెప్పారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు అన్నదాతలకు రూ.2 లక్షల కోట్లకుపైగా అందజేశామని తెలిపారు. పీఎం-కిసాన్ పథకం ఆర్థికంగా ఎంతో భారాన్ని తగ్గించిందని రైతులు తనతో చెప్పారని గుర్తుచేశారు.

కిసాన్ సమృద్ధి కేంద్రాలు ప్రారంభం

'ఒకే దేశం, ఒకే ఎరువుల పథకం'లో భాగంగా 'భారత్' బ్రాండ్ రాయితీ యూరియాను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల ఆవిష్కరించారు. అలాగే 600 పీఎం-కిసాన్ సమృద్ధి కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ రెండు చర్యల వల్ల రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందుతాయని చెప్పారు. అంతర్జాతీయ ఎరువుల ఈ-వారపత్రిక 'ఇండియన్ ఎడ్జ్'ను సైతం మోదీ ఆవిష్కరించారు. మార్కెట్‌లో వివిధ రకాల బ్రాండ్లు రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయని, అధిక కమీషన్ కోసం డీలర్లు కొన్ని రకాల బ్రాండ్లనే విక్రయిస్తున్నారని, ఇలాంటి సమస్యల పరిష్కారానికి ఏకైక బ్రాండ్‌ను తీసుకొచ్చినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు.

ఖజానాపై 'ఎరువుల' భారం

కిసాన్ సమృద్ధి కేంద్రాల్లో రైతులకు బహుళ సేవలు అందుతాయని తెలియజేశారు. ఇవి 'వన్ స్టాప్ షాప్'గా పని చేస్తాయన్నారు. దేశవ్యాప్తంగా 3.25 లక్షల రిటైల్ ఎరువుల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా మార్చబోతున్నట్లు ప్రకటించారు. ఎరువుల కోసం మనం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని, ఎరువులపై కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా రూ.2.5 లక్షల కోట్ల మేర రాయితీ భారం భరిస్తోందన్నారు. ఒక్కో కిలో ఎరువును రూ.80కి కొని, రైతులకు రూ.6కు అమ్ముతున్నామని చెప్పారు. ఎరువులతో పాటు ముడి చమురు, వంట నూనెల దిగుమతుల భారం సైతం పెరుగుతోందన్నారు. దిగుమతుల బిల్లు తగ్గించుకోవాలని, ఎరువులు, వంట నూనెల ఉత్పత్తిలో స్వయం స్వావలంబన సాధించాలని, ఈ విషయంలో మిషన్ మోడ్‌లో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, మన్‌సుఖ్ మాండవియా తదితరులు పాల్గొన్నారు. 13,500 మందికిపైగా రైతులు హాజరయ్యారు. దాదాపు 1,500 వ్యవసాయ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను, నవీన ఆవిష్కరణలను ప్రదర్శించాయి.



ఓటువేస్తున్న సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ తదితరులు

96 శాతం ఓటింగ్!

- ముగిసిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు
- ఢిల్లీలో ఓటేసిన పార్టీ చీఫ్ సోనియా
- 19న ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ/బెంగళూరు/తిరువనంతపురం: కాంగ్రెస్ పార్టీకి దాదాపు పాతికేళ్ల తర్వాత గాంధీయేతర అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బరిలో నిలిచిన సీనియర్ నేతలు మల్లికార్జున ఖర్గే, శశిథరూర్‌లలో ఒకరిని రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నుకునేందుకు 9 వేల మందికి పైగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) డెలిగేట్లు ఓటు వేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంతోపాటు దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 65 పోలింగ్ బూత్‌ల్లో ఉదయం 10 గంటల నుంచి పోలింగ్ మొదలైంది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఢిల్లీలో ఓటేశారు. 'ఈ రోజు కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నాను'అని ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఓటేసిన అనంతరం సోనియా అన్నారు. కర్ణాటకలో ప్రస్తుతం భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్ గాంధీ బళ్లారి జిల్లా సంగెనకల్లు వద్ద క్యాంప్ కంటెయినర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి బరిలో ఉన్న మల్లికార్జున ఖర్గే(80) బెంగళూరులోని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, లోక్‌సభ సభ్యుడు శశిథరూర్(66) కేరళ రాజధాని తిరువనంతపురంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చిన్న రాష్ట్రాల్లో వందశాతం: మిస్త్రీ

'కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ సంతృప్తికరంగా సాగింది. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంతవాతావరణంలో ముగిశాయి' అని పార్టీ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్ పర్సన్ మధుసూదన్ మిస్త్రీ పేర్కొన్నారు. మొత్తం 9,900 మంది డెలిగేట్లకు గాను 9,500 మంది, మొత్తమ్మీద 96 శాతం మంది ఓటు వేశారని ఆయన వెల్లడించారు. చిన్న రాష్ట్రాల్లో 100 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని మీడియాకు తెలిపారు. ఎన్నికల ఫలితాలను ఈ నెల 19వ తేదీన ప్రకటించనున్నారు. 137 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో అధ్యక్ష పదవికి ఎన్నిక జరగడం ఇది ఆరోసారి.

అరెస్ట్ అవుతానన్న భయం లేదు

నకిలీ కేసులో బీజేపీ నన్ను జైల్లోకి నెట్టాలనుకుంటోంది: సిసోడియా



న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ విధానంలో సీబీఐతో నకిలీ తప్పుడు కేసు బనాయించి తనను కేంద్రప్రభుత్వం జైలుకు పంపాలని చూస్తోందని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆరోపించారు. 'త్వరలో ఎన్నికలు జరగనున్న గుజరాత్ రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక బీజేపీ ఇలాంటి కుట్రకు తెరతీసింది. గుజరాత్‌లో ప్రచారంచేయకుండా నన్ను జైలుకు పంపాలనుకుంటోంది. అరెస్ట్ అవుతానన్న భయం లేదు' అని అన్నారు. ఎక్సయిజ్ పాలసీ కేసులో ప్రశ్నావళిని ఎదుర్కొనేందుకు సీబీఐ నుంచి సమన్లు అందుకున్న మనీశ్ ఆ మేరకు సోమవారం ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. తొలుత రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మునికి నివాళులర్పించారు. 'మహాత్మునిపైనా ఆనాడు తప్పుడు కేసులు నమోదయ్యాయి. ఇప్పుడు బీజేపీ ఆదేశాలతో సీబీఐ నాపై నకిలీ కేసు పెట్టింది. దేశానికి ఏదో విధంగా ఉపయోగపడతానేమో' అని వ్యాఖ్యానించారు. తర్వాత సీబీఐ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకున్నారు. సీబీఐ ఆఫీస్‌కు రాకముందు ఆయన ట్వీట్లు చేశారు. ' ఈ కేసులో గతంలో ఢిల్లీలో నా నివాసంలో, బ్యాంక్ ఖాతాల్లో, సొంతూరులో సోదాలు చేశారు. దొరికింది శూన్యం' అని పేర్కొన్నారు. మనీశ్‌ను ఉదయం నుంచి దాదాపు తొమ్మిది గంటలకుపైగా సీబీఐ అధికారులు ప్రశ్నించారు. సీబీఐ ఆఫీస్ నుంచి బయటికొచ్చాక ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆప్‌ను వదిలెయ్. నీకు ఢిల్లీ సీఎం పదవి ఇస్తాం. ఒప్పుకోకపోతే జైలుకుపోతావ్' అని సీబీఐ అధికారులు ఒత్తిడిచేశారని ఆరోపించారు. మనీశ్ ఆరోపణలను సీబీఐ తోసిపుచ్చింది. 'గుజరాత్ ఎన్నికలు పూర్తయి డిసెంబర్ 8దాకా మనీశ్‌ను జైళ్లో పెట్టడమే బీజేపీ పని' అని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు.

ప్రపంచంలోనే అత్యం త స్వచ్ఛమైన పెద్ద పసుపు రంగు 'గోల్డెన్ కనరీ' వజ్రం ఇది. దుబాయ్‌లోని సోత్‌బేస్ ప్రదర్శనలో ఉంచిన దీనిని న్యూయార్క్‌లో వేలంవేయనున్నారు. 1980లలో కాంగో దేశంలో వజ్రాల గని సమీపంలో లభించినపుడు దీని బరువు 890 క్యారెట్లు. తర్వాత పలుమార్లు సాన బట్టి ముక్కలుగా మారింది. చివరకు 303.10 క్యారెట్లకు తగ్గించారు. అదే ఈ వజ్రం. డిసెంబర్ ఏడున న్యూయార్క్‌లో ఇది రూ.123 కోట్ల ధర పలకొచ్చని ఒక అంచనా.



ఆర్థిక వ్యవస్థ పునర్వైభవం ఖాయం

- కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా స్పష్టీకరణ
- జాతీయ సదస్సులో నూతన ఆర్థిక విధానంపై చర్చ

బీజింగ్: ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్థిక మందగమనం పెద్ద సమస్యేమీ కాదని, తమ దేశ ఆర్థిక వ్యవస్థ త్వరలోనే పుంజుకోవడం ఖాయమని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా(సీపీసీ) ధీమా వ్యక్తం చేసింది. మరిన్ని విదేశీ పెట్టుబడుల కోసం ద్వారాలు తెరుస్తామని ప్రకటించింది. ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణే లక్ష్యంగా సీపీసీ 20వ జాతీయ సదస్సులో సోమవారం నూతన ఆర్థిక విధానంపై విస్తృతంగా చర్చించారు. 2,300 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వాస్తవానికి 2022లో 5.5 శాతం వృద్ధి సాధించాలని చైనా సర్కారు లక్ష్యంగా నిర్దేశించుకుంది. కానీ, అది సాధ్యం కాదని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు తేల్చిచెప్పాయి. 3.2 శాతం వృద్ధిని ఐఎంఎఫ్, 2.8 శాతం వృద్ధిని ప్రపంచ బ్యాంకు అంచనా వేశాయి. చైనా అధినేత షీ జిన్‌పింగ్ కఠినంగా అమలు చేస్తున్న జీరో కోవిడ్ పాలసీ వల్ల ఆర్థిక ప్రగతి క్షీణిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసిక నుంచి ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టడం తథ్యమని నేషనల్ డెవలప్‌మెంట్, రిఫామ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ ఝవో చెన్‌షిన్ చెప్పారు. కొత్త పరిశ్రమలు, తద్వారా కొత్త ఉద్యోగాల సృష్టికి కృషి చేస్తున్నామని వివరించారు.

50 లక్షల మందిపై దర్యాప్తు

అవినీతిని సహించే ప్రసక్తే లేదని చైనా కమ్యూనిస్ట్ పార్టీ తేల్చిచెప్పింది. గత పదేళ్లలో అవినీతి ఆరోపణల కింద తమ పార్టీలో 50 లక్షల మంది సభ్యులపై దర్యాప్తు చేసినట్లు వెల్లడించింది. 553 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపింది. అధికార దుర్వినియోగానికి పాల్పడడం, లంచాలు ఇవ్వడం, లంచాలు తీసుకోవడం వంటివాటిలో భాగస్వాములైతే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించింది. చైనా కమ్యూనిస్ట్ పార్టీలో 9.6 కోట్ల మంది సభ్యులు ఉన్నారు. గత పదేళ్లలో 2,07,000 మందికి వివిధ రకాల శిక్షలు విధించినట్లు పార్టీ క్రమశిక్షణా కమిటీ ఉప కార్యదర్శి షియావో తెలిపారు.

కీవ్‌పై డ్రోన్ బాంబులు

కీవ్: వారాంతం ముగిసి సోమవారం విధుల్లోకి వెళ్లే ఉద్యోగులతో బిజీగా మారిన ఉక్రెయిన్ రాజధానిని రష్యా డ్రోన్లు చుట్టుముట్టాయి. ఆత్మాహుతి బాంబర్లుగా మారి బాంబుల వర్షం కురిపించాయి. దీంతో బాంబు శబ్దాల హోరుతో కీవ్ దద్దరిల్లింది. ప్రాణభయంతో జనం సమీప సురక్షిత ప్రాంతాలకు పరుగులుతీశారు. బాంబుల ధాటికి పలు భవనాలు నేలమట్టమయ్యాయి. కొద్దిరోజులుగా కీవ్‌పై దాడి ఎక్కుపెట్టిన రష్యా వైమానిక దళం దెబ్బకు రాజధాని ప్రజలు నిరంతరం ఆకాశం వైపు చూస్తూ భయంభయంగా బయట సంచరిస్తున్నారు. గతంలో క్షిపణి దాడులకు దిగిన రష్యా బలగాలు ఈసారి ఇరాన్ తయారీ షహీద్(జెరాన్-2) డ్రోన్లకు పనిచెప్పాయి. కీవ్‌లో ధ్వంసమైన ఒక భవంతి శిథిలాల నుంచి 18 మందిని ఉక్రెయిన్ సేనలు సురక్షితంగా కాపాడాయి. సోమవారం నాటి దాడిలో గర్భిణీసహా నలుగురు మరణించారు.





పోనీయ్.. 300 కి.మీ.లు దాటాలి

- 230 కి.మీ.లు దాటి అత్యంత వేగంగా దూసుకెళ్లిన కారు
- ట్రక్కును ఢీకొని కారులోని నలుగురూ దుర్మరణం

లక్నో: బీఎండబ్ల్యూ కారు.. మెరుపు వేగం.. నిర్లక్ష్యపు డ్రైవింగ్.. ఫేస్‌బుక్ లైవ్‌లో అత్యుత్సాహం .. ఇవన్నీ కలిసి నలుగురి ప్రాణాలను అనంత వాయువుల్లో కలిపేశాయి. 230 కిలోమీటర్ల వేగంతో కారును నడుపుతూ నలుగురు యువకులు ప్రాణాలు బలిచేసుకున్న ఘటన ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై శుక్రవారం సుల్తాన్‌పూర్ వద్ద జరిగింది. ఈ ప్రమాదం తాలూకు వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమవడంతో వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆనంద్ ప్రకాశ్(35), అఖిలేశ్ సింగ్(35), దీపక్ కుమార్(37), మరో వ్యక్తి బీఎండబ్ల్యూ కారులో ఎక్స్‌ప్రెస్ హైవేపై అత్యంత వేగంతో దూసుకెళ్తున్నారు. దీంతో అందులోని వ్యక్తి.. ' స్పీడ్ మరింత పెంచు. స్పీడ్ 300 కి.మీ.లు దాటాలి. మనం ఫేస్‌బుక్ లైవ్‌లో ఉన్నాం' అని డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తితో అన్నాడు. అప్పటికే ఆ వేగంతో భయపడిన కారులోని వ్యక్తి.. 'మనం నలుగురం చస్తాం. నెమ్మదిగా పోనీయ్' అని అరిచాడు. దీంతో డ్రైవర్.. భయపడే వ్యక్తిని వారిస్తూ ' అరవకు. నేను అంతటి వేగంతో నడిపి చూపిస్తా' అని కోప్పడ్డాడు. ఈ వాగ్వాదం నడుమే కారు 230 కి.మీ.ల వేగంలో ప్రయాణిస్తూ ఎదురుగా వస్తున్న ట్రక్‌ను ఢీకొట్టింది. కారు టాప్, ముందుభాగం పగిలిపోయి కారులోని నలుగురూ ఛిద్రమై దూరంగా పడిపోయాడు. అక్కడికక్కడే మరణించారు.

వాతావరణ మార్పులతో దేశాలన్నీ అతలాకుతలం

నిజమవుతున్న ఐరాస ప్యానల్ అంచనాలు



వాతావరణ మార్పులు ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. దీని ప్రభావంతో వచ్చిపడుతున్న అకాల వరదలు, కరువులతో దేశాలకు దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. అపార ఆస్తి, ప్రాణ నష్టాలతో అల్లాడుతున్నాయి. అతి తీవ్ర వాతావరణ పరిస్థితులు తరచూ తలెత్తుతాయని, వాటి తీవ్రత కూడా గతం కంటే అత్యంత ఎక్కువగా ఉంటుందని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని వాతావరణ మార్పుల ప్యానల్ (ఐపీసీసీ) వేసిన అంచనాలు నూటికి నూరు శాతం నిజమవుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

- వారాంతపు వరదలతో ఆస్ట్రేలియా అల్లాడింది. దేశంలో చాలాచోట్ల ఇంకా కుండపోత కొనసాగుతూనే ఉంది. మరికొన్ని రోజుల పాటు అతి తీవ్ర వర్షాలు తప్పవంటూ వాతావరణ విభాగం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.
- మధ్య ఆఫ్రికా దేశమైన చాద్ రిపబ్లిక్‌ది విచిత్ర పరిస్థితి. నిన్నామొన్నటిదాకా దుర్భరమైన కరువుతో దేశమంతా అల్లాడిపోయింది. ఇప్పుడేమో గత 30 ఏళ్లలో ఎన్నడూ కనీవినీ ఎరగని స్థాయిలో వర్షాలు ముంచెత్తుతున్నాయి.
- థాయ్‌లాండ్‌ను కూడా నెల రోజులుగా భారీ వరదలు ఊపిరి సలపనివ్వడం లేదు. 77 రాష్ట్రాలకు గాను ఏకంగా 59 రాష్ట్రాలు వరద బారిన పడ్డాయి. 4.5 లక్షల ఇళ్లు దెబ్బ తినడమో కూలిపోవడమో జరిగింది. 40 శాతం ప్రాంతాలు ఇంకా మునకలోనే ఉన్నాయి. తాజాగా సోమవారం 8 దక్షిణాది రాష్ట్రాలకు భారీ వరద హెచ్చరికలు జారీ అయ్యాయి!
- ఫిలిప్పీన్స్‌దీ ఇదే పరిస్థితి. తుఫాను కారణంగా వర్షాలు దేశాన్ని ముంచెత్తుతున్నాయి.
- భారీ వరదలతో మెక్సికో తీరం అల్లాడుతోంది.
- భారత్‌లోనూ తుఫాన్ల దెబ్బకు ఢిల్లీ, బెంగళూరు అల్లాడిపోయాయి. హైదరాబాద్‌నైతే కొన్ని వారాలుగా భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

కారణాలెన్నో...!

గ్లోబల్ వార్మింగ్ మొదలుకుని మితిమీరిపోయిన శిలాజ ఇంధన వాడకం దాకా తాజా వాతావరణ మార్పులకు కారణాలెన్నో! ప్రధాన కాలుష్య కారణమైన కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలకు 90 శాతం దాకా శిలాజ ఇంధనమే కారణమవుతోంది. అడవుల విచ్చలవిడి నరికివేత, అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న పెట్రో ఉత్పత్తుల వెలికితీత వంటివి కూడా ఇందుకు దోహదపడుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు మరో పదేళ్లలో భూమి సగటు ఉష్ణోగ్రత ఏకంగా 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ దాకా పెరిగితే ఆశ్చర్యం లేదని ఐపీసీసీ సర్వే హెచ్చరించింది! ''ఇప్పటికైతే వాతావరణ మార్పులు అకాల వర్షాలకు, భారీ వరదలకు కారణంగా మారుతున్నాయి. వర్షపాతపు తీరుతెన్నులను కూడా అవి చాలావరకు మార్చేస్తున్నాయి'' అని వివరించింది.

నైజీరియాలో వరదలు.. 600కు చేరిన మరణాలు

అబూజా: ఆఫ్రికా దేశం నైజీరియాలో ఈ సీజన్‌లో ఆగస్ట్ నుంచి సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా 603 మంది మృతి చెందారు. దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలకు గాను 33 రాష్ట్రాల్లో వరదలతో అతలాకుతలమవుతున్నాయి.

సాక్షి విజయవాడ సిటీ


ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 18 । అక్టోబర్ । 2022



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన నరహరిశెట్టి శ్రీహరి, సుభాషిణి దంపతులు రూ.1,01,205 విరాళాన్ని మంత్రి సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు.



శాంతించిన కృష్ణమ్మ

గాంధీనగర్: కృష్ణమ్మ వరద ఉధృతి కొంత తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం 3.01లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు.

నేషనల్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



రైల్వేస్టేషన్: బెంగళూరులో జరుగుతున్న 61వ ఓపెన్ నేషనల్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ డివిజన్ రైల్వే ఉద్యోగిని సౌమ్య రజత పతకం సాధించారు. 100, 200, 800 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో వంటి ఏడు ఈ వెంట్లతో కూడిన హెప్టాథ్లాన్‌లో ప్రతిభ కనబరిచారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ దంపతులు సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారికి ఆలయ ఈఓ భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

రైతుల కోసం ప్రత్యేక సర్వీస్ సెంటర్లు

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



గన్నవరం: రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు, ఏలూరు జిల్లాల పర్యటన నిమిత్తం ఆయన సోమవారం హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పీఎం కిసాన్ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నట్లు తెలిపారు. రైతుల కోసం ఏలూరులో ఏర్పాటు చేస్తున్న సర్వీస్ సెంటర్‌ను వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. అమరావతి రాజధాని విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. తొలుత కిషన్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నేతృత్వంలో పార్టీ నేతలు స్వాగతం పలికారు.

ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్ల గడువు పెంపు

మచిలీపట్నం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 25 వరకు గడువు పెంచినట్లు కృష్ణా డీఈఓ తాహెరా సుల్తానా, ఉమ్మడి కృష్ణా జిల్లా ఓపెన్ స్కూల్స్ కో–ఆర్డినేటర్ నక్క బాబురావు సోమవారం తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించి, కోర్సుల్లో అడ్మిషన్లు పొందొచ్చని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులకు ఇదే చివరి అవకాశమని, ఈ నెల 25వ తేదీ దాటితే అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.





సంస్మరణకు సన్నాహాలు

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఈ నెల 21వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో పోలీసు సిబ్బంది రిహార్సల్స్ చేపట్టారు. కవాతు, బ్యాండ్ రిహార్సల్స్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సన్నాహాలను పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

స్వచ్ఛంద ఆహారం

అన్నదాతా సుఖీభవ

- ప్రభుత్వాస్పత్రిలో రోగుల ఆకలి తీరుస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- చపాతీలు పంపిణీ చేస్తున్న శ్రీ వాసవీ అన్నపూర్ణ సేవా సంఘం
- మధ్యాహ్న భోజనం సమకూరుస్తున్న హరేకృష్ణ మూమెంట్
- కూలింగ్ మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్న గురు గోవింద్ సింగ్ సంస్థ



హరే కృష్ణ మూమెంట్ స్టాల్ వద్ద భోజనం కోసం బారులుతీరిన రోగులు, వారి సహాయకులు





చపాతీలు పంపిణీచేస్తున్న శ్రీ వాసవీ అన్నపూర్ణ సేవా సంఘం. చపాతీలు తయారు చేస్తున్న యంత్రం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్)కి నిత్యం 2500 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తుంటారు. మరో వెయ్యి మంది ఇన్‌పేషెంట్లుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటారు. జీజీహెచ్‌కు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచే కాకుండా ఏలూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాల రోగులు వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల ఆకలి, దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి ఆస్పత్రి డైట్ నుంచి భోజనం అందుతుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులు ఆకలి వేసినా డబ్బులు ఖర్చుచేసి తినలేని పరిస్థితుల్లో ఉంటారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి వారి ఆకలి తీరుస్తున్నాయి.

ఉచితంగా చపాతీల పంపిణీ

ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షల కోసం వచ్చే అవుట్‌పేషెంట్లకు శ్రీ వాసవీ అన్నపూర్ణసేవా సమితి నిర్వాహకులు ఉచితంగా చపాతీలు పంపిణీ చేస్తున్నారు. కొందరు స్నేహితులు కలిసి ఈ సేవా సమితిని స్థాపించారు. 2018 నుంచి చపాతీలు పంపిణీచేస్తున్నారు. కరోనా సమయంలో జీజీహెచ్ కోవిడ్ ఆస్పత్రిగా మారడంతో కొంతకాలం సేవలు నిలిచాయి. ప్రస్తుతం సేవలు యథాతథంగా కొనసాగుతున్నాయి. నిత్యం 300 నుంచి 500 మంది రోగులకు చపాతీలను పంపిణీ చేస్తున్నారు. రోగులు తినగలిగినన్ని చపాతీలను కూరతో వడ్డిస్తున్నారు. చపాతీల తయారీ కోసం ఒక యంత్రాన్ని సమకూర్చుకున్నారు.

హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో సుభోజనం

హరే కృష్ణ మూమెంట్ ఇండియా ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు సుభోజనం పేరుతో ఉచితంగా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కొత్త ప్రభుత్వాస్పత్రిలో రోజూ వంద మందికి, పాత ఆస్పత్రిలో 300 మందికి ఉచితంగా భోజనం పంపిణీచేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఓపీ చీటీ ఆధారంగా ఉదయం పది నుంచి 11.30 గంటల వరకు టోకెన్‌లు అందజేస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భోజనం అందిస్తారు. గత ఏడాది కరోనా సెకండ్ వేవ్ తర్వాత ప్రారంభమైన భోజన పంపిణీ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. భోజనంలో కూర, పచ్చడి, సాంబారు, పెరుగు వడ్డిస్తారు. ఇంటి తరహా భోజనం తమ ఆకలి తీరుస్తోందని రోగులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

రూపాయికే లీటర్ తాగునీరు

రోగులు, వారి సహాయకుల దాహార్తి తీర్చేందుకు గురు గోవింద్ సింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో మంచినీటి సదుపాయం ఉన్నప్పటికీ, అవుట్ పేషెంట్లు ఈ కూలింగ్ వాటర్‌ను వినియోగిస్తుంటారు. ఈ ప్లాంట్‌లో రూపాయి నాణెం వేస్తే లీటరు కూలింగ్ మినరల్ వాటర్ వస్తుంది. నిత్యం రెండు నుంచి మూడు వేల లీటర్ల మినరల్ కూలింగ్ వాటర్‌ను రోగులకు అందజేస్తున్నారు.

ఆకలి తీరుస్తున్నారు



నేను వైద్య పరీక్షల కోసం ఆర్థోపెడిక్ విభాగానికి వచ్చాను. వైద్య పరీక్షలు ముగిసే సమయానికి మధ్యాహ్నమైంది. ఆకలి తీర్చుకునేందుకు ఆస్పత్రిలోనే ఉచితంగా చపాతీలు పంపిణీ చేస్తున్నారని తెలిసింది. ఇక్కడ అందించే చపాతీలు రుచిగా ఉన్నాయి. ఎన్ని చపాతీలు కావాలన్నా కూరతో వడ్డించి రోగుల ఆకలి తీరుస్తున్నారు.
– దుర్గ, కొండపల్లి, ఇబ్రహీంపట్నం మండలం

ఉచితంగా భోజనం



నా భార్యకు గొంతులో గడ్డ వచ్చింది. వైద్యం కోసం నెల రోజులుగా ప్రభుత్వాస్పత్రికి వస్తున్నాం. గడ్డ తగ్గుముఖం పట్టింది. ఉదయం పది గంటలకు వస్తే వైద్య పరీక్షలు అయ్యేసరికి 11.30 గంటలు అవుతోంది. ఓపీ తోపాటు సుభోజనం వాళ్లు మా భార్యాభర్తలు ఇద్దరికీ టోకెన్లు ఇచ్చారు. ఇక్కడ పెట్టిన భోజనం చాలా బాగుంది.
– గురునాథం, ఓర్వకల్లు, అచ్చంపేట మండలం

ఇంటి భోజనంలా ఉంది



మా పాపకు వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి వచ్చాం. వైద్యపరీక్షలు చేయించుకుంటున్న సమయంలో సుభోజనం వాళ్లు టోకెన్లు ఇచ్చారు. మధ్యాహ్నం భోజనం వడ్డించారు. ఒక కూర, పచ్చడి, సాంబారు పెరుగు వడ్డించారు. ఇంట్లో వండుకున్న భోజనం లానే ఉంది. ఇలా ఆకలి తీర్చడం అభినందనీయం
– కల్యాణి, మాగల్లు, కంచికచర్ల మండలం

మెరుగైన వైద్య సేవల కోసమే ఫ్యామిలీ డాక్టర్

రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం



సమీక్ష చేస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, పక్కన డాక్టర్ మోతీబాబు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ఫ్యామిలీ డాక్టర్ (ఫ్యామిలీ ఫిజీషియన్) విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆ కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు ఫ్యామిలీ డాక్టర్ విధానంపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయవాడ నాగార్జున నగర్ ఏపీఐఐసీ కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమావేశ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడానికి వీలుగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో సౌకర్యాల కల్పన కోసం సమీక్ష చేస్తున్నట్లు తెలిపారు. మంచంపై ఉన్న రోగులకు వారి ఇంటి వద్దే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ సమీక్షలో పలువురు ప్రోగ్రామ్ అధికారులు, గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్లు

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున విద్యా సంస్థల ప్రాంగణంలో సోమవారం కృష్ణా జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ సెలక్షన్స్‌కు జిల్లా వ్యాప్తంగా 135 మంది బాలబాలికలు హాజరయ్యారు. వారిలో ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ప్రకాశం జిల్లా అర్ధవీడులో జరిగే అంతర్ జిల్లాల రగ్బీ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.చంద్రకళ తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులకు కిట్‌లను పంపిణీ చేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రాంబాబు, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.ఆర్.కిషోర్, ఫిజికల్ డైరెక్టర్లు రిజ్వాన, గణేష్, మధు, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికే భరోసా

- ఎన్టీఆర్ జిల్లాలో 1,31,084 మంది లబ్ధిదారులు
- వారి బ్యాంక్ ఖాతాల్లో రూ.59.83 కోట్ల జమ
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్



వైఎస్సార్ రైతు భరోసా చెక్కు అందజేస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రైతులు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనే దృఢ నిశ్చయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విజయవాడలోని వ్యవసాయ అధికారుల సంఘ భవనంలో వైఎస్సార్ రైతు భరోసా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు రైతులకు ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏటా మూడు విడతల్లో ఒక్కొక్క రైతుకు రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ ఏడాది రెండో విడతలో భాగంగా సొంత భూమి కలిగిన, అటవీ భూములు సాగు చేస్తున్న రైతులు, సొంత భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులు కలిపి మొత్తం 1,31,084 మంది బ్యాంక్ ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నుంచి బటన్ నొక్కి రూ.59.83 కోట్లను జమ చేశారని తెలిపారు. రైతు భరోసాతో పాటు రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, ఉచిత వ్యవసాయ విద్యుత్, సూక్ష్మసేద్యం, పండ్ల తోటల అభివృద్ధికి సహాయం అందించి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని వివరించారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల పంటలకు గిట్టుబాటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రైతుల కష్టం తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. సొంత భూమిని సాగు చేసుకుంటున్న రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా కల్పించి రైతు పక్షపాతిగా చిరస్థాయిగా రైతు హృదయాల్లో నిలుస్తారన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం రైతుల అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రైతులకు సహాయకారిగా ఉండేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు పురుగు మందులను అందుబాటులో ఉంచారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రహుల్లా మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దామోదరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి విజయభారతి, డీడీ పి.మాధవీలత, డెప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ విజయ కుమారి, హార్టీకల్చర్ ఆఫీసర్ బాలాజీ, వ్యవసాయ శాఖ ఏడీలు బి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస రావు, డి.రమణ మూర్తి, సిహెచ్.శ్రీనివాసరావు, జి.కెనడీ, జె.కృష్ణజ్యోతి, బి.పద్మజ, ఎం.రత్నశ్రీ, ఎ.వి.ఎస్.అనితభాను, ఎం.స్వప్న పాల్గొన్నారు.

వడ్డీ బాధ తప్పింది



గతంలో వ్యవసాయ అవసరాల కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వచ్చేది. 2019లో సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అప్పుల బాధ తప్పింది. రైతుల్లో నూతనోత్సాహం వచ్చింది. విత్తు నుంచి పంట విక్రయం వరకు ప్రభుత్వం తోడుగా ఉంటోంది. ప్రస్తుత రైతు భరోసా సాయం పంట కోతలకు ఉపయోగపడుతుంది.
– లుక్కా వెంకటేశ్వరరావు, సీతారామపురం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మా కష్టాలను ప్రత్యక్షంగా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రైతు భరోసాతో ఆదుకుంటున్నారు. మా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయంతో ఎంతో మేలు చేకూరుతుంది. ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.
– పెన్నేరు పిచ్చేశ్వరరావు, లేళ్లగరువు

ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమీక్ష

చిలకలపూడి (మచిలీపట్నం): జిల్లాలో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు జరిగే ఏపీపీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణపై అధికారులతో ఏపీపీఎస్సీ డెప్యూటీ సెక్రటరీ జి.కేజియా, అసిస్టెంట్ సెక్రటరీ ఎ.కృష్ణవేణి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో జరిగిన ఈ సమీక్షలో వారు మాట్లాడుతూ జిల్లాలోని కానూరులో రెండు సెంటర్లు, ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఒక సెంటర్‌లో ఆన్‌లైన్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. హార్టీకల్చర్ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్స్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సెరీకల్చర్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్ ఆఫ్ ఆటో మొబైల్ ఇంజినీర్, అగ్రికల్చర్ డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగాల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. జిల్లాలో మొత్తం 5,087 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తగిన సిబ్బందిని నియమించి 144 సెక్షన్‌ను అమలు చేయాలని, ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం.హరినాథ్ పాల్గొన్నారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- స్పందనలో 91 అర్జీల స్వీకరణ



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్ తదితరులు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): స్పందన అర్జీలకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రజల నుంచి కలెక్టర్ నేరుగా 91 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాని అర్జీ లకు సంబంధించి తగిన కారణాలను అర్జీదారునికి తెలపాలన్నారు. న్యాయస్థానాలకు సంబంధించిన కేసులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖలీఫ్ కౌసర్ బానో, డ్వామా పీడీ జి.సునీత, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, డీఈఓ సి.వి.రేణుక, హౌసింగ్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు

ముఖ్యమైన అర్జీలు

- తన బాగోగులను తన కుమార్తె చూడటంలేదని, ఆమె పేరుతో రాసిన భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, టైటిల్ డీడ్ రద్దుచేసి తనకు న్యాయం చేయాలని చిట్యాల గ్రామానికి చెందిన రెడ్డిమల్ల మంగమ్మ అర్జీ ఇచ్చారు.
- ఎ.కొండూరు మండలంలోని కృష్ణారావుపాలెంలో ఉన్న తన ఇంటిలో అద్దెకు ఉంటున్నవారు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అదే మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన ఉషారాణి ఫిర్యాదు చేశారు.

దుర్గమ్మకు రూ.16 కోట్ల దసరా ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో రూ.16 కోట్ల మేర ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భ్రమరాంబ తెలిపారు. ఇంద్రకీలాద్రి మహా మండపం ఆరో అంతస్తులో ఆమె సోమవారం విలేకరులకు ఉత్సవ ఆదాయ వ్యయాలను వివరించారు. హుండీ కానుకల ద్వారా రూ.9.11 కోట్లు, దర్శన టికెట్ల ద్వారా రూ.2.50 కోట్లు, ప్రసాదాల విక్రయాలతో రూ.2.48 కోట్లు, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా రూ.1.03 కోట్లు, తలనీలాల ద్వారా రూ.20 లక్షలు, విరాళాలు ఇతరత్రా కలిపి రూ.16 కోట్ల ఆదాయం సమకూరిందని వివరించారు. ఉత్సవాల ఏర్పాట్లు, ప్రొవిజన్స్, ఇతర ఖర్చులకు రూ.10.50 కోట్ల మేర వెచ్చించామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యుడు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి, ఈఈలు కోటేశ్వరరావు, రమా పాల్గొన్నారు.

26 నుంచి కార్తిక మాసోత్సవాలు

ఈ నెల 26 నుంచి నవంబర్ 23వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై కార్తిక మాసోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఈఓ భ్రమరాంబ తెలిపారు. 23వ తేదీన ధన త్రయోదశి సందర్భంగా మహాలక్ష్మి యాగం, 24న దీపావళి సందర్భంగా అమ్మవారి ప్రధాన ఆలయంలో ధనలక్ష్మి పూజ, సాయంత్రం ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో దీపావళి వేడుకలు నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ సూర్యగ్రహణం నేపథ్యంలో ఉదయం 11 గంటలకు ఆలయాన్ని మూసివేసి, 26 ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామన్నారు. నవంబర్ ఎనిమిదో తేదీన చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు అమ్మవారి ఆలయంతో పాటు ఉపాలయాలను మూసివేసి మరుసటిరోజు ఉదయం పూజల అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. నవంబర్ నాలుగో తేదీ నుంచి భవానీ మండల దీక్షలు, 24వ తేదీ నుంచి అర్ధమండల దీక్షలు ప్రారంభమవుతాయని ఈఓ తెలిపారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి భవానీ దీక్ష విరమణలు ప్రారంభమై 19వ తేదీ పూర్ణాహుతితో ముగుస్తాయని పేర్కొన్నారు. డిసెంబర్ ఏడో తేదీన సత్యనారాయణపురం రామకోటి నుంచి కలశజ్యోతుల మహోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు.

చెప్పల స్టాండ్, క్లోక్‌రూమ్ టెండర్లు రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): భక్తుల చెప్పులు, సామగ్రికి భద్రపరుచుకునే కౌంటర్ల నిర్వహణ టెండర్లను దేవస్థాన ఈవో భ్రమరాంబ సోమవారం రద్దు చేశారు. చెప్పులు భద్రపరిచేందుకు, క్లోక్‌రూమ్‌లో సామగ్రిని భద్రపరిచేందుకు దేవస్థానం నిర్ణయించిన ధర కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఈవోకు పలువురు భక్తులు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఓ దఫా కాంట్రాక్ట్‌ను ఈవో రద్దు చేయగా.. కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో కాంట్రాక్టర్‌కు కౌంటర్లు అప్పగించగా, ఉత్సవాల అనంతరం భక్తుల నుంచి మరిన్ని ఫిర్యాదులు రావడంతో టెండర్లను రద్దు చేసినట్లు ఆలయ ఈవో భ్రమరాంబ ప్రకటించారు. మంగళవారం నుంచి దేవస్థాన సిబ్బంది కౌంటర్లను నిర్వహిస్తారని ఈవో పేర్కొన్నారు. కొండపై ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం సమీపంలోని కౌంటర్లలో తగినంత సిబ్బందిని నియమించాలని పరిపాలనా విభాగం అధికారులకు ఈవో ఆదేశాలు జారీ చేశారు.

ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో చోరీ

ఇబ్రహీంపట్నం(మైలవరం): స్థానిక స్మార్ట్ ఈ-వరల్డ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. షోరూమ్ వెనుకవైపు గోడకు రంధ్రం చేసి, పైన రేకులు తొలగించి లోపలికి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు నగదు, సెల్‌ఫోన్‌లు దోచుకెళ్లారు. సోమవారం షోరూమ్ తెరిచి చూసిన సిబ్బంది చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. వారు షాపు యజమాని కొండవీటి శ్రీనివాసరావుకు తెలపడంతో ఆయన వచ్చి రూ.2.30 లక్షల విలువైన సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ పి.శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ సభ్యులు ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బంగారు నగల వ్యాపారి దారుణ హత్య

- ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో ఘటన
- వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల అనుమానం


మృతిచెందిన నాగరాజు

కంచికచర్ల(నందిగామ): బంగారు నగల వ్యాపారి దారుణ హత్యకు గురైన ఘటన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో సంచలనం రేకెత్తించింది. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఘటన జరిగిన ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కంచికచర్లకు చెందిన చల్లకంటి నాగరాజు(35) స్థానిక పాత శివాలయానికి వెళ్లే దారిలో కొంతకాలంగా బంగారం వ్యాపారం చేస్తున్నాడు. షాపునకు సమీపంలోని హనుమాన్‌పేటలో భార్య శ్రావణి, ముగ్గురు కుమార్తెలతో కలిసి నివసిస్తున్నాడు.

బయటకు రమ్మని పిలిచి..

గొట్టుముక్కల గ్రామానికి చెందిన పరిటాల గ్రామంలో నివాసముంటున్న డేరంగుల జోజి ఆదివారం అర్ధరాత్రి హనుమాన్‌పేటకు వచ్చి ఇంట్లో ఉన్న నాగరాజును బయటకు పిలిచాడు. బయటకు వచ్చాక వారిద్దరి మధ్య కొద్దిసేపు చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. ఉన్నట్టుండి జోజి తన వెంట తెచ్చుకున్న కోడి కత్తితో నాగరాజు ఛాతిపై బలంగా పొడిచాడు. దీంతో నాగరాజు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం జోజి పరారయ్యాడు. ఇంతలో బయటకు వచ్చిన భార్య శ్రావణికి జోజి తనను కత్తితో పొడిచాడని చెప్పిన నాగరాజు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. శ్రావణి కేకలు వేయటంతో చుట్టుపక్కల వారంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని వైద్యం కోసం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హత్య ఉదంతం తెలుసుకున్న నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి, సీఐ బీవీ నాగేంద్రకుమార్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం సోమవారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. పోస్టుమార్టం నిమిత్తం నాగరాజు మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

కాగా నాగరాజు, జోజిలు కొంతకాలంగా స్నేహంగానే ఉంటున్నారు. వీరి మధ్య వ్యాపార సంబంధాలు బాగానే కొనసాగుతున్నాయి. జోజి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు కోడి పందేలు, అక్రమ వ్యాపారాలు చేస్తుంటాడని తెలుస్తోంది. తన వదినమ్మతో నాగరాజు అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతోనే జోజి ఈ హత్య చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడు జోజిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో జోజికి మరికొందరు కూడా సహకరించారనే కోణంలో విచారణ సాగుతున్నట్టు తెలుస్తోంది.

చెరువులో దూకి దంపతులు ఆత్మహత్య


మృతి చెందిన విజయ కుమార్ దంపతులు(ఫైల్)

గన్నవరం: చెరువులో దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన కృష్ణాజిల్లా గన్నవరం మండలంలో చోటుచేసుకుంది. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలే ఘటనకు కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన పెండెం విజయకుమార్(59) ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సత్యనారాయణపురంలో వస్త్ర దుకాణం నడుపుతున్నాడు. రెండేళ్లుగా కోవిడ్ పరిస్థితుల కారణంగా వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో వడ్డీ వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున్న అప్పులు తీసుకున్నాడు. దీనికి తోడు అతని భార్య విజయసంధ్య(38) పదేళ్లకు పైగా కాలిలో వెరికోస్ వీన్స్ వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యం చేయిస్తున్నారు. ఈ నెల 13న భార్యకు వైద్యం చేయించేందుకు తమిళనాడులోని శేలంకు తీసుకువెళ్లి 16న తిరిగివచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రించిన భార్యభర్తలు ఉదయం అదృశ్యమయ్యారు. సోమవారం ఉదయం తల్లిదండ్రుల ఆచూకీ కోసం వారి ఇరువురు కుమారులు బంధువులను సంప్రదించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీంతో వీరిని వెతుకుంటూ వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులోని పెద చెరువు వద్ద తండ్రి బైక్‌ను గుర్తించారు. చెరువు వద్దకు వెళ్లి చూడగా తల్లిదండ్రులు ఇరువురు శవాలుగా తేలడం గమనించి కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమేష్‌బాబు నేతృత్వంలోని సిబ్బంది గ్రామానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వ్యాపారంలో నష్టాలు, కొంత మంది వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులు తీర్చలేక, ఈఎంఐలు కట్టలేక మానసిక ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు విజయకుమార్ రాసిన సూసైడ్‌లేఖ ఫొటో అతని సెల్‌ఫోన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

- కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా
- ఎమ్మెల్యే సింహాద్రితో కలిసి ఏర్పాట్లపై సమీక్ష
- సభావేదిక, హెలిప్యాడ్ స్థలాల పరిశీలన


హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే సింహాద్రి, ఇతర అధికారులు

అవనిగడ్డ: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవనిగడ్డలో జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభను విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. నిషేధిత భూముల సమస్యను పరిష్కరించిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 20వ తేదీన బహిరంగసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సభాప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం డిగ్రీ కళాశాల మనటీవి భవనంలో పలుశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 25వేల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండగా వాటన్నింటినీ ఆ జాబితా నుంచి తొలగించేలా సీఎం చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈనెల 20వ తేదీన అవనిగడ్డలో జరిగే బహిరంగసభలో సీఎం చేతులమీదుగా క్లియరెన్స్ పత్రాలు అందించనున్నట్టు చెప్పారు. సీఎం బహిరంగసభకు వచ్చే ప్రజలకు తాగునీటి వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభకు తరలివచ్చే వారికి 500 బస్సులను ఏర్పాటు చేశామని, ప్రతి బస్సుకు ఒక ఇన్‌చార్జిని నియమించామన్నారు. స్టాల్స్, వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. శాఖల పరంగా తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు.

వరుసగా హామీల నెరవేర్పు..

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నారన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక నియోజకవర్గంలో ఎదురుమొండి వారధి, బండికోళ్లంక వారధి నిర్మాణాలకు పచ్చజెండా ఊపడంతోపాటు ఇప్పుడు నిషేధిత భూముల సమస్య పరిష్కారం చూపారన్నారు. అందుకే సీఎంకు కృతజ్ఞత తెలిపేందుకు లక్ష మంది జనాలు వస్తారని అంచనా వేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

హెలిప్యాడ్ స్థలం పరిశీలన..

మండల పరిధిలోని వేకనూరు ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ పనులను కలెక్టర్, ఎమ్మెల్యేతో పాటు ఏఎస్పీ రామాంజనేయులు పరిశీలించారు. హెలిప్యాడ్‌కు దగ్గరలో మంత్రులు, వీఐపీలు వేచి ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వరావు, ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ సూర్యనారాయణ, డీపీవో నాయక్, డీఈవో తాహెరా సుల్తానా, గుడివాడ, ఉయ్యూరు, మచిలీపట్నం ఆర్డీవోలు పద్మావతి, విజయకుమారి, కిశోర్, డీఎస్‌వో పార్వతి, డీఆర్‌డీవో పీడీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో వ్యక్తికి మూడేళ్ల జైలు

తోట్లవల్లూరు: దాడి ఘటనలో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు, రెండు వేల జరిమానా కోర్టు విధించినట్లు తోట్లవల్లూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ అవినాష్ తెలిపారు. మండలంలోని దేవరపల్లికి చెందిన జొన్నల భాస్కరరెడ్డి అదే గ్రామానికి చెందిన ఆళ్ల శివనాగిరెడ్డిపై 2013 ఏప్రిల్‌లో చెరకు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ కేసును విచారించిన విజయవాడ కోర్టు భాస్కరరెడ్డికి మూడేళ్ల జైలుశిక్ష, రెండు వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పినట్లు ఆయన తెలిపారు.

यूनियन बैंक యూనియన్ బ్యాంక్
లబ్బీపేట బ్రాంచి
VNR టవర్స్, వాటర్ ట్యాంక్ రోడ్డు, లబ్బీపేట, విజయవాడ-520010 ☎ 0866-2475821

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

यूनियन बैंक యూనియన్ బ్యాంక్
లబ్బీపేట బ్రాంచి
VNR టవర్స్, వాటర్ ట్యాంక్ రోడ్డు, లబ్బీపేట, విజయవాడ-520010 ☎ 0866-2475821

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

క్లుప్తంగా

పేదలకు అండగా నెహ్రూ ట్రస్ట్



పటమట(విజయవాడ తూర్పు): పేద ప్రజలకు అండగా నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. సోమవారం ఆయన 15వ డివిజన్ పుట్టరోడ్డుకు చెందిన ప్రదీప్ బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆకస్మికంగా మరణించగా ట్రస్ట్ నుంచి రూ. లక్ష నగదును మృతుని భార్య నాగరజనికి అందించారు. మూడో డివిజన్‌కు చెందిన షేక్ నజీమా క్యాన్సర్‌తో బాధపడుతోందని తెలిసి ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10 వేల నగదును అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వీఎంసీ కో–ఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, నాయకులు కాటూరి బాబి, ఆకుల బాలాజి, వెంకట రెడ్డి, వెంకయ్య నాయుడు, ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో సమన్వి ప్రతిభ


లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 13 వరకూ నిర్వహించిన విజయనగర ఉత్సవాలు–2022లో భాగంగా కూచిపూడి నృత్యపోటీల్లో శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని కె. సృతి సమన్వి సత్తా చాటింది. ఆ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ఆమె, వికారాబాద్‌జిల్లాలో నిర్వహించిన జాతీయ ప్రత్యక్ష వైయక్తిక కూచిపూడి నృత్య పోటీల్లో 200 మంది ప్రదర్శన చేయగా, సృతి మొదటి బహుమతి గెలుచుకుంది. ఆమెను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ పద్మజ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు రొమ్ము క్యాన్సర్ పై అవగాహన పెంచుకుని ఇంటి వద్దే పరీక్షించుకోవాలని సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ శ్రీఫణి అన్నారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా సోమవారం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు జరిగింది. డాక్టర్ శ్రీఫణి మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులతో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోందన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను స్వయంగా పరీక్షించుకునే విధానాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలా చేసే తొలిదశలోనే గుర్తించి నివారించుకోవచ్చన్నారు. రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, నూతన వైద్య విధానాలు గురించి విద్యార్థినిలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్



పటమట(విజయవాడ తూర్పు): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉండటంతో నగరవాసులు స్వచ్ఛందంగా అందులో భాగస్వాములు కావాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి అన్నారు. సోమవారం ఆమె నగరంలోని రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్, పూల మార్కెట్, ఇతర వాణిజ్య ప్రాంతాల్లో ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిషేధాన్ని ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. నగరంలోని 600 ప్రాంతాల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్నట్లు గుర్తించామని, వినియోగదారులు, వ్యాపారులకు అవగాహన కల్పించామన్నారు. విద్యాసంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల్లో నాలుగు రోజుల పాటు డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు. కాలుష్య నియంత్రణ బోర్డు ప్రతినిధి సౌమ్య, అధికారులు పాల్గొన్నారు.

హుండీ దొంగలకు ఏడాది జైలు

విజయవాడ స్పోర్ట్స్: దేవాలయంలో జరిగిన చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులు ఒక్కొక్కరికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ..500 జరిమానా విధిస్తూ విజయవాడ ఒకటో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. 2021 సెప్టెంబర్ 7న మాచవరం ప్రాంతంలోని శ్రీ మద్దిరావమ్మ ఆలయం తాళం పగలగొట్టిన దుండగులు అందులోని హుండీతోపాటు టీవీ చోరీ చేశారు. ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన నిందితులు కర్రా రమేష్ అలియాస్ చిన్నోడు, తండు భిక్షాలు అలియాస్ రాజులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్



స్థానికులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్ చిత్రంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పాలన చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి జనాదరణ పెరుగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని విష్ణునగర్, బైబిల్ కళాశాల ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. సీఎం జగన్ అమలుచేస్తున్న పథకాల ద్వారా రాజన్న రాజ్యం సాకారమైందన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలు ఆమోద యోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ ఓర్చుకోలేక టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. లేనిపోని పుకార్లు పుట్టించి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి సుబ్బారావు, ఏలూరి శివాజి, డేవిడ్ రాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్



సచివాలయంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రాణిగారితోట 17వ డివిజన్‌లో జాతీయ రహదారిపై ఉన్న 78వ వార్డు సచివాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాయల సిబ్బంది పనితీరును, పలు రిజిస్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు శాతం, సమస్యలపై ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులపై వివరాలు తెలుసుకున్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ సచివాలయంలోని డిస్‌ప్లే బోర్డులో పథకాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయం ముందు ఎటువంటి వాహనాలను నిలపకుండా చూడాలని ఆదేశించారు.

ఓపెన్ చెస్ రేటింగ్ టోర్నమెంట్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ చెస్ అసోషియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ, ట్రెజరర్ జ్వాలాముఖి

పటమట(విజయవాడ తూర్పు): ఈ నెల 23న గుడివాడలోని త్రివేణి స్కూల్‌లో తిరుమల తిరుపతి ఓపెన్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ సెలక్షన్స్ జరుగుతాయని ఆంధ్ర చెస్ అసోషియేషన్ ప్రెసిడెంట్ కె వి వి శర్మ, ట్రెజరర్ జ్వాలాముఖి తెలిపారు. నగరంలోని అసోసియేషన్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. టోర్నమెంట్‌లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన వారిని ఎంపిక చేస్తామని , అండర్–7, 9, 11, 13 ,15 మొదటి స్థానంలో నిలిచిన బాల బాలికలను 50% ప్రవేశ రుసుముతో తిరుపతిలో జరిగే టోర్నమెంట్‌కు సెలెక్ట్ చేస్తామన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నరేష్, ఫణికుమార్ మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు బోర్డ్, చెస్ క్లాక్‌లను తీసుకుని 23న ఉదయం 8 గంటలకు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9700775220 , 9493501506లో సంప్రదించాలని సూచించారు. టోర్నమెంట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

వృత్తి విద్యా నైపుణ్యంతో సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న జన శిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎన్.విద్యాకన్నా

కృష్ణలంక(విజయవాడ తూర్పు): మహిళలు వృత్తి విద్యా నైపుణ్యం సాధించడం ద్వారా ఆర్థిక అవసరాలు తీర్చుకోవడానికే కాకుండా సమాజానికి కూడా విజ్ఞానం అందించిన వారవుతారని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎన్.విద్యాకన్నా అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్, ఎం.వి.విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం టైలరింగ్ శిక్షణ నాలుగో బ్యాచ్ ప్రారంభించారు.

ఆమె మాట్లాడుతూ ఏదేశంలో మానవ వనరులు పుష్కలంగా అభివృద్ధి సాధిస్తే ఆ దేశం అన్ని రంగాల్లో ముందుంటుందన్నారు. మహిళలు ఆర్థికాభ్యున్నతి చెందితే ఆ కుటుంబం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ లక్ష్యంతో ఎం.బి.విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు పి.విజయ, యు.వి.రామరాజు, కంకిపాడు ఉషా టైలర్స్ అధినేత ఉషారాణి, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ ఫ్యాకల్టీ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో జిన్నా చిత్ర యూనిట్ సందడి



దేవినేని అవినాష్ తో ముచ్చటిస్తున్న హీరో విష్ణు..

గుణదల (విజయవాడ తూర్పు): సినీ హీరో మంచు విష్ణు నగరంలో సందడి చేశారు. రిలీజ్ కు సిద్ధంగా ఉన్న జిన్నా చిత్ర ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన నగరానికి వచ్చారు. దీనిలో భాగంగా వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌ను గుణదలలోని ఆయన నివాసంలో సోమవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు.

మంచు విష్ణు మాట్లాడుతూ దేవినేని కుటుంబంతో తమకు ఎంతో కాలంగా సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అవినాష్ మాట్లాడుతూ జిన్నా చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రచయిత, దర్శకుడు కోన వెంకట్, ఇతర ఆర్టిస్టులు హాజరయ్యారు.

యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇవ్వడానికి ఈ నెల 19వ తేదీ నుంచి వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ సోమవారం ప్రకటనలో తెలిపారు. టూ అండ్ త్రీ వీలర్ మెకానిక్ హెల్పర్, అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లంబింగ్ శానిటరీ వర్క్స్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ అంశాల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 0866–2470420లో సంప్రదించాలని కోరారు.

ఓపీలో.. వీల్‌చైర్స్



ప్రభుత్వాస్పత్రిలో నడవలేని స్థితిలో ఉన్న ఓపీ రోగులను వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రికి వచ్చే నడవలేని స్థితిలో ఉన్న అవుట్ పేషెంట్లను ఓపీ విభాగాల వద్దకు తీసుకెళ్లడానికి నాలుగు వీల్‌చైర్లను అందుబాటులోకి తెచ్చారు. నలుగురు సిబ్బందిని కూడా కేటాయించారు. ఇప్పటి వరకూ క్యాజువాలిటీ, ఇన్‌పేషెంట్లను మాత్రమే సిబ్బంది వీల్ చైర్, స్ట్రెచర్‌లపై అవసరమైన చోటుకు తరలించేవారు. దీంతో నడవలేని స్థితిలో ఉన్న అవుట్‌పేషెంట్స్ ఇబ్బంది పడేవారు. అలాంటి పరిస్థితి ఎదురు కాకుండా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి ఓపీ రోగుల కోసం నాలుగు వీల్‌చైర్స్‌తో పాటు నలుగురు సిబ్బందిని కేటాయించారు. వారు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఓపీ పూర్తయ్యేవరకు సేవలు అందిస్తారు. సూపరింటెండెంట్ తీసుకున్న నిర్ణయం ఎంతో మందికి ఉపయోగపడుతుందని రోగులు అంటున్నారు. నలుగురు ఉద్యోగులు రోజుకు 50 నుంచి 70 మందిని ఓపీల వద్దకు, పరీక్షల తర్వాత తిరిగి బయటకు తరలిస్తున్నారు.

ఆడిటర్ నాగబాబు ఆదర్శ ప్రాయుడు..

గుణదల (విజయవాడ తూర్పు): అంకిత భావంతో పనిచేసే ఏ వ్యక్తికైనా సమాజంలో గుర్తింపు లభిస్తుందని విజయవాడ ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. గురునానక్ నగర్‌లోని ఎన్ఏసీ కళ్యాణ మండపంలో ఆడిటర్ నాగబాబు సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వృత్తి, వ్యాపారం, ఉద్యోగం ఏ రంగమైనా అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. చార్టెడ్ అకౌంటింగ్ రంగంలో ఆడిటర్ నాగబాబు తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. వృత్తిలో నిబద్ధత కలిగి సేవా దృక్పథంతో ఆయన మసలేవారని గుర్తు చేశారు. అనంతరం నగరానికి చెందిన ఆడిటర్లు, పుర ప్రముఖులు, కుటుంబ సభ్యులు నాగబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌కమ్ ట్యాక్స్ మాజీ కమిషనర్ అజయ్ కుమార్, ఆంధ్ర హాస్పటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ రమణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు దేవినేని అవినాష్, సురేష్ అండ్ బాబు చార్టెడ్ ఎకౌంటెంట్స్ సంస్థ భాగస్వామి అక్కయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న స్టెల్లా ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్

పటమట(విజయవాడ తూర్పు) : తమ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినులు ఇటీవల న్యూ ఢిల్లీ, చత్తీస్‌గఢ్, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన ఆలిండియా నవ్ సైనిక్ క్యాంప్, స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్, ఆల్ ఇండియా లీడర్‌షిప్ క్యాంప్, ఎస్ఎస్‌బీ క్యాంప్, యాన్యూవల్ ట్రెనింగ్ క్యాంప్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరచారని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. సోమవారం కళాశాల్లో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల్లో చదువుతున్న రక్షిత ప్రశాంతి సైనిక్ క్యాంపునకు, హర్షిత్, జేష్టలు నవ్ సైనిక్ క్యాంపునకు(షిప్ మోడలింగ్), నమ్రత ఆల్ ఇండియా లీడర్‌షిప్ క్యాంపు, బ్లెస్సీ ఎస్ఎస్‌బి క్యాంపు, యూ. అఖిల స్పెషల్ ఇంటిగ్రేషన్ క్యాంపు, యాన్యువల్ ట్రెనింగ్ క్యాంపుల్లో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ–4 ఆంధ్ర గార్ల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ కుమార్ రాయ్, ఆడమ్ అధికారి కనకలత, కరస్పాండెంట్ స్లీవా, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ అనూహ్య, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఆర్మీ ఏఎన్‌వో లెఫ్టినెంట్ ఎన్.శైలజ, నేవల్ వింగ్ ఏఎన్‌వో సబ్ లెఫ్టినెంట్ వి. స్వప్న పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బాబు, పవన్: ఆసిఫ్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వించిపేటలోని తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రులపై జనసేన గూండాలు దాడి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న మహేష్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): కంప్యూటర్స్ రంగంలో అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఏటీ అండ్ టీ ల్యాబ్స్ సొల్యూషన్ ఆర్కిటెక్ హెడ్ ఎన్వీఎస్ మహేష్ అన్నారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం డెవ్‌ఆప్స్ అండ్ క్లౌడ్ ఇంటిగ్రేషన్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో ఎన్వీఎస్ మహేష్ మాట్లాడుతూ కంప్యూటర్స్ రంగంలో ఆయా సంస్థల సామర్థ్యాన్ని పెంచేందుకు డెవ్‌ఆప్స్ సాఫ్ట్‌వేర్ దోహదపడుతుందన్నారు. ఇది సంస్థల్లో వేగంగా సేవలందించడానికి సహకరిస్తుందన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు వారి రంగాల్లో వస్తున్న మార్పులు, ఆవిష్కరణలను తెలియజేసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, విభాగాధిపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి చర్యలు

పటమట(విజయవాడ తూర్పు): స్పందనలో ప్రజల నుంచి వచ్చే సమస్యలు, అర్జీలను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 21 అర్జీలను ఆయన స్వీకరించారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగంపై 12, ప్రజారోగ్యం విభాగంపై 3, రెవెన్యూ విభాగంపై 1, పట్టణ సామాజికాభివృద్ధి విభాగంపై1, ఇంజినీరింగ్‌పై 4 వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్(జనరల్) ఎం.శ్యామల, చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్, సీఎంవోహెచ్ డాక్టర్ పి.రత్నావళి, యూసీడీ ప్రాజెక్ట్ అధికారి శకుంతల, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి. వెంకటలక్ష్మి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్,పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో 8 అర్జీలు

చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో మూడు అర్జీలు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగంపై రెండు, పట్టణ సామాజికాభివృద్ధి విభాగంపై01, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో ఇంజినీరింగ్‌పై ఒకటి, పట్టణ ప్రణాళిక విభాగంపై ఒకటి వచ్చాయి. పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో జరిగిన స్పందనలో ఇంజినీరింగ్‌పై ఒకటి, ప్రజారోగ్య విభాగంపై ఒక అర్జీని అధికారులు స్వీకరించారు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సహజనటుడు నూతన్ ప్రసాద్

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: సహజనటుడు నూతన్ ప్రసాద్ అని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. డాక్టర్ నూతన్ ప్రసాద్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆరో వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చలిచీమలు సినిమాతో నూతన్ ప్రసాద్ సినీ జీవితం ప్రారంభమైందని ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించినట్లు తెలిపారు. సున్నితమైన హాస్యానికి చిరునామా నూతన్‌ప్రసాద్ అని అభివర్ణించారు. ప్రభుత్వం కళాకారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ నూతన్‌ప్రసాద్ తెలుగు సినిమా రంగానికి విశేషమైన సేవలను అందించారన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పరపు బాలరామకృష్ణ మూర్తి, జోతిష్య శాస్త్రవేత్త తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నూతన ప్రసాద్ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు పైడిపాటి వెంకన్న, సంస్థ కార్యవర్గ సభ్యులు, టీ.శ్రీనివాసరావు, మందా వెంకన్న, పీ.శ్రీనివాసరావు, ఎమ్. శేషు నారాయణ పాల్గొన్నారు. మల్లాది విష్ణు.. తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు తల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

● సమర్పణం



దుర్గాఘాట్‌లో సోమవారం కృష్ణవేణి సాక్షిగా అర్ఘ్యం సమర్పిస్తున్న దృశ్యం

● దర్పణం



మేఘాల ఘుమఘుమలు.. పుడమికి నీలి ఆకాశం సరిగమలు..

దుర్గాఘాట్‌లో దర్పణంలా వాననీటిలో ఆకాశం ప్రతిబింబం

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ.9.03 లక్షలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు స్వామివారికి హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.9.03 లక్షలు లభించాయి. దేవాలయంలో సోమవారం దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్ పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. మూడు నెలలకు హుండీల ద్వారా కరెన్సీ రూ. 8,47,143 చిల్లర రూ. 55,890 ఆదాయం లభించింది. ఆలయ ధర్మకర్తలు, భక్తులు , ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.


కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం కనకవల్లిలో లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్


శ్రీసత్యసాయి జిల్లా ఎన్పీకుంట మండలం ధనియానిచెరువులో ప్రజలతో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు.


తిరుపతి జిల్లా నాగలాపురం మండలం వెళ్లూరులో స్థానికులతో ఎమ్మెల్యే ఆదిమూలం


కాకినాడ జిల్లా తాళ్లూరులో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ఉద్యాన పంటలతో పోషకాహార భద్రత

- ఉద్యాన వర్సిటీ జాతీయ సదస్సులో వక్తలు


సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం: ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా పోషకాహార భద్రత లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'ట్రైబల్ హార్టికల్చర్' (గిరిజన ఉద్యాన పంటలు) అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సు సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పంటలతోపాటు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులు అధిక రాబడులు పొందే అవకాశం ఉందన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్ మాట్లాడుతూ.. మన దేశంలో ఉద్యాన పరిశ్రమ 320 మిలియన్ టన్నుల ఉత్పత్తితో స్థూల జాతీయోత్పత్తిలో 33 శాతంగా ఉందన్నారు. కేంద్రీయ ఉష్ణ మండల ఉద్యాన పంటల కేంద్రం (లక్నో) డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్ సింగ్ వర్చువల్‌గా గిరిజన ప్రాంతాల్లో లాభసాటిగా ఉద్యాన పంటల సాగుపై వివరించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులు సమర్పించిన 102 పరిశోధన పత్రాలపై ఈ సదస్సులో చర్చించారు. భారతీయ ఆయిల్‌ఫామ్ పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆర్‌కే మాథుర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎర్ర'బంగారం మెరుపులు

▶ మొదటి పేజీ తరువాయి

నల్లతామరకు తోడు అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఫలితంగా 60–70 శాతం పంట దెబ్బతినగా, హెక్టార్‌కు 20 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గుతుందని భావించారు. కానీ.. ఈ ఏడాది రికార్డు స్థాయిలో పంట సాగవుతోంది. ఈ ఏడాది సాగు లక్ష్యం 3.95 లక్షల ఎకరాలు కాగా.. 5.55 లక్షల ఎకరాల్లో రైతులు మిరప సాగు చేస్తున్నారు.

సర్కారు బాసటతో..

నల్లతామర పురుగు ప్రభావంతో గతేడాది తీవ్రంగా నష్టపోయిన మిరప రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తు నుంచీ ప్రభుత్వం అండగా నిలిచింది. నాణ్యమైన మిరప నారును అందుబాటులో ఉంచడంతోపాటు నల్లతామరను ఎదుర్కొనేందుకు వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ రూపొందించిన ప్రొటోకాల్‌పై ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించింది. ప్రత్యేక పోస్టర్లు, హోర్డింగ్‌లతో పాటు కరపత్రాలు ముద్రించి వలంటీర్ల ద్వారా రైతులకు పంపిణీ చేయించింది. మిరప ఎక్కువగా సాగయ్యే ప్రాంతాల్లో శాస్త్రవేత్తలు తోట బడులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. వీడియో, ఆడియో సందేశాలతో వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం పంట పూత దశకు చేరుకోగా.. ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఎక్కడా నల్లతామరతో పాటు ఇతర తెగుళ్ల జాడ కనిపించలేదు. ఫలితంగా దిగుబడులు కూడా ఈసారి గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. గతేడాది హెక్టార్‌కు 20 క్వింటాళ్లు రావడం గగనంగా మారగా.. ఈ ఏడాది హెక్టార్‌కు 40–50 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

రికార్డు స్థాయిలో ధరలు

2020–21లో క్వింటాల్ రూ.13 వేలు పలికిన ఎండు మిర్చి 2021–22లో ఏకంగా రికార్డు స్థాయిలో గరిష్ఠంగా రూ.27 వేల వరకు పలికింది. ప్రస్తుతం సాధారణ మిరప రకాలు రూ.23 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతుండగా.. బాడిగ, 341 రకాలు రూ.27,500 వరకు పలుకుతున్నాయి. అంతర్జాతీయంగా ప్రస్తుతమున్న డిమాండ్ కొనసాగి.. ఎగుమతులు ఊపందుకుంటే ధరలు ఇదే రీతిలో కొనసాగే అవకాశాలుంటాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దిగుబడి బాగా వచ్చేలా ఉంది



నేను మూడెకరాల్లో మిరప వేశా. గతేడాది నల్లతామర పురుగు వల్ల ఎకరాకు 20 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. సేంద్రియ, బిందు, మల్చింగ్ విధానాల్లో సాగు చేయడంతో తెగుళ్ల బెడద కన్పించలేదు. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉంది. మార్కెట్‌లో రేటు కూడా బాగుంది. మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నా.

– కల్యాణం వెంకట కృష్ణారావు, కోనయపాలెం, చందర్లపాడు, ఎన్టీఆర్ జిల్లా

నల్లతామర ప్రభావం లేదు



ఈ ఏడాది నల్లతామర ప్రభావం ఇప్పటివరకు ఎక్కడా కనిపించలేదు. వర్షాలు కాస్త కలవరపెడుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులొస్తాయి. గతేడాది హెక్టార్‌కు 20 క్వింటాళ్లు మాత్రమే దిగుబడులొచ్చాయి. ఈ ఏడాది రెట్టింపు వస్తుందని అంచనా వేస్తున్నాం.

– వంగ నవీన్‌రెడ్డి, జొన్నలగడ్డ, గుంటూరు జిల్లా

రికార్డు స్థాయిలో సాగు



గతేడాది నల్లతామర దెబ్బకు ఈసారి విస్తీర్ణం తగ్గిపోతుందనుకున్నాం. కానీ రికార్డు స్థాయిలో రైతులు మిరప సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రైతుకు విత్తు నుంచీ తోడుగా నిలవటంతో పంటపై తెగుళ్ల ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. కచ్చితంగా హెక్టార్‌కు 50 క్వింటాళ్లకు తక్కువ కాకుండా దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం.

– ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్, ఉద్యాన శాఖ

'ఆ ప్రాజెక్టుల పర్యావరణ పరిహారం చెల్లించండి'

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ హయాంలో నిర్మించిన పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులకు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సంయుక్త కమిటీ సిఫార్సు చేసిన నష్టపరిహారం చెల్లించాలని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్జీటీ ఆదేశించిన రూ.120 కోట్ల పరిహారం చెల్లింపుపై తదుపరి విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. పోలవరం, పురుషోత్తపట్నం, పట్టిసీమ ప్రాజెక్టుల పర్యావరణ ఉల్లంఘనలపై జమ్ముల చౌదరయ్య, వట్టి వసంతకుమార్, పెంటపాటి పుల్లారావు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ ప్రాజెక్టు వ్యయం ఆధారంగా పర్యావరణ నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. మరోవైపు సంయుక్త కమిటీ పోలవరం ప్రాజెక్టును మినహాయించి పురుషోత్తపట్నం ప్రాజెక్టుకు రూ.2.48 కోట్లు పట్టిసీమ ప్రాజెక్టుకు రూ.1.90 కోట్లు నష్టపరిహారంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలికి చెల్లించాలని సిఫార్సు చేసింది. ఎన్జీటీ ఆదేశాలు సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది.

మధుకాన్ సంస్థ స్థిరాస్తులు ఈడీ జప్తు

- వాటి విలువ దాదాపు రూ.80.65 కోట్లు
- 'రాంచీ ఎక్స్‌ప్రెస్ వే'రుణాలు దారిమళ్లించినట్లు అభియోగాలు

సాక్షి, హైదరాబాద్/ఢిల్లీ: టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) షాక్ ఇచ్చింది. నామా, ఆయన కుటుంబసభ్యులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని మొత్తం 28 స్థిరాస్తులను సోమవారం జప్తు చేసింది. వీటి విలువ రూ.80.65 కోట్లు ఉంటుందని స్పష్టం చేసింది. గత జూలైలోనూ నామాకు, ఆయన కుటుంబానికి సంబంధించి రూ.73.74 కోట్ల విలువ గల 105 స్థిరాస్తులను ఈడీ జప్తు చేసింది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల్లో నుంచి మధుకాన్ గ్రూపు రూ.361.92 కోట్లు దారి మళ్లించినట్లు ఈడీ నిగ్గుతేల్చింది. మధుకాన్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ ప్రమోటర్‌గా, డైరెక్టర్‌గా ఉన్న నామా నాగేశ్వరరావు బ్యాంకుల కన్సార్షియం నుంచి తీసుకునే రుణానికి పూచీకత్తుగా కూడా ఉన్నారని ఈడీ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. నామా నాగేశ్వరరావు, నామా సీతయ్య ఆధ్వర్యంలోని ఉషా ప్రాజెక్ట్స్, శ్రీ బీఆర్ విజన్స్, శ్రీధర్మ శాస్త కన్‌స్ట్రక్షన్స్, శ్రీ నాగేంద్ర కన్‌స్ట్రక్షన్స్, రాగిణి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, వరలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ అనే ఆరు డొల్ల కంపెనీలకు రూ.75.50 కోట్లు మళ్లించారని ఈడీ గుర్తించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని మధుకాన్ ప్రధాన కార్యాలయం, నగరంలోని మరికొన్ని ఆస్తులతోపాటు ఖమ్మం, ప్రకాశం జిల్లాల్లోని ఆ సంస్థ ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకుంది.

ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కాంట్రాక్ట్ రద్దు

రాంచీ నుంచి జంషెడ్‌పూర్‌ను కలిపే 163 కిలోమీటర్ల నిడివి గల ఎక్స్‌ప్రెస్ వే ఎన్‌హెచ్ 33కి సంబంధించి కాంట్రాక్టును మధుకాన్ కంపెనీ పొందింది. ఇందుకోసం 15 బ్యాంకుల కన్సార్షియం రూ.1,151 కోట్ల రుణం మంజూరు చేయగా, అందులోంచి రూ.1,029 కోట్లు మధుకాన్ సంస్థ తీసుకుంది. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నా ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం పురోగతి లేక, పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ సంస్థ గుర్తించింది. ఆ సంస్థ ఫిర్యాదు నేపథ్యంలో ఈడీ చర్యలు తీసుకుంది.

మునుగోడులో రూ.కోటి నగదు పట్టివేత

మునుగోడు: ఎలాంటి ఆధారాల్లేకుండా కారులో కోటి రూపాయలు మునుగోడుకు తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మునుగోడు ఉపఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గంలో పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సోమవారం మునుగోడు మండలం చల్మెడ గ్రామ చెక్‌పోస్ట్ వద్ద హైదరాబాద్ నుంచి మునుగోడుకు వస్తున్న సఫారీ (టీఎస్02ఈహెచ్2425) వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఆ వాహనంలో కోటి రూపాయలు పట్టుబడ్డాయి. కారులోని వ్యక్తి కరీంనగర్‌కు చెందిన సొప్పరి వేణును విచారించగా.. బీజేపీకి చెందిన మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి సూచన మేరకు నగదుని విజయవాడ నుంచి తీసుకొస్తున్నట్లు చెప్పాడని పోలీసులు వెల్లడించారు.

అభ్యర్థి.. మును'గోడు'

ప్రచారం చేస్తుండగా రూ.50 వేలు చోరీ

మర్రిగూడ : మునుగోడు ఉప ఎన్నిక ప్రచారంలో దొంగలు చేతివాటం ప్రదర్శించి జేబులు కత్తిరించేస్తున్నారు. ఓ ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి జేబులోంచి నోట్ల కట్ట కొట్టేశారు. మర్రిగూడ మండలం నామాపురం, కొట్టాల గ్రామంలో ఆ అభ్యర్థి సోమవారం కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారం ముగిసిన తర్వాత తన జేబు చూసుకుంటే అందులోని రూ.50 వేల కట్ట కనిపించలేదు. చుట్టూ మనవాళ్లే ఉన్నా డబ్బెలా పోయిందంటూ విచారం వ్యక్తం చేశారు.

కఠినంగా ప్లాస్టిక్ నిషేధం అమలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో సోమవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధం, ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధం అమలు, నేషనల్ హైవేస్ పరిసర గ్రామ పంచాయతీల్లో శానిటేషన్‌పై కలెక్టర్ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ బ్యానర్స్ వినియోగంపై నిషేధం విధించిందన్నారు. వచ్చేనెల ఒకటి నుంచి నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్లాస్టిక్ ఫ్లెక్సీల తయారీ, దిగుమతి చేయడాన్ని అనుమతించకూడదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు ఆయా ప్రాంతాల్లో చట్టాన్ని అమలు చేసేందుకు అవగాహన కల్పించాలన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారికి జరిమానా విధించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉన్న ప్లాస్టిక్ బ్యానర్‌ను



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

తొలగించి క్లాత్ ఏర్పాటు చేశారు.

శానిటేషన్‌పై దృష్టి పెట్టండి..

విజయవాడ నుంచి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న ప్రసాదంపాడు, రామవరప్పాడు, ఎనికేపాడు, గూడవల్లి, కేసరపల్లి గ్రామ పంచాయతీలు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చెత్తను డంప్ చేసే స్థానిక హోటల్స్, కిరాణా షాపులు, షాపింగ్ మాల్స్ తోపుడు బండ్ల యజమానులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీపీఓ జె.సునీత, డీఎల్‌పీఓ డి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కె. కృష్ణ ప్రసాద్, గ్రామపంచాయతీలు కార్యదర్శులు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

'నాడు–నేడు' పనులు వేగవంతం

జిల్లాలో నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని, ఇందుకోసం ఎంఈఓలతో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు సమన్వయం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నాడు – నేడు పనుల ప్రగతిపై విద్యా శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెర్ప్ విభాగానికి చెందిన ఏపీఎంలు నాడు – నేడు పనులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంఈఓలతో కలిసి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ పనుల్లో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలన్నారు. ఏపీఎంలు పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజనం నిర్వహణ, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ సీవీ రేణుక, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో పలువురు ప్రముఖులు

విమానాశ్రయం(గన్నవరం): రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్‌హరిచందన్‌తో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు వేర్వేరు పర్యటనల నిమిత్తం సోమవారం గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. తొలుత నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో రెండో విడత వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం వైఎస్ జగన్ ఉదయం 9.31 గంటలకు చేరుకున్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ఇక్కడికి చేరుకున్న సీఎం రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లికి వెళ్లారు. రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్‌హరిచందన్ బెంగళూరు నుంచి మధ్యాహ్నం 12.54కు ఇక్కడికి చేరుకుని విజయవాడలోని రాజ్‌భవన్‌కు వెళ్లారు. సాయంత్రం విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఇక్కడికి చేరుకుని మంగళగిరి పార్టీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. ఉదయం హైదరాబాద్ నుంచి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఇక్కడికి వచ్చి గుంటూరు, ఏలూరు జిల్లాల పర్యటన అనంతరం సాయంత్రం తిరిగి వెళ్లారు. సాయంత్రం హైదరాబాద్ నుంచి మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు ఇక్కడికి రాగా అభిమానులు స్వాగతం పలికారు.

వచ్చే నెలలో నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్

పాయకాపురం(విజయవాడ రూరల్): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ అండ్ సైన్స్ టెక్నాలజీ సంస్థ 30వ నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ 2022–23 జిల్లా స్థాయి పోటీలు నవంబర్ నెల మూడో వారంలో నిర్వహిస్తోందని ఆ సంస్థ ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.హుస్సేన్ ఓ ప్రకటనలో తెలిపారు. బాల శాస్త్రవేత్తలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఈ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తోందన్నారు. మరిన్ని వివరాలకు 98665 28299లో సంప్రందించాలని కోరారు.

కుల గణనతోనే బీసీల సాధికారత

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన బీసీల అభ్యున్నతి జరగాలంటే కుల గణనతోనే సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా జి.తులసియాదవ్ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని ఓ హోటల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేసన శంకరరావు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులకు బీసీ–డి కేటగిరి నుంచి బీసీ–ఎ కేటగిరికి చేర్చాలని, మున్నూరు కాపులను బీసీ జాబితా నుంచి తొలగించడం వంటి అంశాలపై దాఖలైన కేసుల సందర్భంగా బీసీ కులాల జనాభా వివరాల సేకరణ అవసరమని న్యాయస్థానాలు వ్యాఖ్యానించాయని చెప్పారు. వాటిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల్లో బీసీల కులాల గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ ఉద్యోగ విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్రిమిలేయర్ చట్టం వల్ల ఉద్యోగుల పిల్లలు ఎన్నో అవకాశాలు కోల్పోతున్నారని, చట్టం రద్దు చేసే వరకూ ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, కాకు మల్లిఖార్జున యాదవ్, మల్కాపురం కనకారావు, బీవీ కృష్ణారావు, మేకా వెంకటేశ్వర్లు, గోకర్ణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతల స్వీకార పత్రాలు అందుకుంటున్న గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, జి.తులసియాదవ్

బీసీల ద్రోహి చంద్రబాబు

విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విశాఖపట్నంలో రాష్ట్ర మంత్రులపై దాడులు చేసిన జనసేన నాయకులకు మద్దతు తెలపటం ద్వారా చంద్రబాబునాయుడు బీసీల ద్రోహి అనే విషయం మరోసారి స్పష్టమైందని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తన నియోజకవర్గంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి విశాఖపట్నంలో అల్లర్లు సృష్టిస్తున్న జనసేనకు మద్దతు తెలిపిన ప్రతిపక్షాలపై మండిపడ్డారు. మహిళా మంత్రి రోజా వాహనంపై తెగబడి దాడికి పాల్పడిన జనసేన శ్రేణులకు మద్దతు పలకడమంటే దాడులను ప్రోత్సహించటమేనన్నారు. రాజకీయ అజ్ఞాని పవన్‌కల్యాణ్ ఏమి మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావటం లేదన్నారు. ఏదో విధంగా రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చంద్రబాబు దిక్కుమాలిన రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మచిలీపట్నంలో మహిళ అనుమానాస్పద మృతి

కోనేరు సెంటర్(మచిలీపట్నం): అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన సోమవారం చిలకలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం చిలకలపూడికి చెందిన మాదిరెడ్డి వినోద్ కుమార్ ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఏడాది క్రితం ఈడేపల్లికి చెందిన సూరత్ నాగగౌరితో వివాహం జరిగింది. కొంతకాలం సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు రేగాయి. కొత్త కాపురం పెట్టాలంటూ భార్య కోరుతుండగా అందుకు వినోద్‌కుమార్ కుదరదంటూ చెప్పుకు వస్తున్నాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా, పెద్దలు చెరో వారం తల్లిదండ్రులు, అత్తింటి వద్ద ఉండేలా రాజీ కుదిర్చారు. కాపురం సజావుగా సాగుతుండగా వినోద్‌కుమార్ ఆదివారం రాత్రి ఈడేపల్లిలోని భార్య ఇంటికి వెళ్లాడు. సోమవారం తన ఇంటికి వెళ్లివస్తానని చెప్పి బయటకు వచ్చాడు. అలా వెళ్లిన కొద్ది సేపటికి కుమార్‌కు ఫోన్ వచ్చింది. అతని భార్య ఆత్మహత్య చేసుకుందంటూ స్థానికులు చెప్పారు. విషయం తెలుసుకున్న కుమార్ కంగారుపడి బయటకు వెళ్లిపోయాడు. కొంత మంది స్నేహితులు ఇచ్చిన సలహా మేరకు సోమవారం రాత్రి చిలకలపూడి పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని చెప్పాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వివరాలను తెలుసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

హిందీ పెత్తనాన్ని సహించం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హిందీ భాషను దేశమంతటా అమలు చేసేందుకు చేసిన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నామని, హిందీ పెత్తనాన్ని సహించమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రం బాలోత్సవం భవన్‌లో సోమవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'హిందీ భాష పెత్తనం, మాతృ భాషలకు అవమానం–రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రాలపై కేంద్రం మరో దాడిని ప్రారంభించిందని, ఇది ఫెడరల్ వ్యవస్థకు నష్టం చేస్తోందని వాపోయారు. ఈ తాజా ప్రతిపాదన కూడా హిందీ, హిందూ, హిందుస్థాన్ అన్న ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఆచరణలోకి తీసుకొచ్చే కుట్రలో భాగమేనన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తులు కలిసి రావాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

వారి పతనానికి నాంది..

తెలుగు భాషా సమాఖ్య గౌరవాధ్యక్షుడు సామల రమేష్‌బాబు మాట్లాడుతూ హిందీ భాష దేశంపై రుద్దడం వారి పతనానికి నాంది అని అన్నారు. దేశంలో ఎమర్జెన్సీ లాంటి పరిస్థితులు కంటికి కనిపిస్తున్నాయని విమర్శించారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, జనసాహితీ సంస్థ అధ్యక్షుడు దివి కుమార్ తదితరులు మాట్లాడారు. హిందీ పెత్తనానికి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయాలని, విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు, కవులు, కళాకారులు, నిరుద్యోగులు కలిసిరావాలని రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. సంతకాల సేకరణ చేయాలంది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పాల్గొన్నారు.

రూ.138 కోట్లతో రక్షణ గోడకు ప్రభుత్వ అనుమతి

- ప్రకాశం బ్యారేజి నుంచి వారధి వరకు నిర్మాణం
- వివరాలు వెల్లడించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు రూ.138 కోట్లతో రక్షణ గోడ నిర్మించేందుకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. వారధి నుంచి కృష్ణలంక, కోటినగర్ వరకు కృష్ణానది పరీవాహక ప్రాంతంలో రూ.125 కోట్లతో నిర్మించిన రక్షణ గోడ నిర్మాణాన్ని సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణలంక ప్రాంత వాసులు కృష్ణానది ముంపు వలన పడుతున్న కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో రూ.125 కోట్లు మంజూరు చేసి రక్షణ గోడను నిర్మించేందుకు శంకుస్థాపన చేశారన్నారు. సుమారు 1.25 కిలో మీటర్ల పొడవున 8.98 మీటర్ల ఎత్తున నిర్మిస్తున్న రక్షణ గోడ పనులను పూర్తి చేశామన్నారు.

త్వరలో టెండర్లు..

అలాగే ప్రకాశం బ్యారేజ్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు 1.05 కిలో మీటర్లు పొడవున రూ.138 కోట్లతో మరో రక్షణ గోడను నిర్మించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించి, పాలనాపరమైన అనుమతులను మంజూరు చేశారన్నారు. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రక్షణ గోడ నిర్మాణానికి చేపట్టాల్సిన చర్యలపై నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జల వనరుల శాఖ రివర్ కన్జర్వేటర్ కృష్ణారావు, తహసీల్దార్ వెన్నెల శ్రీను తదితరుల పాల్గొన్నారు.


రక్షణ గోడను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

నేడు మెగా జాబ్‌మేళా

మధురానగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యాన విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు సర్వం సిద్ధం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం కళాశాలలో మెగా మేళా ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు మెగా మేళాను విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు. 20కు పైగా కంపెనీలు మెగా మేళాలో పాల్గొని సుమారు మూడు వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని 160 ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులు హాజరుకానున్న దృష్ట్యా ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. మేళాలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రా రెడ్డి అతిథులుగా పాల్గొంటారన్నారు. మేళాలో, క్వెస్ కార్పొరేషన్ లిమిటెడ్, టీవీఎస్, మెడ్‌ప్లస్ ఫార్మశీ, ఎస్ఆర్ఎంటీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, ఈ కామ్ ఎక్స్‌ప్రెస్, డీటీడీసీ, పీఎంజే జ్యూయల్స్, టెల్ సొల్యూషన్స్, టీమ్‌లీజ్, కాగోస్ టెక్నాలజీస్, ఓమ్ లాజిస్టిక్స్ వంటి పలు ప్రముఖ కంపెనీలు పాల్గొని వారికి అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయి.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

సేవ

సేవ చేయడానికి ధనవంతులే కానక్కర్లేదు నలుగురికి సేవ చేసే భాగ్యం లభించడం కూడా అదృష్టమే! ఇదే విషయాన్ని తన చేతల ద్వారా నిరూపిస్తోంది తెలంగాణలోని సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో పదేళ్ల నుంచి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న ఉమర్ సుల్తానా. తన సంపాదనలో సగ భాగం సేవా కార్యక్రమాలకే ఉపయోగిస్తూ చుట్టూ ఉన్నవారికి ఆదర్శంగా నిలుస్తున్న సుల్తానా గురించి..



చిరుద్యోగి పెద్ద మనసు

సంపాదన కన్నా ఎప్పటికీ నిలిచి ఉండేది నలుగురికి ఉపయోగపడే పనే. పెద్ద మొత్తంలో డబ్బు సాయం చేయలేకున్నా, పిడికెడు ధైర్యం ఇవ్వగలిగితే చాలు అదే కొండంత అండ అనుకుంటాను. నా ఆలోచనలకు తగినట్టు నా భర్త కూడా సహకారం అందిస్తున్నారు. ఎంత సంపాదించినా రాని తృప్తి, నలుగురి కష్టాలను పంచుకోవడంలోనే ఉంటుంది. ఆ ఆలోచనతోనే మా జీవన ప్రయాణం కొనసాగిస్తున్నాము.
– సుల్తానా, అంగన్‌వాడీ టీచర్

మహ్మద్ ఉమర్ సుల్తానా ఓ సాధారణ అంగన్‌వాడీ టీచర్. పదేళ్లుగా విధులను నిర్వర్తిస్తోంది. ఉన్న ఊళ్లోనే కాదు, మండలంలోని మిగతా ఊళ్లలోనూ సుల్తానాకు మంచి పేరుంది. మా మనసున్న టీచరమ్మ అంటుంటారు స్థానికులు. ఏ ఆధారం లేనివారికి ఓ దారి చూపడమే కాదు ఏ ఆసరా లేదని కుంగిపోయేవారికి ధైర్యం చెబుతూ, అండగా నిలబడుతోంది. 'మన మాట మంచిదయితే చాలు అందరూ మనవాళ్లే' అంటుంది ఉమర్ సుల్తానా. దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందూప్రియాల్ గ్రామంలో సుల్తానా అంగన్వాడీ టీచర్‌గా విధులను నిర్వర్తిస్తుంటే ఆమె భర్త మహ్మద్ ఉమర్ గజ్వేల్‌లో ఓ మెకానిక్ షాపు నడిపిస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. వీరేమీ ధనవంతులు కాదు, కానీ ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిస్తే చాలు తమకు చేతనైన సాయం అందించడమే కర్తవ్యంగా భావిస్తారు.

గ్రామం నుంచి మొదలు... దౌల్తాబాద్, రాయపోల్, మిరుదొడ్డి, దుబ్బాక, గజ్వేల్ మండలాలలో వందకు పైన బాధిత కుటుంబాలకు సాయం అందించింది సుల్తానా. కరోనా సమయంలో గ్రామంలోని నిరుపేదలకు నిత్యవసర సరుకులు అందజేసింది.

జిల్లా వ్యాప్తంగా 108 సిబ్బంది అందిస్తున్న సేవలకు గాను వారికి సన్మానం చేసింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అత్యవసరమైన వస్తువులను అందజేస్తుంది. వివిధ రకాల కారణాలతో చదువు మధ్యలోనే ఆపేసిన బాలికలకు నచ్చజెప్పి, వారి తల్లిదండ్రులను ఒప్పించి తిరిగి వారు బడిలో చేరేలా ప్రోత్సహిస్తుంది. బాలికలకు అవసరమైన పుస్తకాలు, యూనిఫారమ్ కొనిస్తుంది.

రక్తదానం... అత్యవసర సమయంలో తన కుటుంబంలోని వారు రక్తదానం కూడా చేస్తుంటారు. లేదంటే, తెలిసిన మిత్రుల నుండి బాధితులకు సహాయం అందేలా చేస్తుంటారు. తాము సంపాదిస్తున్న కొద్ది మొత్తంలోనే సగ భాగాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ దంపతులు.

– గజవెల్లి షణ్ముఖ రాజు, సాక్షి, సిద్దిపేట



ఆమె సాయం మరువలేనిది

అనారోగ్య కారణంతో నా భర్త మరణించాడు. తట్టుకోలేక మా అత్తమ్మ తనువు చాలించింది. ముగ్గురు పిల్లలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మాకు మొదటగా సాయం అందించింది సుల్తానా. ఆమె ముందుకు రావడంతో మరికొంతమంది మేమూ ఉన్నామని సాయంగా వచ్చారు. మాకు ఆమె ఇచ్చిన భరోసా కొండంత బలాన్ని ఇచ్చింది. కష్టకాలంలో మా కుటుంబానికి తోడుగా నిలిచింది.
-షేక్ జానీ బి, సయ్యద్ నగర్




అమ్మలా తోడైంది

అమ్మా నాన్నలను కోల్పోయి అనాథగా మిగిలిన నాకు ఒక అమ్మలా తోడైంది. నాలో బాధ పోయేవరకు రోజూ పలకరించింది. ఆమె అందించిన భరోసాతోనే ఇప్పుడు నా జీవితాన్ని నిలబెట్టుకోగలిగాను.
- బండారు రేణుక, మంథూర్, రాయపోల్ మండలం

మంచి పెయింటింగులు వేసుకుంటే డబ్బులొస్తాయి. ఏ ఖరీదైన భవంతిలోనో అలంకరణగా మారతాయి. కాని ఆర్టిస్ట్ సృజనా శ్రీధర్ తన కుంచెను పిల్లలకు అంకితం చేసింది. పిల్లల కోసం బొమ్మలు వేయడం పిల్లల కథలకు రూపం ఇవ్వడం ఆమెకు ఇష్టం. వారికి వినోదం కాదు ఆలోచన కూడా ఇవ్వాలి అంటుంది సృజనా శ్రీధర్. తనను తాను దళిత్ ఆర్టిస్టుగా నిర్వచించుకుంటూ బొమ్మల ద్వారా బాల్యం నుంచి పిల్లలకు వివక్ష గురించి బాలికల హక్కుల గురించి తెలియచేస్తుండటం సృజన ప్రత్యేకత.



సృజన శ్రీధర్



దట్ నైట్

పిల్లలకే నా బొమ్మలు అంకితం

బాల్యం చాలా 'రిచ్'గా గడిచింది అంటే ఏమిటి?

ఎవరు ఏ వ్యాఖ్యానం చెప్పినా సృజనా శ్రీధర్ బాల్యం మాత్రం 'రిచ్'గా గడిచింది. 29 ఏళ్ల ఈ బాలల చిత్రకారిణి తన బాల్యం వైపు చూసుకుంటే అదెంత ఐశ్వర్యవంతమైనదో అనుకుంటుంది. 'ముంబైలో పుట్టి పెరిగాను. ఒక్కత్తే కూతురిని. మా నాన్న సియోన్ ప్రజా వైద్యుడు. అంటే పేదల కోసం వైద్యం చేస్తాడు. ఇంటికి ఎప్పుడూ మార్క్సిస్టులు, అంబేద్కరిస్టులు వచ్చేవారు. ఇంటినిండా పుస్తకాలే. పిల్లలకు ఊహ తెలియడం అంటుంటారు. నాకు తెలిసిన ఊహ వేరు. ఊహ రావడం అంటే సమాజం తెలియడమే. చిన్నప్పటి నుంచి తమ చుట్టూ ఉన్న విషయాలను తెలుసుకునే శక్తి పిల్లలకు ఉంటుంది. మనం వాటిని మెల్లమెల్లగా తెలియచేయాలి. పిల్లల పుస్తకాలు, బొమ్మలు ఆ పని చేయాలి అన్నది నా ఉద్దేశం' అంటుంది సృజన.

అందుకే ఆమె ఇటీవల తెచ్చిన ఒక బొమ్మల పుస్తకం 'శిల్పి... బ్రింగ్ ది వాటర్' (శిల్పీ... నీళ్లు తే) ఒక చిన్నారి ఆడపిల్ల తన పెంపుడు కుక్కతో కలిసి ఇంటికి కావలసిన నీళ్లు తేవడం గురించి కథ. ఇళ్లల్లో ఆడపిల్లే నీళ్లు తేవాలి. ఆడపిల్లలే ఎందుకు తేవాలి... అని సున్నితంగా ఆలోచన రేకెత్తిస్తుంది ఈ కథ. సృజన తెచ్చిన మరో పుస్తకం పేరు 'బేటియా భీ చాహియే ఆజాదీ' (ఆడపిల్లలకూ కావాలి స్వాతంత్ర్యం). అది చేయొద్దు... అలా నవ్వొద్దు... ఇది చదవద్దు... అది ఆడొద్దు... అని పెద్దలు చెప్పే 'సుద్దుల' నుంచి ఆడపిల్లలకు స్వేచ్ఛ కావాలి అని ఈ బుజ్జి బొమ్మల బాలల పుస్తకం చెబుతుంది.

'పిల్లల పుస్తకాలు కేవలం వారిని నిద్ర పుచ్చే పుస్తకాలు కాకూడదు. నిద్రకు ముందు వాటిని చదువుతూ వారు ఆలోచనల్లో మేల్కోవాలి' అని మంచిమాట చెబుతుంది సృజన.

బొమ్మల మీద ఆసక్తితో బెంగళూరులోని సృష్టి స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది సృజన. 'మా నాన్న దళితుడు. అమ్మ బహుజనురాలు. మన దేశంలో దళిత బహుజనులు ఏమనుకుంటారంటే మనం దేన్నీ ఆశించలేము అని. దళిత బహుజనులకు గొప్ప సాంస్కృతిక చరిత్ర ఉంది. దానిని చైతన్యానికి ఉపయోగించాలి. నా మటుకు నాకు చిత్ర కళ ఆర్ట్ గ్యాలరీలలో మగ్గిపోకూడదు. అది వీధుల్లోకి రావాలి. జనంతో ఉండాలి. అందుకు తగ్గట్టుగా చిత్రకారులు పని చేయాలి' అంటుందామె.

అందుకే భారతదేశంలో అతి తక్కువగా గుజరాత్, గోవాలలో ఉండే 'సిద్ది' తెగకు చెందిన ఒక చిన్నారి ఆడపిల్ల కథను రాసి దానికి బొమ్మలు వేసి 'ఆమూకి కవండి' అనే పుస్తకం తెచ్చింది సృజన. అంతే కాదు ముంబైలోని దళిత్ పాంథర్స్ ఉద్యమానికి అవసరమైన పోస్టర్లు, బొమ్మలు కూడా గీస్తుంది. ఇంకా చెప్పాలంటే సృజన బాలల చిత్రకారిణితో పాటు ఉద్యమ చిత్రకారిణి కూడా.


'మెరుగైన సమాజానికి బీజం బాల్యంలోనే పడాలి. న్యాయం, లింగ వివక్ష, పర్యావరణ రక్షణ... ఇలాంటి అంశాల గురించి నేను బొమ్మల పుస్తకాలు తయారు చేస్తాను. అలాగే సమాజంలో స్త్రీల భాగస్వామ్యాన్ని కూడా ఎప్పటికప్పుడు గుర్తు చేస్తుంటాను. రాజ్యాంగ రచనలో సాయపడిన 15 మంది స్త్రీలకు నివాళిగా నేను ఒక పెయింటింగ్ కూడా గీశాను' అంటుంది సృజనా.

అయితే కొంతమంది ఏమంటారంటే 'పిల్లలకు ఇంత సీరియస్ విషయాలు అవసరమా' అని. దానికి సృజన జవాబు– 'అవసరమే. అయితే అంత మాత్రాన పిల్లలను విసిగించే విధంగా ఆ పుస్తకాలు ఉండరాదు. వారికి ఆకర్షించే విధంగా ఎంత గొప్ప సృజనతో, ఎంత సరళంగా, ఎంత మంచి బొమ్మలతో ఎంత మంచి ఆలోచన చెప్పాం అనేదే ముఖ్యం' అంటుంది.


సృజన తన లైన్‌లో భిన్నత్వాన్ని ప్రదర్శిస్తుంది. 'ఏ బొమ్మ వేసినా నా ముద్ర ఉండేలా చూసుకుంటాను' అంటుంది.

'పిల్లలకు దూరంగా సమాజ సమస్యలను గదిలో పెట్టి తాళం వేయకుండా వారికి మంచి పుస్తకాలు ఇవ్వండి. వారు నేర్చుకుంటారు. వారు నేర్చుకోవాలి' అంటుంది సృజన.

ఆమెకు రంగుల కితాబు.



అమ్మాయిలకూ కావాలి స్వాతంత్ర్యం



సిద్ది తెగ బాలిక పాత్రధారిగా ఆమూ కీ కవండీ

సాగుబడి

చిత్త కార్తె : అక్టోబర్ 23 వరకు

సేంద్రియం.. వజ్ర సంకల్పం..!

సేంద్రియ సాగుతో మొదలు పెట్టి.. నర్సరీ రైతుగా, లాండ్‌స్కేపింగ్ కన్సల్టెంట్‌గా ఎదిగిన శశికళ

జీవనమే నిత్య పోరాటమైతే వ్యవసాయం అనుక్షణ యుద్ధమే అంటారు ఒంటరి మహిళా రైతు శశికళ. ఎం.ఎ., బీఈడీ చదివిన ఆమె భర్త ఆకస్మిక మృతితో ఉద్యోగాన్ని వదిలి వ్యవసాయం చేపట్టారు. 2005 నుంచి సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఆవులంటే ఇష్టంతో గోశాలను ఏర్పాటు చేసి వర్మీ కంపోస్టు, వర్మీ కల్చర్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. పచ్చదనాన్ని అమితంగా ఇష్టపడే ఆమె నర్సరీ ఏర్పాటు చేసుకొని లాండ్‌స్కేప్ కన్సల్టెంట్‌గా ఎదిగారు. క్షణం తీరిక లేకుండా పనుల్లో మునిగిపోయే శశికళ రైతుగా అనేక పురస్కారాలు అందుకున్నారు. ఇటు రైతుగా, అటు ఒంటరి మహిళగా దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను వజ్రసంకల్పంతో ఎదుర్కొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

17 ఏళ్లుగా 18.5 ఎకరాల్లో మొక్కవోని దీక్షతో సమీకృత సేంద్రియ వ్యవసాయం కొనసాగిస్తున్న కర్ర శశికళ స్వగ్రామం (నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం) దుగ్గెపల్లి. సొంతంగా తయారు చేసుకున్న వర్మీ కల్చర్‌తో బత్తాయి తోటను చీడపీడల నుంచి కాపాడుకోగలగటం ఆమెను దృఢ చిత్తంతో సేంద్రియ వ్యవసాయం వైపు తొలి అడుగులు వేయించాయి. సొంతంగా తయారు చేసుకునే వర్మీ కంపోస్టుకు అనేక జీవన ఎరువులు కలిపి తయారు చేసిన 'వర్మీ కల్చర్'ను ప్రధానంగా శశికళ ఉపయోగిస్తున్నారు. దీనితోనే వరి, బత్తాయి, పశుగ్రాసం తదితర పంటలతో పాటు నర్సరీ మొక్కలను సాగు చేస్తున్నారు. వర్మీ కల్చర్‌ను ఇతర రైతులకూ విక్రయిస్తూ ఆదాయం గడిస్తున్నారు.

వరి.. రెండేళ్లకో పంట!

తనకున్న వనరులను ప్రణాళికాబద్ధంగా ఉపయోగిస్తూ ముందడుగు వెయ్యటం శశికళ సేద్యం ప్రత్యేకత. సొంత భూమి 18.5 ఎకరాలకు గాను 6 ఎకరాల్లో బత్తాయి, 5 ఎకరాల్లో వరి పంట, 2 ఎకరాల్లో సీతాఫలం తోట సాగు చేస్తున్నారు. 2 ఎకరాల్లో దేశీ జాతుల గోశాలను ఏర్పాటు చేసి.. వర్మీ కల్చర్ ఉత్పత్తి చేస్తున్నారు. పుణేలో శిక్షణ పొంది 3.5 ఎకరాల్లో మూడేళ్లుగా నర్సరీని నిర్వహిస్తూ.. లాండ్‌స్కేప్ కన్సల్టెంట్‌గా ఎదుగుతున్నారు. అనుదినం 20 మంది మహిళా కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు.

పండించిన ధాన్యాన్ని బియ్యం చేసి నేరుగా హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని పరిచయస్తులకు కిలో రూ. 80 చొప్పున అమ్ముతున్నారు. ఒక సీజన్‌లో పండించిన ధాన్యం నిల్వచేసి రెండేళ్లపాటు బియ్యం విక్రయిస్తుంటారు. రెండేళ్లకు ఒక సీజన్‌లో మాత్రమే వరి పండిస్తారు. ఉదా.. ప్రస్తుత వానాకాలంలో 5 ఎకరాల్లో 5204 సన్న రకం వరి పంటను సాగు చేస్తున్నారు. యాసంగిలో గానీ, వచ్చే ఏడాది రెండు సీజన్లలో గానీ వరి పండించరు. ఈ మూడు సీజన్లలో తమ ఆవుల కోసం పశుగ్రాసం పండిస్తారు. మార్కెట్ అవసరం మేరకు ఏ పంటైనా పండించటం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని శశికళ అనుభవపూర్వకంగా చెప్తున్నారు.

వరి పంటకు దుక్కి దశలో ఓ సారి, చిరుపొట్ట దశలో మరోసారి వర్మీ కల్చర్‌ను వేస్తున్నారు. దీంతో పాటు ద్రవరూప ఎరువు వర్మీ వాష్‌ను పైప్‌లైన్ల ద్వారా అందిస్తున్నారు. వర్మీ కల్చర్ ప్రొడక్ట్ ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తున్నదన్నారు. 70 కిలోల ధాన్యం బస్తాలు ఎకరానికి 35 వరకు పండుతాయన్నారు. పూర్తిస్థాయి శ్రద్ధతో 3 దఫాలు వర్మీకల్చర్, 4 దఫాలు పంచగవ్య వాడటం ద్వారా శ్రీవరిలో ఎకరానికి 55 బస్తాల ధాన్యం దిగుబడి(2008లో) సాధించిన అనుభవం ఆమెది. ప్రస్తుతం నర్సరీ, లాండ్‌స్కేపింగ్ రంగంలోకి అడుగుపెట్టడం వల్ల వరి సాగుపై అంతగా శ్రద్ధ చూపలేకపోతున్నామన్నారు.

6 ఎకరాల్లో బత్తాయి మొక్కలు నాటి మూడేళ్లయ్యింది. ఏడాదికి రెండు సార్లు వర్మీకల్చర్, హ్యూమిక్ యాసిడ్‌ను వాడుతున్నారు. వచ్చే ఏడాది పంట కాపు వస్తుంది. 2 ఎకరాల్లో రెండేళ్ల క్రితం సీతాఫలం తోటను సాగు చేస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు వర్మీ కల్చర్, హ్యూమిక్ యాసిడ్‌ను వాడుతున్నారు. కాపు మొదలవుతోంది.

ఏటా 100 టన్నుల వర్మీ కల్చర్

2 ఎకరాల్లో ఏర్పాటైన గోశాలలో 45 దేశీ జాతుల ఆవులు, 25 ఎద్దులు 7 లేగదూడలు ఉన్నాయి. పేడ, మూత్రం, చేపల చెరువు వ్యర్థ జలాలను వర్మీ కల్చర్ ఉత్పత్తికి వాడుతున్నారు. ఏడాదికి సుమారు 100 టన్నుల వర్మీ కల్చర్‌ను తయారు చేస్తున్నారు. వర్మీ కల్చర్‌ను స్వంత వ్యవసాయానికి వినియోగిస్తూ ఇతర రైతులకు కిలో రూ. 15 చొప్పున విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు.

450 రకాల మొక్కల ఉత్పత్తి

పుణే వెళ్లి 20 రోజులు శిక్షణ పొందిన తర్వాత శశికళ తన వ్యవసాయ క్షేత్రంలోనే 3.5 ఎకరాల్లో నర్సరీని ఏర్పాటు చేశారు. లాండ్‌స్కేపింగ్ కన్సల్టెంట్‌గా పనిచేస్తూ సమస్యలను అధిగమిస్తూ అభివృద్ధి సాధిస్తున్నారు. ఇన్‌డోర్, అవుట్ డోర్, బోన్సాయ్ మొక్కలు.. అంటుకట్టిన పండ్లు, పూల మొక్కలు సుమారు 450 రకాల మొక్కలు ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలను పూణె, కోల్‌కత్తా, బెంగుళూరు నుంచి తెప్పిస్తున్నారు. నిమ్మ, నారింజ, ఉసిరి, బత్తాయి అంటు మొక్కలను, ఎవెన్యూ ప్లాంటేషన్‌కు వాడే రకరకాల మొక్కలను సొంతంగా ఉత్పత్తి చేస్తున్నారు. నర్సరీలో పెంచిన మొక్కలను స్థానికంగా ఉన్న గ్రామ పంచాయతీలు, మున్సిపల్ ఆఫీసులకు విక్రయిస్తున్నారు. ప్రైవేటు గృహాల్లో లాండ్‌స్కేపింగ్‌కు వినియో విక్రయిస్తూ శశికళ ఆదాయం పొందుతున్నారు. సేంద్రియ వ్యవసాయంలో నిలదొక్కుకోవడంతో పాటు నర్సరీ రైతుగా, లాండ్‌స్కేప్ నిపుణురాలిగా ఎదుగుతున్న శశికళ మహిళా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– నాతి రమేష్, సాక్షి, త్రిపురారం, నల్లగొండ జిల్లా











తీరికలేని పనంటే ఇష్టం..!

తీరిక లేని పనిలో నిమగ్నం కావటం అంటే ఇష్టం. పరిగెట్టి సంపాయించాలని కాదు. స్వతంత్ర జీవనం పట్ల, పచ్చదనం పట్ల మనసులో ఉన్న ఇష్టం కొద్దీ నర్సరీ-లాండ్‌స్కేపింగ్ రంగంలోకి అడుగుపెట్టాను. కరోనా తర్వాత ఇప్పుడిప్పుడే ఈ రంగం పుంజుకుంటున్నది. అమ్ముడుపోకుండా మిగిలిన మొక్కలను పెద్ద (21 ఇంచ్‌ల) కవర్లలోకి మార్చి తర్వాత నెమ్మదిగా ఎక్కువ ధరకు అమ్ముతున్నాను. 20 మందికి పనికల్పించాను. వ్యవస్థ సజావుగా నడిచే అంత ఆదాయం అయితే వస్తోంది. వర్మీ కంపోస్ట్ తయారు చేసుకుంటూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. సేంద్రియ వ్యవసాయంలో ఖర్చులు అదుపు చేసుకుంటేనే మంచి ఆదాయం వస్తుంది. ఒకే పంటపై ఆధారపడకుండా నర్సరీ ప్రారంభించాను. కష్టమైనా నష్టమైనా వ్యవసాయంలోనే నాకు సంతృప్తి. అమ్మానాన్న, బాబు సపోర్ట్ ఉండటంతో ఒంటరి మహిళనైనా పట్టుదలతో జీవన పోరాటం సాగిస్తున్నాను. పురుషులకు లేని సమస్యలు మహిళా రైతులను ఇంటా బయటా ఇబ్బంది పెడుతుంటాయి. తప్పదు. ఎదుర్కోవాల్సిందే!
– కర్ర శశికళ (91824 43048), సేంద్రియ రైతు, లాండ్‌స్కేపింగ్ కన్సల్టెంట్, దుగ్గెపల్లి, త్రిపురారం మం., నల్లగొండ జిల్లా

నవంబర్ 30న కోకోపోనిక్స్‌పై శిక్షణ

కొబ్బరి పొట్టు ఎరువులో పోషక ద్రావణంతో గ్రోబాగ్స్‌లో ఇంటిపై కూరగాయలు, ఔషధ మొక్కలను పెంచే కొత్త పద్ధతే కోకోపోనిక్స్ లేదా మట్టిలేని సేద్య పద్ధతి. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్‌ఆర్) నవంబర్ 30న ఆంగ్లంలో ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కొబ్బరి పొట్టు ఎరువును ఉపయోగించి టెర్రస్/బాల్కనీలో వివిధ ఉద్యాన పంటలను పండించడానికి అవసరమైన నైపుణ్యం, పరిజ్ఞానాన్ని ఈ శిక్షణ అందిస్తుందని ఐఐహెచ్‌ఆర్‌లో కోకోపోనిక్స్ నిపుణుడు డా. కరైవానన్ తెలిపారు. గృహిణులు, యువతీ యువకులు, వృద్ధులు.. ఎవరైనా అర్హులే. బెంగళూరులోని ఐఐహెచ్‌ఆర్‌కు వెళ్లి స్వయంగా హాజరయ్యే వారికి ఫీజు రూ. 2 వేలు. ఆన్‌లైన్‌లో శిక్షణ పొందగోరే వారికి ఫీజు రూ. వెయ్యి. నవంబర్ 29లోగా రిజిస్టర్ చేసుకోవచ్చు. పేర్ల నమోదు కోసం.. క్రింది గూగుల్ డాక్యుమెంట్‌ను చూడండి: https://forms.gle/9iFKjgN6v43u76FS9; ఇతర వివరాలకు.. 77608 83948



స్వియాటెక్ ఖాతాలో ఎనిమిదో టైటిల్

మహిళల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ఎనిమిదో టైటిల్‌ను సాధించింది. అమెరికాలో జరిగిన సాన్ డియాగో ఓపెన్ టోర్నీలో ఆమె విజేతగా నిలిచింది. ఫైనల్లో స్వియాటెక్ (పోలాండ్) 6-3, 3-6, 6-0తో క్వాలిఫయర్ డొనా వెకిచ్ (క్రొయేషియా)పై గెలిచి 1,16,340 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 95 లక్షల 62 వేలు)తోపాటు 470 ర్యాంకింగ్ పాయింట్లు దక్కించుకుంది.



100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి జాతీయ రికార్డు

జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రైల్వేస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యెర్రాజీ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో కొత్త జాతీయ రికార్డును సృష్టించింది. బెంగళూరులో సోమవారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును జ్యోతి 12.82 సెకన్లలో ముగించి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. ఈ క్రమంలో 13.04 సెకన్లతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును జ్యోతి బద్దలు కొట్టింది.

గుకేశ్ చేతిలోనూ కార్ల్‌సన్ ఓటమి





చెన్నై: ఎయిమ్‌చెస్ ఆన్‌లైన్ ర్యాపిడ్ అంతర్జాతీయ టోర్నీలో ప్రపంచ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ చెస్ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు మరో షాక్ తగిలింది. ఏడో రౌండ్ గేమ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చేతిలో ఓడిన కార్ల్‌సన్... తొమ్మిదో రౌండ్‌లో భారత్‌కే చెందిన దొమ్మరాజు గుకేశ్ చేతిలో పరాజయం చవిచూశాడు. చెన్నైకి చెందిన 16 ఏళ్ల గుకేశ్ కేవలం 29 ఎత్తుల్లో కార్ల్‌సన్‌ను బోల్తా కొట్టించాడు. తద్వారా ప్రపంచ చాంపియన్ అయ్యాక కార్ల్‌సన్‌ను ఓడించిన పిన్న వయస్కుడిగా గుకేశ్ గుర్తింపు పొందాడు.

భారత జట్టుకు కాంస్యం



కైరో (ఈజిప్ట్): ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఇలవేనిల్, మెహులీ ఘోష్, మేఘన సజ్జనార్‌లతో కూడిన భారత జట్టు కాంస్యం సాధించింది. కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ 17–11తో జర్మనీపై గెలిచింది. జూనియర్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో సమీర్ రజతం గెలిచాడు. ఫైనల్లో సమీర్ 23–25తో వాంగ్ షివెన్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.

ఓటమితో ముగింపు

భువనేశ్వర్: మహిళల అండర్–17 ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీని భారత జట్టు ఓటమితో ముగించింది. బ్రెజిల్‌తో సోమవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0–5 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. అమెరికా చేతిలో 0–8తో... మొరాకో చేతిలో 0–3తో ఓడిన భారత్ ఈ టోర్నీలో ఒక్క గోల్ కూడా చేయకపోవడం గమనార్హం.



షమీ అద్భుతం

- ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి భారత్‌ను గెలిపించిన పేస్ బౌలర్
- కోహ్లి కళ్లు చెదిరే ఫీల్డింగ్
- రాహుల్, సూర్యకుమార్ మెరుపులు
- ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆసీస్ పరాజయం

బ్రిస్బేన్: ఇది ప్రాక్టీస్ మ్యాచే! గెలిస్తే పాయింట్లేమీ రావు. ఓడినా నష్టం లేదు! కానీ అద్భుతమైన ముగింపుతో క్రికెట్ ప్రేక్షకుల్ని మురిపించింది. ఫీల్డింగ్‌లో కోహ్లి మెరుపులు... షమీ ఆఖరి ఓవర్ నిప్పులతో భారత్ అనూహ్యంగా గెలిచింది. చేతిలో 4 వికెట్లున్న డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా 6 బంతుల్లో 11 పరుగులు చేయలేక ఆలౌటైంది. మొత్తానికి టీమిండియా తొలి వార్మప్ మ్యాచ్ అదిరింది. భారత్ 6 పరుగుల తేడాతో గెలిచింది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (33 బంతుల్లో 57; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), సూర్యకుమార్ (33 బంతుల్లో 50; 6 ఫోర్లు, 1 సిక్స్) దంచేశారు. కేన్ రిచర్డ్‌సన్ 4 వికెట్లు పడగొట్టాడు. తర్వాత ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 180 పరుగులు చేసి ఆలౌటైంది. కెప్టెన్ ఫించ్ (54 బంతుల్లో 76; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) గెలుపు తీరాలకు తెచ్చినా... ఇన్నింగ్స్ మొత్తంలో ఒకే ఒక్క ఓవర్ వేసిన షమీ పేస్ (1-0-4-3)కు ఆసీస్ ఓడిపోయింది. ఆసీస్ చివరి ఆరు వికెట్లను తొమ్మిది పరుగుల తేడాతో కోల్పోయింది. భారత్ తమ రెండో వార్మప్ మ్యాచ్‌ను బుధవారం న్యూజిలాండ్‌తో ఆడుతుంది.

రాహుల్ ధనాధన్

ఓపెనర్ రాహుల్ తొలి ఓవర్ నుంచే ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. స్టార్క్ బౌలింగ్‌లో బౌండరీ కొట్టిన అతను కమిన్స్ వేసిన నాలుగో ఓవర్‌ను దంచి కొట్టాడు. 6 బంతుల్ని రాహులే ఎదుర్కొని 4, 0, 6, 4, 2, 4లతో 20 పరుగులు చేశాడు. 4 ఓవర్లయినా కెప్టెన్ రోహిత్ (2 బంతులే ఆడాడు) ఖాతా తెరువలేదు. జట్టు స్కోరేమో 47/0. ఇందులో రాహుల్‌వే 43 పరుగులు! 27 బంతుల్లో (6 ఫోర్లు, 3 సిక్సర్లు) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే అతను అవుట్ కాగా, 6, 4తో టచ్‌లోకి వచ్చిన రోహిత్ (15; 1 ఫోర్, 1 సిక్స్) కూడా నిష్క్రమించాడు. 10 ఓవర్లలో భారత్ 89/2 స్కోరు చేసింది. వేగంగా ఆడే ప్రయత్నంలో కోహ్లి (13 బంతుల్లో 19; 1 ఫోర్, 1 సిక్స్), చెత్త షాట్‌తో హార్దిక్ పాండ్యా (2) అవుటయ్యారు. కాసేపటికే దినేశ్ కార్తీక్ (14 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్) జోరుకు బ్రేక్ పడగా, కమిన్స్, స్టార్క్‌లను అవలీలగా ఎదుర్కొన్న సూర్య ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో 32 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు.

ఫించ్ పోరాటం

భారత్ నిర్దేశించిన లక్ష్యఛేదనకు దీటుగానే ఆసీస్ పరుగుల వేట సాగింది. ఓపెనర్లు మార్ష్ (18 బంతుల్లో 35; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫించ్ ధాటిగా ఆడారు. 5.3 ఓవర్లలో ఓపెనింగ్ వికెట్‌కు 64 పరుగులు జోడించారు. కానీ తర్వాతి బంతికి మార్ష్‌ను భువనేశ్వర్ బౌల్డ్ చేశాడు. అయితే ఫించ్ జోరు మాత్రం కొనసాగింది. స్మిత్ (11), మ్యాక్స్‌వెల్ (16 బంతుల్లో 23; 4 ఫోర్లు), స్టొయినిస్ (7)లతో కలిసి ఫించ్ జట్టును 19వ ఓవర్‌దాకా గెలుపు వైపు మళ్లించాడు. ఆ ఓవర్ తొలి బంతికి హర్షల్ అతన్ని క్లీన్‌బౌల్డ్ చేయగా, మరుసటి బంతికి టిమ్ డేవిడ్ (5)ను కోహ్లి మెరుపు వేగంతో డైరెక్ట్ త్రోతో రనౌట్ చేశాడు. 19 ఓవర్ల దాకా విశ్రాంతినిచ్చిన షమీకి ఆఖరి ఓవర్ అప్పగించారు. అదే అతని తొలి ఓవర్ కాగా తొలి 2 బంతులకు 4 పరుగులిచ్చాడు. తర్వాత నాలుగు బంతుల్లో వికెట్లు రాలాయి. కమిన్స్ (7) షాట్‌కు లాంగాన్‌లో సిక్సర్‌గా వెళ్లే బంతిని కోహ్లి ఒంటిచేత్తో గాల్లో అందుకోవడం మ్యాచ్‌కే హైలైట్. అగర్ (0) రనౌట్ కాగా, షమీ యార్కర్లతో ఇంగ్లిస్ (1), రిచర్డ్‌సన్ (0)లను బౌల్డ్ చేశాడు.

విండీస్‌కు చుక్కెదురు

స్కాట్లాండ్ చేతిలో అనూహ్య ఓటమి • రాణించిన మున్సే, వాట్, లీస్క్




బ్రాండన్ కింగ్ బౌల్డ్

హోబర్ట్: అత్యధికంగా రెండుసార్లు టి20 ప్రపంచకప్‌ను సాధించిన ఏకైక జట్టు వెస్టిండీస్ ఆటతీరు నానాటికి దిగజారుతోంది. ప్రపంచ వ్యాప్తంగా జరిగే టి20 లీగ్‌లలో మెరిపించే విండీస్ ఆటగాళ్లు ఐసీసీ టోర్నీలలో మాత్రం తేలిపోతున్నారు. ర్యాంకింగ్ ఆధారంగా నేరుగా తాజా ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందడంలో విఫలమైన వెస్టిండీస్ గ్రూప్ 'బి' క్వాలిఫయింగ్ రౌండ్ తొలి మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో పసికూన స్కాట్లాండ్ జట్టు చేతిలో వెస్టిండీస్ 42 పరుగుల తేడాతో ఓడిపోయింది. ప్రపంచకప్‌లో 'సూపర్ 12' దశకు అర్హత పొందే అవకాశాలు సజీవంగా ఉండాలంటే బుధవారం ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌లో విండీస్ తప్పనిసరిగా గెలవాలి. వరుసగా ఏడు టి20 మ్యాచ్‌ల్లో ఓడి ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన రిచీ బెరింగ్టన్ కెప్టెన్సీలోని స్కాట్లాండ్ స్ఫూర్తిదాయక ప్రదర్శనతో విండీస్‌ను బోల్తా కొట్టించి సంచలనం సృష్టించింది. విండీస్‌తో తొలిసారి టి20 మ్యాచ్ ఆడుతున్న స్కాట్లాండ్ మొదట బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 160 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఓపెనర్ జార్జి మున్సే (53 బంతుల్లో 66 నాటౌట్; 9 ఫోర్లు), మెక్లాయిడ్ (14 బంతుల్లో 23; 4 ఫోర్లు) రాణించారు. విండీస్ బౌలర్లలో జోసెఫ్ (2/28), హోల్డర్ (2/14) ఫర్వాలేదనిపించారు. 161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నికోలస్ పూరన్ బృందం 18.3 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. విండీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి కోలుకోలేకపోయింది. స్కాట్లాండ్ స్పిన్నర్లు మార్క్ వాట్ (3/12), మైకేల్ లీస్క్ (2/15) విండీస్‌ను దెబ్బ తీశారు. విండీస్ జట్టులో జేసన్ హోల్డర్ (33 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

సూపర్ సికందర్... జింబాబ్వే గెలుపు


సికందర్

హోబర్ట్ వేదికగా జరిగిన గ్రూప్ 'బి' మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో జింబాబ్వే 31 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (48 బంతుల్లో 82; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. సికందర్ కీలక ఇన్నింగ్స్ కారణంగా తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 20 ఓవర్లలో 7 వికెట్లకు 174 పరుగులు చేయగలిగింది. ఐర్లాండ్ బౌలర్లలో జోష్ లిటిల్ (3/24), అడైర్ (2/39), సిమీ సింగ్ (2/31) రాణించారు. అనంతరం 175 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు చేసి ఓడిపోయింది. కాంఫర్ (27; 1 ఫోర్) టాప్ స్కోరర్. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ (3/23), ఎన్గారవ (2/22), చటారా (2/22), సికందర్ రజా (1/22) రాణించారు.

గ్రూప్ 'ఎ'లో నేటి మ్యాచ్‌లు

నమీబియా X నెదర్లాండ్స్ (ఉదయం గం. 9:30 నుంచి)
శ్రీలంక X యూఏఈ (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా


• సమంత

యశోద డేట్ ఫిక్స్

సమంత టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'యశోద'. హరి, హరీష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమాని నవంబర్ 11న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''వినూత్నమైన కథతో రూపొందిన థ్రిల్లర్ 'యశోద'. ఈ చిత్రంలో హ్యూమన్ ఎమోషన్స్‌తో పాటు మహిళలను ఆకట్టుకునే అంశాలున్నాయి. యాక్షన్ సన్నివేశాల కోసం సమంత శిక్షణ తీసుకుని, చాలా ఎఫర్ట్స్ పెట్టి ఈ పాత్ర చేశారు. తెలుగు, తమిళ భాషల్లో స్వయంగా డబ్బింగ్ చెప్పారామె. రాజీ పడకుండా భారీ నిర్మాణ వ్యయంతో 100 రోజుల్లోనే షూటింగ్ పూర్తి చేశాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మా చిత్రం విడుదలవుతుంది'' అన్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్, ఉన్ని ముకుందన్, రావు రమేష్, మురళీ శర్మ, మధురిమ, కల్పికా గణేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: ఎం.సుకుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: రవికుమార్ జీపీ, రాజా సెంథిల్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, సహనిర్మాత: చింతా గోపాలకృష్ణారెడ్డి.


● మహేశ్‌బాబు

నవంబరులో ఆరంభం

'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత దాదాపు పన్నెండేళ్ల అనంతరం హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ కొత్త సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ ముగిసింది. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే ఈ నెల 9న ఆరంభం కావాల్సిన ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ వాయిదా పడింది. అనుకోకుండా మహేశ్‌బాబు తల్లి ఇందిరా దేవి మృతి చెందడంతో ఈ సినిమా షూటింగ్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కాగా నవంబరు మొదటివారంలో ఈ సినిమా రెండో షెడ్యూల్‌ను ఆరంభించాలనుకుంటున్నారట. గత వారం ఓ యాడ్ షూట్‌లో పాల్గొన్న మహేశ్‌బాబు ప్రస్తుతం ఫారిన్ టూర్‌లో ఉన్నారు. మహేశ్ తిరిగి హైదరాబాద్‌కు రాగానే ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ అవుతుంది. ఈ సెకండ్ షెడ్యూల్‌లో మహేశ్, పూజాలపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 28న విడుదల కానుంది.



హీరో అల్లు అర్జున్–దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా 'పుష్ప'. ఈ సినిమా తొలి భాగం పుష్ప: ది రైజ్' గత ఏడాది విడుదలై అద్భుత విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మలి భాగం 'పుష్ప: ది రూల్'కు సమయం ఆసన్నమైంది. 'పుష్ప: ది రూల్'కు సంబంధించిన పనులు ఊపందుకున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు సుకుమార్ తన టీమ్‌తో ఉన్న ఫొటోను షేర్ చేసింది చిత్ర యూనిట్.

వెన్నెల.. ఓ ఎమోషన్


• కీర్తీ సురేష్

'నేను లోకల్' (2017) చిత్రం తర్వాత హీరో నాని, హీరోయిన్ కీర్తీ సురేష్ కలిసి నటిస్తున్న చిత్రం 'దసరా'. శ్రీకాంత్ ఓదెల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్నారు. సోమవారం (అక్టోబరు 17) హీరోయిన్ కీర్తీ సురేష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'దసరా' చిత్రంలో వెన్నెల అనే యువతి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, వెన్నెల ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో ధరణిగా కనిపిస్తారు నాని. ''మా చితు చిత్తుల బొమ్మ (కీర్తీ సురేష్‌ను ఉద్దేశిస్తూ...)కు జన్మదిన శుభాకాంక్షలు. 'వెన్నెల' అంటే కేవలం పేరు మాత్రమే కాదు.. ఓ ఎమోషన్ కూడా'' అని పేర్కొన్నారు నాని. సాయికుమార్, సముద్రఖని, జరీనా వహాబ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 30న విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాకు కెమెరా: సత్యన్ సూర్యన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ చాగంటి.

నా మనసుకు నచ్చింది

''అనుకోని ప్రయాణం' – రాజేంద్ర ప్రసాద్


• ఎస్వీ కృష్ణారెడ్డి, జగన్ మోహన్, రాజేంద్ర ప్రసాద్, అచ్చిరెడ్డి

అద్భుతమైన కథ. నా మనసుకు నచ్చింది. నా చిత్రాల్లో ది బెస్ట్‌గా నిలుస్తుంది. ఈ సినిమా ఎలా ఆడుతుందో అనే టెన్షన్ నాలో మొదలైంది'' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. వెంకటేష్ పెదిరెడ్ల దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్, నరసింహ రాజు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అనుకోని ప్రయాణం'. బెక్కం వేణుగోపాల్ సమర్పణలో డా.జగన్‌మోహన్ డీవై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''ఆ నలుగురు'లో నాది సీరియస్ పాత్ర. అందుకే ఆ సినిమా విడుదలైనప్పుడు కొంత టెన్షన్ పడ్డాను. కానీ, అందరూ నవ్వి నవ్వి వంద రోజులు చూశారు. ఇప్పుడు 'అనుకోని ప్రయాణం' కూడా అంత పెద్ద విజయాన్ని అందుకుంటుంది'' అన్నారు. ''ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు నరసింహ రాజు. ''కరోనా సమయంలో ఈ కథ రాశాను'' అన్నారు డా.జగన్ మోహన్ డీవై. ''ఈ చిత్రం అందరి హృదయాలను టచ్ చేస్తుంది'' అన్నారు వెంకటేష్ పెదిరెడ్ల. ''అనుకోని ప్రయాణం' సంచలన విజయం సాధించాలి'' అన్నారు డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి . ''ఈ చిత్రం కొత్తగా ఉంటుంది'' అన్నారు బెక్కం వేణుగోపాల్. దర్శకులు కె.విజయభాస్కర్, నందినీ రెడ్డి, వీరభద్రం, నటుడు సోహైల్ పాల్గొన్నారు.

ఆ సంఘటనే సర్దార్‌కు స్ఫూర్తి


• పీఎస్ మిత్రన్

హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందిన తమిళ చిత్రం 'సర్దార్'. ఇందులో రాశీఖన్నా, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించారు. ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. కాగా అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ 'సర్దార్' సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తోంది. 'సర్దార్' రిలీజ్ సందర్భంగా దర్శకుడు పీఎస్ మిత్రన్ మాట్లాడుతూ– ''నా దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం 'ఇరుంబుదురై' (2018) (తెలుగులో 'అభిమన్యుడు') డబ్బింగ్ వర్క్స్ సమయంలో నాకు 'సర్దార్' ఐడియా వచ్చింది. కథ సిద్ధమైన తర్వాత నిర్మాత లక్ష్మణ్‌గారికి చెప్పినప్పుడు ఆయన హీరో కార్తీగారిని కలవమన్నారు. ఆయనకూ కథ నచ్చడంతో 'సర్దార్' మొదలైంది. వర్తమాన కాలంతో పాటు 1980లో నడిచే కథ 'సర్దార్'. ఇండియన్ ఇంటెలిజెన్స్ విభాగం 1980లో ఓ స్పై (గూఢచారి)ని తయారు చేయాలని ప్రయత్నించింది. అయితే సైన్యంలో పని చేసే వ్యక్తిని గూఢచారిగా మార్చడం అంత సులువు కాదు. గూఢచారికి నటించడం రావాలి, మారు వేషాలు వేయగలిగి తప్పించుకోవడం తెలిసుండాలి. దీంతో ఓ రంగస్థల నటుడిని గూఢచారిగా మార్చారు. ఇది వాస్తవంగా జరిగింది. ఈ సంఘటనే 'సర్దార్' కథకు స్ఫూర్తి. కానీ 'సర్దార్' కథ పూర్తిగా వాస్తవం కాదు.. కొన్ని సంఘటనలు కల్పితం. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేశారు. ఒకరు గూఢచారిగా ఏ గుర్తింపును కోరుకోని వారైతే, మరొకరు పబ్లిసిటీని ఇష్టపడేవారు. ఈ రెండు పాత్రలు ఆడియన్స్‌కు ఆసక్తికరంగా అనిపిస్తాయి. కార్తీ అద్భుతంగా నటించారు. నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియోస్ 'సర్దార్'ను తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అఖిల్‌తో ఓ సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను'' అని అన్నారు.


• శ్రీ సింహా

యూత్ ర్యాంప్

శ్రీ సింహా, నేహా సోలంకి జంటగా తెరకెక్కిన చిత్రం 'భాగ్ సాలే'. ప్రణీత్ సాయి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాలభైరవ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'కూత ర్యాంప్..' పాటని విడుదల చేశారు. కేకే సాహిత్యం అందించిన ఈ పాటను కాలభైరవ పాడారు. ''నేటితరం యువతని ఆకట్టుకునే కథతో 'భాగ్ సాలే' రూపొందింది. 'కూత ర్యాంప్..' పాట యువతకి కనెక్ట్ అవుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. జాన్ విజయ్, నందినీ రాయ్, రాజీవ్ కనకాల, వైవా హర్ష, సత్య, సుదర్శన్, వర్షిణి ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రమేష్ కుషేందర్.



ఆ టైటిల్ మాది – హీరో-దర్శకుడు నిక్షిత్

''హంట్' టైటిల్‌ని ముందు మేము రిజిస్టర్ చేయించాం. అయితే సుధీర్ బాబు హీరోగా భవ్య క్రియేషన్స్‌పై రూపొందిన చిత్రానికి కూడా 'హంట్' టైటిల్ ఫిక్స్ చేశారు. టైటిల్ మార్చుకోమన్నా వారు పట్టించుకోవడం లేదు'' అని 'హంట్' హీరో, దర్శకుడు నిక్షిత్ అన్నారు. నర్సింగ్ రావు నిర్మించిన చిత్రం 'హంట్'. నిక్షిత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించారు. ఈ చిత్రం మోషన్ టీజర్‌ను విడుదల చేశారు. ఎమ్ఎస్ఆర్ట్స్ అధినేత, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ తల్లాడ సాయికృష్ణ మాట్లాడుతూ– ''శ్రీ క్రియేషన్స్ బ్యానర్‌పై 'హంట్'టైటిల్‌ను 6 నెలల క్రితం ఫిల్మ్ చాంబర్‌లో రిజిస్టర్ చేసుకున్నాం. ఇదే టైటిల్‌ని భవ్య క్రియేషన్స్ పెట్టుకుని, సినిమా విడుదల ప్రమోషన్ కూడా స్టార్ట్ చేశారు'' అన్నారు. ''మా 'హంట్' ఆడియో రైట్స్ అమ్మటానికి ప్రయత్నం చేశాం.. కానీ, 'హంట్' పేరుతో వేరే చిత్రం కూడా ఉంది కాబట్టి మేము మీ చిత్రం కొనలేమని చెప్పారు. ఈ విషయంలో న్యాయం జరగాలి'' అని నర్సింగ్ రావు అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు				
సెన్సెక్స్ ▲	491	58,411		
నిఫ్టీ ▲	126	17,312		

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,669	▲	347
డోజోన్స్	30,191	▲	556
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,920	▲	61
డాక్స్	12,649	▲	211
షాంఘై	3,084	▲	13
నికాయ్	26,776	▽	315

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	50,438
బంగారం (99.5 స్వచ్ఛత)	50,236
వెండి (కిలో)	55,643

హెటిరో చేతికి జాన్సన్ ప్లాంటు

- డీల్ విలువ రూ.130 కోట్లు
- విస్తరణకు రూ.600 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ హెటిరో తాజాగా జాన్సన్ అండ్ జాన్సన్‌కు చెందిన ఇంజెక్టేబుల్స్ తయారీ కేంద్రాన్ని కొనుగోలు చేసినట్టు సోమవారం ప్రకటించింది. డీల్ విలువ రూ.130 కోట్లు. హైదరాబాద్ సమీపంలోని పెంజెర్ల వద్ద 55.27 ఎకరాల్లో ఈ ప్లాంటు విస్తరించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హెటిరో ఫ్లాగ్‌షిప్ స్టెరైల్ ఫార్మాస్యూటికల్, బయోలాజిక్స్ తయారీ యూనిట్‌గా ఇది నిలవనుంది. ఈ కేంద్రంలో ఇప్పటికే ఉన్న సౌకర్యాల ఆధునీకరణకు, మెరుగుపరచడానికి, బయోలాజిక్స్, స్టెరైల్ ఫార్మాస్యూటికల్ ఉత్పత్తుల తయారీని విస్తరించడానికి సుమారు రూ.600 కోట్ల పెట్టుబడికి కట్టుబడి ఉన్నట్టు హెటిరో ఎండీ వంశీ కృష్ణ బండి ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ ఫెసిలిటీ ద్వారా బయోకెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, మాలిక్యులర్ బయోసైన్సెస్, ఇంజనీరింగ్, అనుబంధ విభాగాల్లో నూతనంగా 2,000 ఉద్యోగాలను జోడించాలని సంస్థ లక్ష్యంగా చేసుకుంది. ఈ డీల్‌కు ప్రత్యేక ఆర్థిక సలహాదారుగా పీడబ్ల్యూసీ వ్యవహరించింది.

రుణ రేట్లను పెంచిన ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంక్– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిధుల సమీకరణ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్‌ఆర్)ను పెంచింది. రెండు ప్రైవేటు రంగ దిగ్గజ బ్యాంకులు– కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్‌లు కూడా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. దీనితో ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమైన ఆయా బ్యాంకుల వ్యక్తిగత, గృహ, ఆటో రుణాలు మరింత ప్రియం కానున్నాయి. ఆర్‌బీఐ రెపో రేటు (మే నుంచి 1.9 శాతం పెంపుతో 5.9 శాతానికి అప్) పెంపు బాట పట్టిన నేపథ్యంలో పలు బ్యాంకులు తమ రుణ రేట్లను పెంచుతున్న సంగతి తెలిసిందే. ఎస్‌బీఐ, కోటక్, ఫెడరల్ బ్యాంక్ రేట్ల పెంపు వివరాలు ఇలా..

- ఎస్‌బీఐ బెంచ్‌మార్క్ ఏడాది కాలపరిమితి ఎంసీఎల్‌ఆర్ 25 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెరిగి 7.95 శాతానికి చేరింది. ఈ రేటు అక్టోబర్ 15 నుంచీ అమల్లోకి వస్తుంది. మెజారిటీ కస్టమర్ల రుణ రేటు ఏడాది రేటుకే అనుసంధానమై ఉంటుంది. రెండు, మూడు సంవత్సరాల కాలపరిమితుల ఎంసీఎల్‌ఆర్ పావుశాతం చొప్పున పెరిగి వరుసగా 8.15 శాతం, 8.25 శాతానికి ఎగసింది. ఓవర్‌నైట్, నెల, మూడు, ఆరు నెలల రేట్లు 7.60–7.90 శాతం శ్రేణిలో ఉన్నాయి.
- కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎంసీఎల్‌ఆర్ వివిధ కాలపరిమితులపై 7.70–8.95 శ్రేణిలో ఉంది. ఏడాది ఎంసీఎల్‌ఆర్ 8.75 శాతం. అక్టోబర్ 16 నుంచి తాజా నిర్ణయం అమలవుతుంది.
- ఫెడరల్ బ్యాంక్ ఏడాది రుణ రేటు అక్టోబర్ 16 నుంచి 8.70 శాతానికి పెరిగింది.

అదే బాటలో కోటక్, ఫెడరల్ బ్యాంక్

ఎస్‌బీఐ సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్ రేటు కోత

కాగా, ఎస్‌బీఐ సేవింగ్స్ డిపాజిట్ రేటును 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీనితో ఈ రేటు 2.70 శాతానికి దిగివచ్చింది. అక్టోబర్ 15 నుంచి తాజా రేటు అమల్లోకి వస్తుంది. రూ.10 కోట్ల కన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్నవారికి తాజా రేటు అమలవుతుంది. కాగా, రూ.10 కోట్లు దాటిన సేవింగ్స్ అకౌంట్స్‌పై వడ్డీరేటును 2.75 శాతం నుంచి 3 శాతానికి పెంచుతున్నట్లు ఎస్‌బీఐ ప్రకటన పేర్కొంది. నిధుల భారీ సమీకరణ లక్ష్యంగా వివిధ బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచుతున్న నేపథ్యంలో ఎస్‌బీఐ చేసిన ఈ సర్దుబాట్లకు ప్రాధాన్యత సంతరించుకుంది.



ఎఫ్‌సీఎన్‌ఆర్ డిపాజిట్లపై బీఓబీ రేట్ల పెంపు

కాగా, ప్రవాస భారతీయుల ఫారిన్ కరెన్సీ (ఎఫ్‌సీఎన్‌ఆర్) డిపాజిట్లపై బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) వడ్డీరేట్లు పెంచింది. వివిధ కరెన్సీలు, మెచ్యూరిటీ కాలపరిమితులపై 135 బేసిస్ పాయింట్ల వరకూ వడ్డీరేటు పెరిగినట్లు బీఓబీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 16 నుంచి నవంబర్ 15 వరకూ తాజా రేట్లు అమలవుతాయని కూడా వివరించింది.

నోకియా, ఎరిక్సన్‌తో జియో కాంట్రాక్ట్

న్యూఢిల్లీ: టెలికం పరికరాల తయారీ దిగ్గజం నోకియా తాజాగా రిలయన్స్ జియో నుంచి దీర్ఘకాలిక కాంట్రాక్ట్ దక్కించుకుంది. జియో 5జీ నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా బేస్ స్టేషన్స్, అధిక సామర్థ్యం గల యాంటెన్నాలు, రిమోట్ రేడియో హెడ్స్‌ను నోకియా సరఫరా చేయనుంది. వినియోగదారులందరికీ అనుభవాన్ని మెరుగుపరచడానికి ఆధునిక నెట్‌వర్క్ టెక్నాలజీలలో నిరంతరం పెట్టుబడికి కట్టుబడి ఉన్నామని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. కాగా, ఎరిక్సన్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నట్లు జియో ప్రకటించింది. రేడియో యాక్సెస్ నెట్‌వర్క్‌ను పరిచయం చేసేందుకు ఎరిక్సన్‌తో కుదిరిన తొలి ఒప్పందం అని వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-10-2022	
విశాఖ	445-00
చిత్తూరు	453-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	441-00
విజయవాడ	441-00
రిటైల్ ధర (డజను)	66.00
17-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

నష్టాల్లోంచి లాభాల్లోకి..

- ఇంధన, బ్యాంకింగ్ షేర్ల ర్యాలీ
- సెన్సెక్స్ 491 పాయింట్లు ప్లస్
- 17,300 స్థాయిపైకి నిఫ్టీ
- సూచీలకు రెండోరోజూ లాభాలు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని ఒడిదుడుకులను బేఖాతరు చేస్తూ దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. అధిక వెయిటేజీ స్క్రిప్ రిలయన్స్‌తో పాటు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన షేర్లు రాణించడంతో సోమవారం దాదాపు ఒకశాతం బలపడ్డాయి. సెన్సెక్స్ 491 పాయింట్లు పెరిగి 58,411 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 126 పాయింట్లు లాభంతో 17,312 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలను అందుకున్న బెంచ్‌మార్క్ సూచీలు ఉదయం నష్టంతో మొదలయ్యాయి. అయితే ఇప్పటి వరకు వెల్లడైన కార్పొరేట్ సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో ఇంట్రాడేలో ఇన్వెస్టర్లు పతనమైన షేర్ల కొనుగోలుకు తెరతీశారు. దీంతో సూచీలు ప్రారంభ నష్టాల నుంచి తేరుకుని చివరికి లాభాల్లో ముగిశాయి. మెటల్, మీడియా, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ పావు శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.10% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1624 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1011 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆసియా మార్కెట్లు అరశాతం నష్టపోయాయి. యూరప్ సూచీలు ఒకశాతం లాభపడ్డాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.



కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు

ఉదయం సెన్సెక్స్ 165 పాయింట్ల పతనంతో 57,753 వద్ద, నిఫ్టీ 41 పాయింట్ల క్షీణించి 17,145 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఆరంభంలో అమ్మకాల ఒత్తిడి కారణంగా సెన్సెక్స్ 278 పాయింట్లు నష్టపోయి 57,640 వద్ద, నిఫ్టీ 87 పాయింట్లు పతనంతో 17,099 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల తర్వాత సూచీలు క్రమంగా లాభాల్లోకి మళ్లాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 529 పాయింట్లు బలపడి 58,449 వద్ద, నిఫ్టీ 143 పాయింట్లు పెరిగి 17,329 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి.

సెప్టెంబర్ త్రైమాసికంలో ఆదాయం పెరిగినా, నిర్వహణ లాభాల మార్జిన్ తగ్గడంతో డీమార్ట్ స్టోర్ల నిర్వాహక కంపెనీ ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ షేరు 3.50% నష్టపోయి రూ.4,153 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నాలుగు శాతం నష్టపోయి రూ.4141 వద్ద ఆరు వారాల కనిష్టాన్ని తాకింది.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ దూకుడు

- 50 శాతం లాభంతో లిస్టింగ్
- రూ. 90 వద్ద ట్రేడింగ్ షురూ

వినియోగ వస్తువుల రిటైల్ స్టోర్ల దిగ్గజం ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా స్టాక్ ఎక్స్ఛేంజీలలో బంపర్ లిస్టింగ్‌ను సాధించింది. షేరుకి రూ. 59 ధరలో ఇటీవలే ఐపీవోకు వచ్చిన కంపెనీ తొలి రోజు 51 శాతం జంప్‌చేసి రూ. 89 వద్ద లిస్టయ్యింది. తదుపరి బీఎస్‌ఈలో 91 వరకూ ఎగసింది. చివరికి 43 శాతం లాభంతో రూ. 84.5 వద్ద ముగిసింది.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ బ్రాండుతో స్టోర్లను నిర్వహించే కంపెనీ షేరు ఎన్‌ఎస్‌ఈలోనూ 52.5 శాతం ప్రీమియంతో రూ. 90 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. రూ. 83 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ట్రేడింగ్ ముగిసేసరికి 42 శాతం లాభపడి రూ. 84 సమీపంలో స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో 8.8 కోట్ల షేర్లు, బీఎస్‌ఈలో 59.3 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. ఈ నెల 7న ముగిసిన కంపెనీ పబ్లిక్ ఇష్యూ ఏకంగా 72 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ఐపీవో ద్వారా రూ. 500 కోట్లు సమకూర్చుకుంది.

ఎల్‌ఐసీ నుంచి ధన్‌వర్ష ప్లాన్

- సింగిల్ ప్రీమియం జీవిత బీమా ప్లాన్
- 10–15 ఏళ్ల టర్మ్‌తో ఆఫర్

హైదరాబాద్: జీవిత బీమా దిగ్గజం ఎల్‌ఐసీ కొత్తగా 'ధన్ వర్ష' బీమా ప్లాన్‌ను (ప్లాన్ నంబర్ 866) ప్రవేశపెట్టింది. ఇది నాన్ లింక్డ్ (ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయని), నాన్ పార్టిసిపేటింగ్, ఇండివిడ్యువల్, సేవింగ్స్, సింగిల్ ప్రీమియం లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ అని ఎల్‌ఐసీ ప్రకటించింది. జీవిత బీమా రక్షణ, పొదుపులను ఈ ప్లాన్‌లో భాగంగా ఆఫర్ చేస్తోంది. పాలసీ కాల వ్యవధిలో మరణిస్తే కుటుంబానికి పరిహారం చెల్లిస్తుంది. పాలసీ కాల వ్యవధి ముగిసే వరకు జీవించి ఉంటే ఏక మొత్తంలో హామీ మేరకు చెల్లిస్తుంది. ఈ ప్లాన్ 2023 మార్చి వరకే అందుబాటులో ఉంటుంది. 10, 15 ఏళ్ల కాలాన్ని పాలసీ టర్మ్‌గా ఎంపిక చేసుకోవచ్చు. కనీస బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.1.25 లక్షలు కాగా, గరిష్ట మొత్తంపై పరిమితి లేదు. 3 ఏళ్ల వయసున్న చిన్నారి వయసు నుంచి ఈ పాలసీ తీసుకోవచ్చు. పాలసీ టర్మ్‌లో ఏటా గ్యారంటీడ్ అడిషన్స్ జమ అవుతాయి. ఈ ప్లాన్‌కు అనుబంధంగా తీసుకునేందుకు ఎల్‌ఐసీ యాక్సిడెంటల్ డెత్ అండ్ డిజేబిలిటీ బెనిఫిట్ రైడర్, ఎల్‌ఐసీ న్యూ టర్మ్ అష్యూరెన్స్ రైడర్ అందుబాటులో ఉన్నాయి.



ఏసీసీ నష్టం 87 కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో సిమెంట్ రంగ దిగ్గజం ఏసీసీ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ3)లో రూ. 87 కోట్లకుపైగా నష్టం ప్రకటించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 450 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 6% బలపడి రూ. 4,057 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 3,812 కోట్ల ఆదాయం సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 30% ఎగసి రూ. 4,162 కోట్లను తాకాయి. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది.

క్యూ3లో భారీగా పెరిగిన ఇంధన వ్యయాలు లాభదాయకతపై ప్రభావం చూపినట్లు ఏసీసీ పేర్కొంది. దీంతో నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 712 కోట్ల నుంచి భారీగా క్షీణించి రూ. 16 కోట్లకు పరిమితమైనట్లు తెలియజేసింది. హోల్సిమ్ గ్రూప్ ఇండియా బిజినెస్‌ను 2022 సెప్టెంబర్ 15న సొంతం చేసుకోవడం ద్వారా అదానీ గ్రూప్ కంపెనీ ఎండీవర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డును పునర్వ్యవస్థీకరించిన సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో ఏసీసీ స్వల్పంగా 1 శాతం బలపడి రూ. 2,270 వద్ద ముగిసింది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ 2022 కొశ్చన్ పేపర్ అండ్ కీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. మరిన్నీ వివరాల కోసం సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com)లో చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌టీపీసీ లిమిటెడ్, న్యూఢిల్లీలో 864 ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్ ఇంజనీర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ–2022 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 864
» **ఇంజనీరింగ్ విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, మైనింగ్.
» **అర్హత:** కనీసం 65 శాతం మార్కులతో(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 55 శాతం) బ్యాచిలర్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)–2022కి హాజరై ఉండాలి.
» **వయసు:** ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది నాటికి 27ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** గేట్–2022 స్కోరు ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.10.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**11.11.2022
» **వెబ్‌సైట్:** careers.ntpc.co.in

ఎస్‌పీఏ, న్యూఢిల్లీలో 29 ఫ్యాకల్టీ పోస్టులు

న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏ).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 29
» **పోస్టుల వివరాలు:**ప్రొఫెసర్లు–09,అసోసియేట్ ప్రొఫెసర్లు–04,అసిస్టెంట్ ప్రొఫెసర్లు–16.
» **విభాగాలు:** ఆర్కిటెక్చర్, హౌసింగ్, అర్బన్ డిజైన్, ఫిజికల్ ప్లానింగ్, ఇండస్ట్రియల్ డిజైన్ తదితరాలు.

అర్హతలు

» **ప్రొఫెసర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 10 నుంచి 13 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
» **అసోసియేట్ ప్రొఫెసర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **జీతం:** పోస్టును అనుసరించి నెలకు రూ. 57,700 నుంచి రూ.2,11,800 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, 4, బ్లాక్-బి, ఇంద్రప్రస్థ ఎస్టేట్, న్యూఢిల్లీ–110002 చిరునామకు పంపంచాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.spa.ac.in

ఇండియా సెక్యూరిటీ ప్రెస్,నాసిక్ రోడ్‌లో 85 జూనియర్ టెక్నీషియన్ పోస్టులు

నాసిక్ రోడ్‌కు చెందిన ఇండియా సెక్యూరిటీ ప్రెస్(ఐఎస్‌పీ)..జూనియర్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 85
» **విభాగాలు:** టెక్నికల్, కంట్రోల్, మెషిన్‌షాప్, ఎలక్ట్రానిక్, స్టోర్, సీఎస్‌డీ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 25 ఏళ్లు మించకూడదు.
» **జీతం:** నెలకు రూ.18,780 నుంచి రూ.67,390 చెల్లిస్తారు.
» **పరీక్ష విధానం:** జనరల్ అవేర్‌నెస్, లాంగ్వేజ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు వస్తాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.11.2022
» **వెబ్‌సైట్:**https://ispnasik.spmcil.com

బీఈసీఐఎల్, ఢిల్లీ ప్రభుత్వాసుపత్రుల్లో 15 పోస్టులు

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్).. ఢిల్లీ /ఎన్‌సీఆర్/ఝజ్జర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 10+2, డిప్లొమా, బీఎస్సీ, బీఎస్సీ(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** ఎంటీఎస్ పోస్టులకు రూ.16,614, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు రూ.21,970, ఓటీఏ పోస్టులకు రూ.20,202 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**27.10.2022
» **వెబ్‌సైట్:** www.becil.com



మాయ్యూర్ ఎడ్యుకేషన్

డ్యూయల్ డిగ్రీతో.. యూజీ + పీజీ!

ఉన్నత విద్యకోసం..విద్యార్థులు బ్యాచిలర్, ఆ తర్వాత పీజీ డిగ్రీల వైపు దృష్టిపెడతారు. ఎందుకంటే.. మూడు నుంచి నాలుగేళ్ల వ్యవధిలో ఉండే బ్యాచిలర్ డిగ్రీతోనే కెరీర్‌లో రాణించలేని పరిస్థితి నెలకొంది! సంబంధిత విభాగంలో పీజీ సైతం పూర్తిచేస్తేనే జాబ్ మార్కెట్‌లో గుర్తింపు లభిస్తోంది!! కాని బ్యాచిలర్ తర్వాత పీజీలో చేరాలంటే.. సంబంధిత ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అంతేకాకుండా మరో రెండేళ్ల పాటు చదువు కోసం వెచ్చించాలి. ఇలాంటి విద్యార్థులు ఒకే ప్రవేశ ప్రక్రియతో.. ఐదేళ్లలోనే అటు బ్యాచిలర్, ఇటు పీజీ సైతం పూర్తిచేసుకునే మార్గం ఉంది! అదే.. డ్యుయల్ డిగ్రీ విధానం!! ఈ నేపథ్యంలో.. ఏకకాలంలో డిగ్రీ+పీజీకి మార్గాలు, అందుబాటులో ఉన్న కోర్సులు, అందిస్తున్న యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు తదితర అంశాలపై విశ్లేషణ...

» ఒకే సమయంలో యూజీ, పీజీ చదివే అవకాశం
» ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో అయిదేళ్లలోనే ఎంటెక్
» సైన్స్ విభాగంలో బీఎస్+ఎంఎస్ కోర్సులు
» సంప్రదాయ కోర్సులో ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లు
» విద్యార్థులకు ఏడాది సమయం కలిసొచ్చే అవకాశం

బీటెక్ కోర్సు వ్యవధి నాలుగేళ్లు, ఎంటెక్ రెండేళ్ల కోర్సు. అంటే.. సంప్రదాయ విధానంలో ఎంటెక్ పట్టా పొందాలంటే.. మొత్తం ఆరేళ్ల సమయం పడుతుంది. కానీ..ఐఐటీలు అందిస్తున్న బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీని అయిదేళ్లలోనే పూర్తిచేసుకోవచ్చు. ఈ విధానంలో ఒక ఏడాది ముందుగానే పీజీ సర్టిఫికెట్ చేతిలో పడుతోంది. దేశంలోని అన్ని ఐఐటీలు అయిదేళ్ల వ్యవధిలో బీటెక్+ఎంటెక్ పేరుతో డ్యూయల్ డిగ్రీ కోర్సులను అందిస్తున్నాయి. ఐఐటీలతోపాటు ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు వంటి విద్యాసంస్థలు సైతం బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సులను అందిస్తున్నాయి.

సైన్స్ కోర్సుల్లోనూ

- సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌గా పేరొందిన ఐఐఎస్‌ఈఆర్‌లో అయిదేళ్ల బీఎస్+ఎంఎస్ కోర్సు అందుబాటులో ఉంది. ఇక్కడ బీఎస్ కోర్సు వ్యవధి నాలుగేళ్లు, ఎంఎస్ కోర్సు రెండేళ్లుగా ఉంటోంది. ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ విధానంలో అయిదేళ్లకే ఎంఎస్ పట్టా సొంతం చేసుకోవచ్చు.
- ఐఐఎస్సీ–బెంగళూరు కూడా ఇదే తరహాలో ఇంటిగ్రేటెడ్ బీఎస్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. నాలుగేళ్ల బీఎస్ రీసెర్చ్ ప్రోగ్రామ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌లో ఆయిదో సంవత్సరంలో ఎంఎస్‌లో చేరే అవకాశం ఉంది.
- ఐఐటీ రూర్కీ కూడా బీఎస్+ఎంఎస్ పేరుతో డ్యూయల్ డిగ్రీ కోర్సులను అందిస్తోంది. బీఎస్ చివరి సంవత్సరం ముగిసిన తర్వాత విద్యార్థులు తమ అర్హతకు సరితూగే స్పెషలైజేషన్‌లో నేరుగా ఎంఎస్‌లో చేరొచ్చు.

ఐఐటీ జోధ్‌పూర్.. బీఎస్+ఎంటెక్

ఐఐటీ–జోధ్‌పూర్ ఈ ఏడాది నుంచి బీఎస్+ఎంటెక్ ప్రోగ్రామ్‌ను అందించనుంది. ఈ ఇన్‌స్టిట్యూట్.. ఫిజిక్స్, కెమిస్ట్రీలలో నాలుగేళ్ల బీఎస్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత ఇదే ఇన్‌స్టిట్యూట్‌లో ఎంటెక్‌లో చేరే వీలుంది. ఈ విధానాన్ని బీఎస్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీగా పేర్కొంటున్నారు.

బీటెక్ + ఎంబీఏ

ప్రస్తుతం దేశంలో మేనేజ్‌మెంట్ కోర్సులను కూడా డ్యుయల్ డిగ్రీ విధానంలో అందిస్తున్నారు. బీటెక్ ఉత్తీర్ణుల్లో అధిక శాతం మంది ఎంబీఏ వైపు అడుగులు వేస్తున్నారు. దీంతో పలు ఇన్‌స్టిట్యూట్‌లు అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంబీఏ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులకు ఒకవైపు టెక్నికల్ స్కిల్స్, మరోవైపు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు రెండూ లభిస్తున్నాయి.

'లా'.. అయిదేళ్లే

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సు కూడా ఇప్పుడు అందుబాటులో ఉంది.

వాస్తవానికి మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో లా ఎంట్రన్స్‌లో అర్హత సాధించి.. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరాల్సి ఉంటుంది. అంటే..ఇంటర్ తర్వాత ఎల్ఎల్‌బీ పట్టా పొందేందుకు ఆరేళ్ల సమయం వెచ్చించాలి. ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ విధానంలో.. ఇంటర్ అర్హతతోనే అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సులో చేరొచ్చు. ఇలా విద్యార్థులకు ఒక ఏడాది సమయం కలిసొస్తుంది. ఈ ప్రోగ్రామ్‌ను నేషనల్ లా యూనివర్సిటీలు అందిస్తున్నాయి. క్లాట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలోనూ ఇంటర్మీడియెట్ అర్హతతోనే 'లా' సెట్‌లలో అర్హత ఆధారంగా అయిదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరే వీలుంది.

ఇంటిగ్రేటెడ్ పీజీ

ఒకే సమయంలో బ్యాచిలర్, పీజీకి మార్గం.. ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లు. ఇవి అధిక శాతం సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లోనే ఉన్నాయి. బీఏ+ ఎంఏ, బీకాం+ఎంకాం, బీఎస్సీ+ఎమ్మెస్సీలను ప్రధాన ప్రోగ్రామ్‌లుగా పేర్కొనొచ్చు. వీటి వ్యవధి అయిదేళ్లు. అంటే.. మూడేళ్లు బ్యాచిలర్ డిగ్రీ, ఆ తర్వాత మరో రెండేళ్లు పీజీ ప్రోగ్రామ్. ఈ ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌ల వల్ల విద్యార్థులకు ప్రధానంగా కలిగే ప్రయోజనం.. డిగ్రీ తర్వాత పీజీ కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ రాయాల్సిన అవసరం ఉండదు. మొదటి మూడేళ్ల బ్యాచిలర్ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత తమకు కొనసాగడం ఆసక్తి లేకపోతే.. సదరు ప్రోగ్రామ్ నుంచి నిష్క్రమించే(ఎగ్జిట్) అవకాశం కూడా ఉంది. ఇలాంటి విద్యార్థులు బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్లను పొందొచ్చు.

ప్రస్తుతం ఈ తరహా కోర్సులను అన్ని యూనివర్సిటీల్లో అందిస్తున్నారు. టిస్, జేఎన్‌యూ వంటి ప్రముఖ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు.. ఇంటిగ్రేటెడ్ ఎంఏ పేరుతో పలు ప్రోగ్రామ్స్‌ను అందుబాటులోకి తెచ్చాయి. వీటిలో ఎంఏ స్థాయిలో సోషల్ వర్క్, సోషియాలజీ, రూరల్ డెవలప్‌మెంట్, ఎన్‌జీవో మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజేషన్లను అందిస్తున్నాయి.

పెరుగుతున్న ఆదరణ

- ప్రస్తుతం పలు యూనివర్సిటీలు అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు విద్యార్థుల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఐఐటీల్లోని డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశిస్తున్న విద్యార్థుల సంఖ్యనే ఇందుకు నిదర్శనంగా పేర్కొనొచ్చు. బీటెక్‌లో సీఎస్‌ఈ లేదా తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌లో సీటు లభించని విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుకు ప్రాధాన్యమిస్తున్నారు.
- కొంతమంది విద్యార్థులు నేరుగా డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకే తమ ఆప్షన్లు ఇస్తున్నట్లు చెబుతున్నారు. సంప్రదాయ కోర్సుల్లోనూ ఇంటిగ్రేటెడ్ పీజీ వైపు దృష్టి పెట్టే వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా సైన్స్ కోర్సుల విషయంలో ఈ దృక్పథం ఎక్కువగా ఉంటోంది.

ఎగ్జిట్ సదుపాయం

బ్యాచిలర్, పీజీ కలిపి డ్యూయల్ డిగ్రీ పేరుతో అందిస్తున్న యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు ఎగ్జిట్ సదుపాయాన్ని కల్పించడం విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ఉదాహరణకు ఐఐటీ రూర్కీలో అయిదేళ్ల బీఎస్+ఎంఎస్ ప్రోగ్రామ్‌లో నాలుగో ఏడాది తర్వాత విద్యార్థులు ఎగ్జిట్ అవ్వొచ్చు. వీరికి బీఎస్ సర్టిఫికెట్ అందిస్తారు. బీటెక్ +ఎంటెక్ పేరుతో అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ కోర్సుల విషయంలో మాత్రం ఈ అవకాశం లేదు.

ఎంపికలో అప్రమత్తంగా

డ్యూయల్ డిగ్రీ కోర్సులను ఎంచుకునే విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. సంబంధిత కరిక్యులంను పరిశీలించాలని..తమ ఆసక్తికి అనుగుణంగా ఉందో లేదో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలంటున్నారు. ఎగ్జిట్ మార్గం, రీసెర్చ్‌లో పాల్పంచుకునే అవకాశాల గురించి కూడా తెలుసుకోవాలని పేర్కొంటున్నారు. ఇన్‌స్టిట్యూట్స్‌ను ఎంచుకునే ముందుకు నిర్దిష్టంగా ఆయా ప్రోగ్రామ్‌లకు ఉన్న గుర్తింపుపై స్పష్టత తెచ్చుకోవాలని చెబుతున్నారు.

డ్యూయల్ డిగ్రీ.. ప్రయోజనాలు.. ప్రతికూలతలు

ప్రయోజనాలు

- ఇంటర్ అర్హతతోనే పీజీ దిశగా నేరుగా అవకాశం.
- బీటెక్+ఎంటెక్ కోర్సులో ఏడాది వ్యవధి కలిసొచ్చే అవకాశం.
- సైన్స్, హ్యుమానిటీస్ కోర్సుల విషయంలో బ్యాచిలర్ తర్వాత ఎగ్జిట్ అయ్యే అవకాశం.
- బ్యాచిలర్ తర్వాత పీజీలో చేరేందుకు మరో ఎంట్రన్స్ రాయాల్సిన అవసరం లేకపోవడం.

ప్రతికూలతలు

- టెక్ కోర్సుల్లో ఎగ్జిట్ అవకాశాలు తక్కువగా ఉండడం.
- తప్పనిసరిగా మొత్తం అయిదేళ్లు చదవాల్సిన ఆవశ్యకత.
- రీసెర్చ్ యాక్టివిటీస్‌లో పాల్పంచుకునే అవకాశం లేకపోతే.. నైపుణ్యాలు లభించని పరిస్థితి.
- పీజీ స్థాయిలో అందుబాటులో ఉన్న స్పెషలైజేషన్లనే ఎంచుకోవాల్సిన పరిస్థితి.

డ్యూయల్ డిగ్రీ కోర్సులు.. ముఖ్యాంశాలు

- టెక్, సైన్స్ విభాగాల్లో అత్యధికంగా డ్యూయల్ డిగ్రీ కోర్సులు.
- ఐఐటీలు, ఎన్‌ఐటీలు సహా పలు ప్రముఖ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్స్.
- రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీల్లోనూ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు.
- టెక్, మేనేజ్‌మెంట్ కోర్సుల కలయికగానూ పలు డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు.

ఆసక్తికి అనుగుణంగా

డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో చేరే విద్యార్థులు తమ ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా స్టెమ్ కోర్సుల్లో సుదీర్ఘ కాలం అధ్యయనం కొనసాగించాల్సి ఉంటుంది. కాబట్టి ఆసక్తి ఎంతో ప్రధానం. ఎగ్జిట్ ఆప్షన్ ఉన్న కోర్సులను, ఇన్‌స్టిట్యూట్‌లను ఎంచుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఒకవేళ నిజంగా ఆసక్తి ఉండి చేరితే మాత్రం కచ్చితంగా సదరు విద్యార్థులకు కెరీర్ పరంగా ఎన్నో రకాల ప్రయోజనాలు లభిస్తాయి.

–ప్రొ॥డి.ఎన్.రెడ్డి, యూజీసీ మాజీ సభ్యులు

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి కేసులో వృద్ధుడికి 20 ఏళ్ల జైలు

విశాఖ పోక్సో కోర్టు సంచలన తీర్పు

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఓ బాలికపై లైంగిక దాడి కేసులో 73 ఏళ్ల వృద్ధుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ విశాఖ పోక్సో కోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. విశాఖలోని ఆరిలోవ ప్రాంతంలో మూడో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలిక తల్లితో కలిసి నివాసముంటోంది. ఒక రోజు పాఠశాల నుంచి వచ్చి ఇంటి బయట స్నేహితులతో ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన కోలాటి బాలయోగి (73) బాలికకు మాయమాటలు చెప్పి అతడి ఇంటికి తీసుకువెళ్లి.. లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇలా సుమారు ఐదు నెలల పాటు బాలికను హింసించాడు. బాలికకు తరచూ కడుపునొప్పి వస్తుండడంతో తల్లి ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. వైద్య పరీక్షలో అసలు విషయం తేలింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దిశా పోలీస్‌స్టేషన్ ఏసీపీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ దర్యాప్తు చేసి నిందితుడు బాలయోగిని అరెస్టు చేసి పూర్తి ఆధారాలతో పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.రామశ్రీనివాస్ ముద్దాయి బాలయోగికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. అలాగే బాధిత బాలికకు నష్టపరిహారంగా రూ.4 లక్షలు ఇవ్వాలని తీర్పు వెలువరించారు.

20న ఏపీ పీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యాయామ విద్య కళాశాలల్లో బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ పీసెట్–2022 కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 20వ తేదీన ప్రారంభిస్తున్నట్లు పీసెట్ కన్వీనర్ ఆచార్య పి.జాన్సన్ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అధ్యక్షతన సోమవారం ఆన్‌లైన్‌లో జరిగిన ఏపీ పీసెట్ కమిటీ సమావేశంలో కౌన్సెలింగ్ ప్రక్రియ తేదీలు ఖరారు చేశారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, 21 నుంచి 23వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. ప్రత్యేక కేటగిరీకి చెందిన ఎన్‌సీసీ, క్యాప్ అభ్యర్థులు ఈ నెల 22న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని కోరారు. ఈ నెల 25, 26 తేదీల్లో ఆన్‌లైన్‌లో కళాశాలల ఎంపికకు ఆప్షన్స్, 27న వెబ్ ఆప్షన్స్ మార్చుకునే వెసులుబాటు, 29న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి నవంబర్ 4వ తేదీ వరకు అభ్యర్థులు తమకు సీటు వచ్చిన కళాశాలలో రిపోర్టు చేయాలని వివరించారు.

సీఏఎస్ పోస్టులకు రేపు కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. డీహెచ్, ఏపీవీవీపీ, డీఎంఈలోని 846 సీఏఎస్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి ఎంపికైన వారితో తొలి జాబితా విడుదల చేసింది. వీరిలో 586 మందికి పోస్టింగ్‌లు ఇచ్చింది. అయితే కొందరు ఇంకా విధుల్లో చేరలేదు. దీంతో మిగిలిన పోస్టుల భర్తీ కోసం రెండో జాబితాను విడుదల చేసింది. వీరంతా ఒరిజినల్ ధ్రువపత్రాలతో గొల్లపూడిలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో బుధవారం కౌన్సెలింగ్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఎవరైనా గైర్హాజరైతే.. ఎలాంటి నోటీసులు లేకుండా వారి ఎంపికను రద్దు చేస్తామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. వారికి బదులు తర్వాతి స్థానాల్లోని వారికి అవకాశం ఇస్తామన్నారు.

పోలవరం పూర్తికి సంపూర్ణ సహకారం

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం బాసట

- త్వరితగతిన తొలిదశ పూర్తికి వేగంగా నిధులిస్తామని హామీ
- సీఎస్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి లేఖ



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. గోదావరి ప్రవాహం సాధారణ స్థాయికి చేరుకునేలోగా తొలిదశ కింద ఇంకా పునరావాసం కల్పించాల్సిన తొమ్మిది వేల కుటుంబాల నిర్వాసితులకు నిధులను వేగంగా రీయింబర్స్ చేస్తామని తెలిపింది. కోతకు గురైన ప్రాంతంలో దిగువ కాఫర్ డ్యామ్‌ను 30.5 మీటర్ల స్థాయికి పూర్తి చేసి ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో నీటిని తోడి డయాఫ్రమ్ వాల్ పటిష్టతను తేల్చడం, అగాధాల పూడ్చివేత పరీక్షలు పూర్తి చేయాలని సూచించింది. వాటి ఆధారంగా డయాఫ్రమ్ వాల్‌పై, అగాధాల పూడ్చివేత విధానంపై సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించింది. ఆ మేరకు డయాఫ్రమ్ వాల్‌ను చక్కదిద్ది అగాధాలను పూడ్చి ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ పనులు చేపట్టి ప్రాజెక్టును పూర్తి చేయవచ్చని పేర్కొంది. దీనిపై కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మకు లేఖ రాశారు. జల్ శక్తి శాఖ నిధులను త్వరితగతిన విడుదల చేసి డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదిస్తే పోలవరం పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తుందని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తెలిపారు.

తొలిదశ పూర్తికి రూ.10,911 కోట్లు అవసరం..

పోలవరం తొలి దశ పనుల పూర్తికి అవసరమైన నిధులపై జలవనరుల శాఖ అధికారులతో చర్చించి, నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఆదేశించారు. ఈ క్రమంలో సెప్టెంబరు 6న జలవనరుల శాఖ అధికారులతో సీడబ్ల్యూసీ సభ్యుడు కుశ్వీందర్ వోహ్రా ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. తొలి దశ పనుల పూర్తికి రూ.10,911 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీకి రాష్ట్ర అధికారులు వివరించారు. ఈ సమావేశంలో వెల్లడైన అంశాల ఆధారంగా జల్ శక్తి శాఖకు సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా పోలవరం తొలి దశ పూర్తికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు జల్ శక్తి శాఖ సంసిద్ధత వ్యక్తం చేసింది.

సీఎం జగన్ కృషితో కదలిక

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రధాని మోదీతో జరిగిన ప్రతి సమావేశంలోనూ 2017–18 ధరల ప్రకారం పోలవరం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి ఆ మేరకు నిధులివ్వాలని గట్టిగా కోరుతున్నారు. ఈ క్రమంలో జనవరి 3న ప్రధాని మోదీతో ఢిల్లీలో సీఎం జగన్ సమావేశమై విభజన సమస్యలు పరిష్కరించడంతోపాటు పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం నియమించే కమిటీతో చర్చించేందుకు కేంద్ర కమిటీని ఏర్పాటు చేయాలని పీఎంవోని ప్రధాని మోదీ ఆదేశించారు. ఈ క్రమంలో జనవరి 24న కమిటీల సమావేశంలో వెల్లడైన అంశాలను ఆగస్టు 22న జరిగిన భేటీలో ప్రధానికి సీఎం జగన్ వివరించారు. విభజన సమస్యలను పరిష్కరించడంతోపాటు పోలవరాన్ని వేగంగా పూర్తి చేయడానికి అడ్‌హాక్‌గా రూ.పది వేల కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రధాని మోదీ ఆదేశాల మేరకు పీఎంవో కమిటీ పోలవరానికి అడ్‌హాక్‌గా రూ.పది వేల కోట్లను విడుదల చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపాలని కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్‌ను పీఎంవో ఆదేశించింది.

రాజధాని వ్యాజ్యాలపై నవంబర్ 28న విచారిస్తాం

- ఈలోపు సుప్రీం కోర్టు మా తీర్పుపై ఏం చెబుతుందో తెలుస్తుంది
- స్పష్టం చేసిన సీజే ధర్మాసనం
- పది రోజుల్లో ప్రభుత్వ ఎస్‌ఎల్‌పీ విచారణకు వచ్చే అవకాశం
- హైకోర్టుకు నివేదించిన ఏజీ



సాక్షి, అమరావతి: రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని ఆరు నెలల్లో అభివృద్ధి చేయాలంటూ తామిచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పీ) దాఖలు చేసిన నేపథ్యంలో, రాజధానిపై తమ ముందున్న వ్యాజ్యాలపై నవంబర్ 28న తదుపరి విచారణ జరుపుతామని హైకోర్టు తెలిపింది. ఈలోపు సుప్రీం కోర్టు తమ తీర్పుపై ఏం చెబుతుందో కూడా తెలుస్తుందని వ్యాఖ్యానించింది. సుప్రీం కోర్టులో తాము దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీలో లోపాలను రిజిస్ట్రీ తెలిపిందని, వాటిని సరిచేస్తామని, పది రోజుల్లో అది విచారణకు వచ్చే అవకాశముందని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, తదుపరి విచారణను నవంబర్ 28న చేపడతామని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌ల త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాజధాని నగరాన్ని, రాజధాని ప్రాంతాన్ని ఆరు నెలల్లో అభివృద్ధి చేయాలంటూ ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర అధికారులు ఉల్లంఘిస్తున్నారని, వీరి చర్యలను కోర్టు ధిక్కారంగా పరిగణించాలంటూ రాజధాని రైతులు దోనె సాంబశివరావు, తాటి శ్రీనివాసరావు తదితరులు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితో పాటు రాజధానికి సంబంధించి మరికొన్ని వ్యాజ్యాలపై సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరైన ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఎస్‌ఎల్‌పీని సాకుగా చూపుతూ హైకోర్టు తీర్పు అమలుకు గడువు పొడిగింపు కోరుతూ పోతోందని చెప్పారు. ఈ సమయంలో అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ స్పందిస్తూ.. పిటిషన్‌లో లిఖితపూర్వకంగా లేవనెత్తిన అంశాలపై మాత్రమే తాము సమాధానం ఇస్తామన్నారు. ఏది పడితే అది మాట్లాడితే స్పందించడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీపై ఏజీ చెప్పిన వివరాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకొని, తదుపరి విచారణను వాయిదా వేసింది.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు


- ప్రైవేటీకరణ విధానాలను వీడాలి
- ఓపీఎస్ అమలుకు కేంద్రం చర్యలు చేపట్టాలి
- అన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి
- సీపీఐ జాతీయ మహాసభల్లో మూడో రోజు 8 తీర్మానాలు

సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం తగదని, ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంట్‌ను కొనసాగించాలని సీపీఐ జాతీయ మహాసభ తీర్మానించింది. విజయవాడలోని గురుదాస్ దాస్‌గుప్తా నగర్(ఎస్ఎస్ కన్వెన్షన్)లో నిర్వహిస్తున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో భాగంగా సోమవారం ఎనిమిది తీర్మానాలు ఆమోదించారు. వివరాలను రాజ్యసభలో సీపీఐ పక్ష నాయకుడు బినయ్ విశ్వం, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 600 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలిపిందని చెప్పారు. పాత పెన్షన్ స్కీమ్(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానించినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు ద్వారాలు తెరవడం ఆపాలని, ఆయా సంస్థల్లో ఖాళీగా ఉన్న 14లక్షలకు పైగా ఉద్యోగాలను, వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 8 లక్షల పోస్టులను భర్తీ చేయాలని కూడా తీర్మానించినట్లు వివరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 2023 నాటికి వందేళ్లు అవుతున్న సందర్భంగా శత సంవత్సర ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మహాసభ తీర్మానించిందని తెలిపారు. మహాసభలో సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. పార్టీ నిర్మాణాన్ని క్రియాశీలకంగా మలచాలని ఆయన పిలుపునిచ్చారు.

‘సాల్ట్’ అమలు శభాష్

15 వేలకు పైగా పాఠశాలల్లో అభ్యాస వాతావరణాన్ని మెరుగుపరిచారు

- పాఠశాలలు మెరుగుపరచడం ద్వారా కీలకమైన ముందస్తు ఫలితాన్ని రాష్ట్రం సాధించింది
- కరోనా కష్టాల్లోనూ సమయానికి ఏజెన్సీలకు నిధులు విడుదల చేసింది.. కోవిడ్ నుంచి ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి
- ఏపీ సర్కార్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు అమలు పురోగతి సంతృప్తికరంగా సాగుతోందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చక్కగా అమలు చేస్తోందని కితాబిచ్చింది. పాఠశాల విద్యలో ఏపీ సర్కార్ చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మరింత మెరుగైన ఫలితాలను సాధించడానికి ప్రపంచ బ్యాంకు 250 మిలియన్ డాలర్లు ఆర్థికసాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ప్రాజెక్టు అమలు ఫలితాలపై ఆ బ్యాంకు అధ్యయనం చేసి నివేదికను వెలడించింది. ముఖ్యంగా రాష్ట్రంలో 15 వేలకు పైగా పాఠశాలల్లో అభ్యాస వాతావరణాన్ని మెరుగుపరిచిందని, తద్వారా కీలకమైన ముందస్తు ఫలితాన్ని రాష్ట్రం సాధించిందని.. ఏపీ సర్కార్ ఈ ప్రాజెక్టును ప్రశంసనీయ స్థాయిలో అమలుచేస్తోందని ఆ నివేదిక పేర్కొంది. ఇక కరోనా కారణంగా రాష్ట్రంతో పాటు జాతీయంగా కూడా స్థూల ఆర్థికంపై ప్రతికూల ప్రభావం కొనసాగుతోందని, అయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు స్పష్టమైన సంకేతాలు ఉన్నాయని ప్రపంచ బ్యాంకు నివేదికలో స్పష్టం చేసింది. అలాగే, ట్రెజరీ ద్వారా సకాలంలో నిధులు విడుదలవుతున్నాయని.. అమలుచేసే నోడల్ ఏజెన్సీలకు రాష్ట్ర ఖజానా నుంచి నిధులు అందుతున్నాయని పేర్కొంది. ప్రాజెక్టు అమలులో ఊహించిన కీలక ఆవిష్కరణలు, కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, సాంకేతిక సహాయ ఏజెన్సీల ఏర్పాటులో ప్రభుత్వం నిమగ్నమైందని వివరించింది. కార్యకలాపాల ప్రణాళిక, డెలివరీలో నోడల్ విద్యా సంస్థలకు మద్దతివ్వడానికి అవసరమైన చర్యలు, పనులను నిశితంగా పర్యవేక్షించేందుకు సాంకేతిక మద్దతును అందించడానికి టాస్క్ టీమ్‌నూ ఏర్పాటు చేసిందని ఆ నివేదిక పేర్కొంది.

కరోనాలోనూ పటిష్టంగా ఏర్పాట్లు

గత రెండేళ్లుగా కోవిడ్ మహమ్మారి కారణంగా ఏపీ సహా దేశవ్యాప్తంగా దాదాపు ఏడాదిపాటు విద్యా సంస్థలు మూతపడినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం మాత్రం పటిష్టంగా ఏర్పాట్లుచేసిందని బ్యాంకు పేర్కొంది. పాఠశాలల మూసివేత, పునఃప్రారంభ నిర్వహణకు సంబంధించిన ప్రక్రియల్లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు వ్యాప్తి చెందకుండా మార్గదర్శకాలు రూపొందించి అమలుచేసినట్లు ప్రపంచ బ్యాంకు ఏపీ సర్కార్‌ను ప్రశంసించింది. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్, టెలివిజన్, రేడియో, సోషల్ మీడియాను బలోపేతం చేశారని. తక్కువ ఆదాయ కుటుంబాల విద్యార్థులకు రిమోట్ లెర్నింగ్‌ను బలోపేతం చేసి అందుబాటులోకి తెచ్చిందని బ్యాంకు కొనియాడింది.

ప్రపంచ బ్యాంకు ప్రస్తావించిన ప్రధానాంశాలివే..

- విద్యా సంస్థల నిర్వహణ, సామర్థ్యాన్ని పెంచి తద్వారా ఆశించిన ఫలితాలను సాధించడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక మద్దతు ఏజెన్సీలను ఏర్పాటు చేసింది.
- స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌ఈఆర్‌టీ) మద్దతుతో వృత్తిపరంగా టీచర్ల అభివృద్ధి, అభ్యాస కార్యకలాపాలను అంచనా వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విభాగాన్నీ ఏర్పాటు చేసింది.
- ప్రాజెక్టు ఫలితాల సాధనకు థర్డ్‌పార్టీ ఏజెన్సీని, ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణకు ప్రోగ్రామ్ కన్సల్టెన్సీ ఏజెన్సీని కూడా ఏర్పాటు చేసింది.
- అలాగే, ప్రోగ్రాం డెవలప్‌మెంట్ ఆబ్జెక్టివ్ (పీడీఓ) సాధన దిశగా మొత్తం ప్రాజెక్టు పురోగతి సంతృప్తికరంగా కొనసాగుతోంది.
- ప్రాథమిక విద్యలో అభ్యాస ఫలితాలతో పాటు బోధనా విధానాల్లో నాణ్యత పెంచడం, పాఠశాలల నిర్వహణను మరింత మెరుగుపరచడమే ప్రాజెక్టు ప్రధానాశయం, లక్ష్యం. ఇందులో భాగంగా.. ప్రాథమిక దశలోనే ప్రాజెక్టు అమలు సంతృప్తికరంగా సాగుతోంది.
- పాఠశాలల నిర్వహణ, పనితీరుపై నిరంతరం సమాచారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రుల కమిటీలను మరింత పటిష్టం చేస్తోంది.

ప్రభుత్వ విద్యా సలహాదారుగా ఆలూరు సాంబశివారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యా సలహాదారుగా ఆలూరు సాంబశివారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ సోమవారం జీవో విడుదల చేసింది. కేబినెట్ ర్యాంకు హోదాతో సాంబశివారెడ్డిని ప్రభుత్వ సలహాదారు(విద్య)గా నియమిస్తున్నట్లు అందులో పేర్కొంది. ఆయన ప్రస్తుతం పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సీఈవోగా, ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. సాంబశివారెడ్డి స్పందిస్తూ.. తనపై నమ్మకం ఉంచి, మరింత బాధ్యత అప్పగించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

3టీ విధానంతో జర్మనీ, నార్వేకు ఎగుమతులు

- నేడు ఎగుమతి, దిగుమతిదారులతో సమావేశం
- సమావేశంలో పాల్గొంటున్న ఇరు దేశాల్లోని భారత రాయబారులు
- వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం తదితర రంగాల్లో అవకాశాల వివరణ
- ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద ఎగుమతి అవకాశాలపై చర్చ



రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన

సాక్షి, అమరావతి: ఎగుమతులను ప్రోత్సహించడంలో భాగంగా జర్మనీ, నార్వే దేశ అవకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ దేశాలతో టూరిజం, ట్రేడ్ (వ్యాపారం), టెక్నాలజీ ‘3టీ’ల్లో అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా మంగళవారం ఏపీఐఐసీ కార్యాలయంలో నార్వే, జర్మనీ దేశాల ఎగుమతి, దిగుమతిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశానికి నార్వే, జర్మనీ దేశాల్లోని భారత రాయబారులు బి.బాలభాస్కర్, పి.హరిష్ హాజరుకానున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన తెలిపారు. రాష్ట్రం నుంచి ఎగుమతికి అవకాశం ఉన్న ఉత్పత్తులు, సులభతర వాణిజ్యం కోసం అమలు చేస్తున్న ప్రణాళికలను జర్మనీ, నార్వే దేశ రాయబారులకు వివరించనున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉద్యాన ఉత్పత్తులు, మత్స్య సంపద, చేనేత, టెక్స్‌టైల్‌తోపాటు టూరిజం వంటి రంగాలపై దృష్టి సారించామని, మంగళవారం సమావేశానికి ఆయా రంగాల భాగస్వాములు హాజరవుతారని తెలిపారు. అలాగే ఒక జిల్లా ఒక ఉత్పత్తిలో భాగంగా ఆయా జిల్లాలకు చెందిన ఉత్పత్తుల ఎగుమతి అవకాశాలను వివరిస్తామని, ఇందులో భాగంగా కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కాకినాడ జిల్లా ఉత్పత్తులను ఆయా జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా వివరించనున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న అమృత్ సరోవర్ కార్యక్రమం వివరాలను కూడా వివరిస్తారు. రాష్ట్రం నుంచి 2021–22లో రూ.1,43,843.19 కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయి. ఇది దేశీయ మొత్తం ఎగుమతుల్లో 5.5 శాతం. దీన్ని 2030 నాటికి 10 శాతానికి చేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో భాగంగానే దేశంలోఎక్కడా లేనివిధంగా ఒకేసారి నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను రూ.25,000 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. దీంతోపాటు భావనపాడు, రామాయపట్నం, కృష్ణపట్నం, కాకినాడ, మచిలీపట్నం వద్ద పోర్టు ఆధారిత భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఇవన్నీ పూర్తయి, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.